నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:8 174 ఆగస్ట్ 2025 హైదరాబాద్

- తెలుగును మాకిచ్చేయండి!
- 'నేను' యౌగిక కావ్యం: పరిణామ పథం -ఛాయాచిత్రాల విశ్లేషణ
- మలేసియాలో తెలుగు వెలుగులు
- గల్ఫ్ దేశాల మోసాలు - ఎడారి మంటలు
- నిర్వాణ నవల - సవిమర్శనాత్మక పరిశీలన
- సంక్షోభకాలపు సవాల్ 'కంకపాద'



నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

ఆగస్టు 2025

సంచిక : 8

సంపుటి : 16

గౌరవ సంపాదకులు

ప్రొ॥ అడపా సత్యనారాయణ

సలహా మండలి

అల్లం నారాయణ

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ చింతా గణేష్

ప్రిన్సిపాల్ (పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ చింతకింది కాశీం

సంపాదకురాలు

స్నేహలత ఎం.

సంపాదకవర్గం

ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,

ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

డా॥చంద్రయ్య ఎస్. అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥శివరాత్రి సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥ఇమ్మిడి మహేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : శేషు

రచనలు పంపాల్సిన చిరునామా

స్నేహలత ఎం.,

ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్:**nadusthunnatelangana@gmail.com**

ఫోన్ నెం.: 9290745490

సంపాదకుని ఉత్తరం

అస్తిత్వమో
అభ్యుదయమో
ప్రగతిశీలమో
ఒకడు చెట్టు ఎక్కుతుంటే
మొదలును
రంపంతో కోసేవాడిని ఏమనాలి

వక్తృత్వమో
గాత్రమో
అభినయమో
ఒకడికి చప్పట్లు మోగుతుంటే
ద్వేషంతో
దహించుకునేవాడిని ఏమనాలి

రాముడు
వామనుడు
కృష్ణుడు
కాలం ఏదైనా
వాళ్లు
శత్రువును కూడా మెచ్చుకున్నారు

ఇది మనువనంతర కాలం
మిత్రుడు
సహచరుడు
వీరుడు
బంధమేదైనా
జంధ్యం పోగుతో
ఉరి పేనుతున్నారు

ఆగస్టు, 2025

నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

తెలంగాణ తొవ్వ

సంపాదకీయం

'తెలుగు'ను మాకిచ్చేయండి	డా॥చంద్రయ్య శివన్న	5

సామాజికం

మలేసియాలో 'తెలుగు వెలుగులు'	లాలం రమేష్	6

సాహిత్య పరిశోధన

తెలుగు సినిమా పాట భాషావైవిధ్యం	డా. బూర్ల చంద్రశేఖర్	10
'నేను' యౌగికకావ్యం: పరిణామపథం-ఛాయాచిత్రాల విశ్లేషణ	డా. జొన్నలగడ్డ వెంకటరమణ	16
'నిర్వాణ' నవల సవిమర్శనాత్మక పరిశీలన	డా. మల్లా పెంచల ప్రసాద్	21

సాహిత్య విమర్శ

గల్ఫ్‌దేశాల మోసాలు-ఎడారిమంటలు	డా. ఎ. మల్లేష్	25

పుస్తక పరిచయం

'కన్నీటి కాలువ'లో కొట్టుకుపోతున్న తాండాలు	డా॥సైదులు ఖేతావత్	**30**
దళిత జీవన ప్రతిబింబం-నెమలికన్నులు	దాసరి శ్రీనివాస్	**32**
చేదునాదు జీవితాన్ని కల్లుధారగా వొంపుతున్న కవి	తగుళ్ల గోపాల్	**36**
సంక్షోభ కాలపు సవాల్ 'కంకపొద'	డా.పసునూరి రవీందర్	**40**

కవిత

నువ్వొచ్చినప్పుడు	సూర్యచంద్ర డి.జి	**42**

పరిశోధన పరిచయం

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం	డా॥ఆర్.గోపాల్	**43**

నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.

వెబ్ పేజీ: https://nadustunnatelangana.com

'తెలుగు'ను మాకిచ్చేయండి!

డా. చంద్రయ్య శివన్న

ఆశ్చర్యకరమైన శీర్షిక కదా! నిజమే మీలాగే నేనూ మొదట విన్నప్పుడు ఆశ్చర్యం అని కాదు కానీ, ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. ఇలా అడుగుతున్నది ఎవరనుకుంటున్నారా? మలేషియాలో స్థిరపడ్డ తెలుగువారు. 150-200 ఏళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో ఉత్తరాంధ్ర తెలుగు ప్రాంతాల్ని వదిలి, పొట్టకూటికోసం వలసలుగా మొదట బర్మా దేశానికి, అటునుంచి రకరకాల కారణాల చేత మలేషియాకు వెళ్లిన తెలుగువారు. మొదటి దశలో వారు బతకడం మీదనే ఎక్కువ దృష్టి పెట్టారు. వారి కోసం ఏర్పాటు చేసిన తెలుగు పాఠశాలలు కొంతకాలం బాగానే నడిచాయి. తెలుగు ప్రాంతాల నుంచి ఆ పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాల తయారీ, అధ్యాపకుల విషయంలో సరైన స్పందన లేకపోయింది. అంతేకాకుండా మలేసియాలో తరువాతి తరంవారు తమ జీవికకోసం రకరకాల ఉద్యోగాల్లో పడి తెలుగును మర్చిపోవడంతో తెలుగు పాఠశాలలు క్రమంగా మూత పడిపోయాయి. అలా కొంతకాలానికి వారిలో తల్లిపేగు మెలిపెట్టింది. వారికి మాతృభాష మీద, తెలుగు నేల మీద, వారి అస్తిత్వ మూలాల మీద ప్రేమ, అభిమానం పెరిగి తెలుగు సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. మరిచిపోయిన తెలుగు భాషను తమ పిల్లలకయినా నేర్పించుకోవాలనే తపన ఈ సంఘాలను ముందుకు నడిపిస్తోంది. ఇక్కడ పిల్లలకు ప్రాథమిక, మాధ్యమిక, ప్రవీణ, విశారద పేర్లతో సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తూ తెలుగు భాషను నేర్పుతున్నారు. ఆ చైతన్యంతో 2013లో తెలుగు మహాసభలు కూడా జరుపుకున్నారు. ఇటీవల వారు స్థానిక ప్రభుత్వ సహాయంతో ఒక తెలుగు భవనాన్నీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ భవనాన్ని ఒక సాంస్కృతిక వేదికగా వారు ఉపయోగించుకుంటున్నారు. తెలుగు సమావేశాలు, పండగలు సామూహికంగా జరుపుకోవడానికి వారికి ఈ భవనం అస్తిత్వ ప్రతీకగా మారిపోయింది.

ఎన్నో ఏళ్ల క్రితం తెలుగు ప్రాంతాలనుంచి వచ్చిన వీరు అప్పటి భాషాప్రత్యేకతలను అలాగే నిలుపుకున్నారు. అప్పటి రక్తమాంసాలున్న తెలుగు భాషను పునర్నిర్మించాలంటే, మలేసియా తెలుగువాళ్లతో మాట్లాడాల్సిందే. ఆ ఉచ్ఛారణా వైవిధ్యాన్ని గుండెలకు అద్దుకునేవారు ఇక్కడి నేలను ముద్దాడాల్సిందే. ఒకవైపు మలయ్, మరోవైపు తమిళం భాషా ప్రభావాలను తట్టుకొని నిలబడింది. దీనికి కారణం బహుశా, వారంతా తమ ఇళ్లల్లో పూర్వపు తెలుగునే మాట్లాడడంవల్ల కావచ్చు. ఈ కాలమంతా ఇతర తెలుగు ప్రాంతాలతో అంతగా సంబంధం లేకపోవడంవల్ల కావచ్చు. ప్రాచీన సంబంధమైన భాషాసౌందర్యం ఒకటి మలేషియా తెలుగు భాషలో విని మురిసిపోవచ్చు. ముఖ్యంగా వీరంతా అనకాపల్లి, పాత వలస వంటి ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి వలస వెళ్లినవారు కావడం వల్ల ఆ ప్రాంత భాషా మాధుర్యం ఇప్పటికీ అలా సజీవంగానే తొనికిసలాడుతూ, ఉత్తరాంధ్రేతర తెలుగువారికి ముచ్చట గొలుపుతుంది. వాళ్ళు మాట్లాడినంత సేపు అలా వింటూ ఉండాలనిపిస్తుంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి ప్రాంతాల్లో ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు నడుస్తున్నాయని తెలిసి, వారు ఎంతగానో బాధపడుతున్నారు. ప్రవాస జీవితాన్ని గడుపుతోన్న మేము తెలుగును కోల్పోయి బాధపడుతుంటే, తపన పడుతుంటే, తెలుగు ప్రాంతాలవారు మాత్రం తెలుగును ఆంగ్ల భాషకు అప్పగించేశారని నిష్ఠూరమాడుతున్నారు. ఒక అడుగు ముందుకేసి, తెలుగుని కాపాడుకోవడం చేతకాకపోతే దాన్ని మాకు ఇచ్చేయండి. ప్రాణపదంగా చూసుకుంటాం అని తెగేసి అడుగుతున్నారు. ఈ మాటల్లో కేవలం ఆవేదన మాత్రమే కాదు గుండెలనిండా ప్రేమ కనిపిస్తోంది. సాటి తెలుగువారిపట్ల చూపే సానుభూతి కనబడుతుంది. వ్యంగ్యం ధ్వనిస్తోంది. ప్రధానస్రవంతి తెలుగు ప్రాంతాల్లో తెలుగు భాష మాధ్యమ భాషగా దూరంకావడానికి గల పరిస్థితులు వేరు. మలేసియావారికి ఈ విషయాలు తెలియక కాదు. కానీ, ఉద్యోగాలకోసం, విదేశాలకు వెళ్లడంకోసం తెలుగును పణంగా పెట్టాల్సిన దుస్థితిని తెలుసుకొని వారు బాధపడుతున్నారు. ఈ రెండింటిని పోటీగా చూడొద్దని వారు కోరుకుంటున్నారు.

మలేసియా తెలుగువారు విశారద సర్టిఫికెట్ కోర్స్ వరకే ఆగిపోకుండా ఆ తర్వాత తెలుగు డిప్లొమా కోర్స్ కూడా ఏర్పాటు చేసుకుని వారి పిల్లలకు తెలుగు విజయవంతంగా నేర్పిస్తున్నారు. మలేసియాలో వీరిది దాదాపు నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల జనాభా ఉన్నా, ప్రభుత్వ జనాభా లెక్కల్లో కేవలం ఒక లక్ష మాత్రమే నమోదుకావడంవల్ల వీరు ఎంతో మనోవేదనకు గురౌతున్నారు. చిత్తూరు ప్రాంతం నుంచి వచ్చిన తెలుగువారు తమిళియన్స్ గా పిలిపించుకోడానికే ఇష్టపడుతున్నారు. ఈ కారణాలచేత కూడా తెలుగువారి వాస్తవ జనాభా నమోదుకాలేదు. ఈ రెండు కారణాలవల్ల జనాభా దామాషా ప్రకారం మలేసియా తెలుగువారికి దక్కాల్సిన హక్కులు, అధికారాలు, రావాల్సిన సదుపాయాలు దక్కడంలేదు. దీనిద్వారా తెలుగువారి ఉనికే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వస్తోంది. ఈ దేశంలో తమ హక్కులకోసం, గుర్తింపుకోసం పోరాటం చేస్తూనే, వారి తెలుగు మూలాలను కాపాడుకోవాలనే తపన హృదయమున్న ఎవరినైనా కంటతడి పెట్టిస్తుంది. 'ఒకపరియైనా పోయిరావలె మలేసియాకు' అని అనిపించకతప్పదు. మరి తెలుగును ఒక భాషగా కాపాడుకోలేకపోతున్న మనం తెలుగును వారికి ఇచ్చేద్దామా! T

(డా. అచ్యయ్యకుమార్, ప్రొ. రెడ్డి శ్యామల, ప్రొ. పమ్మి పవన్ కుమార్, డా. ప్రతాప్ గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలతో...)

మలేసియాలో 'తెలుగు వెలుగులు'

లాలం రమేశ్

భారతదేశంలోనే కాకుండా భారతదేశానికి వెలుపల కూడా తెలుగు భాష, తన వెలుగులను విస్తరింపచేస్తూ ఉందని మనలో ఎంతమందికి తెలుసు? బ్రతుకుతెరువు కోసం ఇతర దేశాలకు బ్రిటిష్ హయాంలోనూ, తదనంతరం వలస వెళ్ళిన తెలుగువారు ఆయాదేశాలలో గత ఆరు తరాలుగా తెలుగు భాషను కాపాడుకుంటూ వస్తున్నారు. ముఖ్యంగా, మలేసియా, మారిషస్, మయన్మార్, సింగపూర్ దేశాలలో తెలుగు సంతతి అధికంగా ఉండి, తెలుగు భాష విస్తారంగా ఉంది. అలా బ్రిటిష్ హయాంలో మలేసియాకు వలస వచ్చిన తెలుగువారు, దేశం కాని దేశంలో వారి భాషలేని ప్రాంతంలో గత ఆరు తరాలుగా తెలుగు భాషను తమ కంటికి రెప్పలా కాపాడుకుంటూ ముందు తరాలకు భాషను అందించాలనే తపనతో వారు సాగించిన ప్రయాణమే "మలేసియా తెలుగు వెలుగు" అనే ఈ వ్యాసానికి ప్రేరణ. ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా మిగతా దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచే స్థాయిలో తెలుగు భాషను ఉన్నత శిఖరాలపై అధిరోహించేలా చేశారు. తెలుగు భాషా బోధన ఒక క్రమ పద్ధతిలో నిర్దిష్టమైన ప్రణాళికలతో మలేసియాలో నిరంతరాయంగా కొనసాగడం తెలుగువారందరికీ గర్వకారణం. ప్రభుత్వ సహాయ సహకారాలు లేకున్నా, ఇతర భాషల నుండి ముప్పు పొంచి ఉన్నా, తెలుగు నుడిని భవిష్యత్ తరాలకు అందించాలనే దృఢసంకల్పమే మహాబలంగా సాగిన ఈ తెలుగు ప్రయాణాన్ని మూడు దశలుగా విభజించవచ్చు.

1) ఉన్నత దశ 2) క్షీణ దశ 3) పునరుజ్జీవనం (స్వర్ణయుగం).

1) ఉన్నత దశ:

1890-1910 మధ్యకాలంలో బ్రిటిష్ పరిపాలనలో ఉన్న అప్పటి మలయ ద్వీపకల్పంలో (ఇప్పటి మలేసియా) రబ్బరు, కొబ్బరి, పామాయిల్ తోటల్లో పనిచేయటానికి ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి చాలామంది తెలుగువారిని బ్రిటిష్ వారు తీసుకొని వచ్చారు. అలాగే అల్పసంఖ్యలో తెలుగువారు చిత్తూరు పరిసర ప్రాంతాలు, అలనాటి మద్రాసు నుండి కూడా తీసుకుని వచ్చారు. అలా ఇక్కడికి వచ్చిన వలస కార్మికులకు వారి వారి ఎస్టేట్లో నివాసానికి ఇండ్లు, కూరగాయలు పండించుకోవడానికి, పశువులను పెంచుకోవడానికి కొంతస్థలాన్ని ఆయా కార్మిక కుటుంబాలకు కేటాయించారు. అదేవిధంగా ఆ కార్మికుల పిల్లలు చదువుకోవడానికి స్థానిక ఎస్టేట్లలో బడులను నిర్మించి, ప్రాథమిక విద్యాబోధన తెలుగు మాధ్యమంలోనే జరిగే విధంగా ఆంధ్రదేశం నుండి తెలుగు, ఇతర ఉపాధ్యాయులను రప్పించారు. వారి మతాచారాలకు సంబంధించి వారి గ్రామదేవతలైన భూలోకమ్మ, నూకాలమ్మ, రామాలయం గుడులను కూడా నిర్మించారు. ఇలా దేశం మొత్తంగా తమిళులు ఎక్కువగా ఉండే ఎస్టేట్లలో తమిళ బడులు, తెలుగువారు ఎక్కువగా ఉండే ఎస్టేట్లలో తెలుగు బడులు, తెలుగువారు తమిళవారు కలిపి ఉండే చోట తెలుగు-తమిళ బడులు ఏర్పాటు చేశారు. దేశం మొత్తం మీద సుమారు 65-70 చోట్లలో ముఖ్యంగా పేరాక్, కేడా, నెగెరి సెంబిలాన్, జోహూర్, సెలాంగోర్‌లో



గల రవాంగ్ ప్రాంతాలలో తెలుగుబడుల నిర్వహణ చక్కగా సాగింది. బ్రిటిష్ వారి పరిపాలనలో స్థానిక/మాతృభాషలలో విద్యాబోధనకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. అలా స్థానిక మలయ జాతివారికి మలయ బడులు, భారతీయులకు తెలుగు-తమిళ బడులు, భారతీయులలాగే ఇక్కడికి వలస వచ్చిన చైనీయులకు చీనాబడులు, బ్రిటిష్ వారికి ఆంగ్లబడులు ఏర్పాటు చేశారు. ఈ విధంగా చూసినట్లయితే ఆనాటి మలయ ద్వీపకల్పంలో బ్రతుకుతెరువుకోసం వచ్చిన తెలుగు కార్మికులు వారి తెలుగు సంస్కృతిని, భాషను ఇక్కడ దేశం కాని దేశంలో కొనసాగించేందుకు మంచి పరిస్థితులు ఏర్పడ్డాయి. మొదటగా వచ్చిన తెలుగు కార్మికులు అధిక శాతం నిరక్షరాస్యులు కావున, వారి పిల్లలను తెలుగుబడులకు పంపి తెలుగు అక్షరాలు దిద్దించారు. తెలుగు మాధ్యమంలోనే విద్యాబోధన సాగిన ఆంగ్లం కూడా బోధన విషయంగా ఉండేది. ఇదే క్రమంలో తెలుగు భాషాసంస్కృతుల అభివృద్ధికోసం 1956లో మలేసియా తెలుగు సంఘం స్థాపించుకున్నారు. ఈ విధంగా 1975 వరకు తెలుగు భాష ఉచ్ఛస్థితిలో ఉన్నది అని చెప్పవచ్చును.

2) క్షీణ దశ:

మనం ఇంతకుముందు చెప్పుకున్నట్లు, తెలుగు భాష ఉన్నతస్థితిలో ఉన్నప్పటికీ క్రమేపి పలు రకాల కారణాల వలన తెలుగు భాషాబోధన పతనం కావడం క్రమంగా ప్రారంభమైంది. ఈ ధోరణి మొదట ప్రారంభమైంది విద్యాధికులు, ఉన్నతశ్రేణి ఉద్యోగాలలో ఉన్న తెలుగువారితో అని చెప్పవచ్చును. అప్పట్లో అధిక శాతం తెలుగు కార్మికులు తమ పిల్లల్ని తెలుగుబడులకే పంపేవారు. అయితే ఈ ఉన్నతశ్రేణి ఉద్యోగాలలో ఉన్న తెలుగువారు, వారి పిల్లలను ఆంగ్ల బడులకు పంపడం మొదలుపెట్టారు. ఈ ధోరణి 1980లలో ప్రారంభమైందని చెప్పవచ్చు. అదేవిధంగా, మలేసియాలో భారతీయులకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీ “మలేసియన్ ఇండియన్ కాంగ్రెస్” లో అధిక శాతం తమిళవారు ఉండడం, ఆ పార్టీలో చేరిన తెలుగువారు నాయకులుగా ఎదగడంకోసం తమిళ నాయకులతో కలిసి తెలుగు భాషను విస్మరించారు. అంతేకాకుండా, వారి స్వార్థ ప్రయోజనాలకోసం తెలుగుబడులకు పంపితే, మనకు ఏమీ లాభం ఒరగదని (ఉద్యోగ అవకాశాల రీత్యా) అదే ఆంగ్లబడులకో, తమిళ బడులకో పంపితే భవిష్యత్తు బాగుంటుందని మిగతావారినీ ప్రభావితం చేశారు. దీనితో చాలామంది తెలుగువారు వారి పిల్లల్ని తెలుగు బడులకు కాకుండా మిగతా బడులకు పంపడం మొదలుపెట్టారు. అలానే తెలుగు-తమిళ ఉమ్మడి పాఠశాలల్లో ఎక్కువగా తమిళులే ప్రధానోపాధ్యాయులుగా ఉండేవారు. వారు అధిక ప్రాధాన్యం తమిళ విద్యాబోధనకే ఇచ్చేవారు. ఏమాత్రం అవకాశం దొరికినా, తెలుగు విద్యార్థుల సంఖ్య తగ్గినా పూర్తిగా తెలుగు విద్యాబోధనను అటకెక్కించేసేవారు. ఇక తెలుగు ఉపాధ్యాయుల సంగతి మరోలా తయారయింది. 1980 దశకం వచ్చేసరికి మెల్లమెల్లగా తెలుగుబడులలో పనిచేసే ఉపాధ్యాయులకు పదోన్నతుల అవకాశం ఉండదని తమిళ బడులకు వారు బదిలీ చేయించుకుని మారిపోయారు. ఇలా క్రమేపీ ఉపాధ్యాయుల కొరత వలన చాలా తెలుగుబడులు తమిళ బడులుగా మారిపోయాయి. 1990 వచ్చేసరికి చాలామంది తెలుగువారు గ్రామాలనుండి పట్టణాలకు తరలిపోయారు. దీనితో తెలుగు బడులు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయి. అప్పటి తెలుగు సంఘం నాయకులు, తెలుగు ప్రేమికులు వారిస్థాయిలో కొన్ని ప్రయత్నాలు చేసినా, సరైన దిశానిర్దేశం లేక ఫలితం కరువయ్యింది. అయితే గుడ్డిలో మెల్లలా మలేసియా ప్రభుత్వం అప్పట్లో దేశంలో నివసించే వివిధ జాతులవారికి వారి మాతృభాషను బోధించేలా (1970వ దశకంలోనే) “పీపుల్స్ ఓన్ లాంగ్వేజ్” అనే కార్యక్రమాన్ని చేపట్టారు, ఆ కార్యక్రమం వలన కొన్ని తమిళ, మలయ బడులలో 15 మందికి తక్కువ కాకుండా విద్యార్థులు ఉంటే వారి మాతృభాషను బోధించడానికి నిధులు కేటాయించేవారు. అయితే ప్రభుత్వ శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు మాత్రమే ఈ తెలుగు తరగతులు బోధించడానికి అర్హులు. అయినప్పటికీ, మొదట్లో ఈ తెలుగు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండటంవలన ఈ తరగతులు బాగానే నడిచాయి. కాలక్రమేణా ఈ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందడం వలన ఉపాధ్యాయుల కొరత ప్రారంభమైంది. కొంచెం కొంచెంగా తెలుగు బోధించే ఉపాధ్యాయులే లేకుండా పోయారు. మొత్తంగా తెలుగువారి నుండి స్పందన లేకపోవడం వలన ఈ తరగతులు కూడా ఆశించిన స్థాయిలో సఫలం కాలేదు. 2000వ దశకం వచ్చేసరికి మొత్తం తెలుగుబడులు, తెలుగు తరగతులు అన్నీ మూతపడిపోయాయి. మలేసియాలో ఈ దశ తెలుగు భాషకు చీకటి దశగా చెప్పవచ్చును.

3) పునరుజ్జీవనం:

తెలుగు భాషాబోధన పూర్తిగా కనుమరుగైపోయి ఇటువంటి అంధకార పరిస్థితులను చూస్తున్న తెలుగు సంఘ నాయకులలో, తెలుగు భాషా ప్రేమికులలో తీవ్ర నిస్తేజం అలముకుంది. ఇవే పరిస్థితులు కొనసాగినట్లయితే, తెలుగు భాష పూర్తిగా కనుమరుగైపోయి తెలుగుతరం అని చెప్పుకునే

వారే భవిష్యత్తులో ఇంక మిగలరని, తరువాత తరాలకు తెలుగు భాషను వారసత్వంగా అందించలేమన్న ఆందోళన, మనోవ్యథ వారి మనసును తీవ్రంగా కలిచివేసింది. ఎవరికి వారు, వారి పరిధిని బట్టి కొన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పరిస్థితులు సహకరించడం లేదు. ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదు. తోటి భారతీయ సోదరులైన తమిళులు ఎక్కువగా ఉండే మలేసియన్ ఇండియన్ కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా ఎటువంటి ఆదరణ లేదు. తెలుగు భాషను పునరుద్ధరించాలన్న బలమైన తపన, ఈ పరిస్థితులను ఎలాగైనా అధిరోహించాలన్న తలంపు తప్ప, వేరే ఏ విషయానికి మలేసియా తెలుగు వారి బుర్రలో చోటు లేదు. ఆ తరుణంలోనే మలేసియా తెలుగు సంఘానికి ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న డత్తో డా. అచ్చయ్య కుమార్ రావు గారి రూపంలో ఒక ఆశా కిరణం ఉదయించింది. చిమ్మచీకటిలో చిరుదీపంలా ఒక ప్రయత్నం జరిగింది. 2003వ సంవత్సరంలో కెడా, పేరాక్ ప్రాంతాలలోని పిల్లలతో కలిపి, బడులకు సంవత్సరాంతర సెలవులు కావడంతో బాగన్ డత్తో ప్రాంతంలోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో ఒక పది రోజులపాటు సుమారు 35 మంది పిల్లలతో తెలుగు తరగతుల శిబిరం నిర్వహించారు. ఈ చిరు ప్రయత్నానికి డత్తో డా. అచ్చయ్య కుమార్ రావు గారికి అండగా నిలబడుతూ బుద్ధా శ్రీరాములు గారు, వెలగ అప్పలనాయుడు గారు, రామారావు గారు, గణేశన్ గారు, రాము నాయుడు గారు, డివి శ్రీరాములు గారు, తెలుగు ఉపాధ్యాయులు బొడబల్ల సింహాచలం గారు, రాములు మాస్టారు గారు ఇంకా ఇతరుల సహాయసహకారాలు అందించారు. వెయ్యి మైళ్ల ప్రయాణమైనా, ఒక అడుగుతోనే ప్రారంభం అవుతుందంటారు. అలా మలేసియాలో తెలుగు భాషా ఉద్యమం ఈ చిరు ప్రయత్నంతోనే ఆరంభమయ్యింది. ఈ ప్రయత్నం అందరికీ నచ్చి తదుపరి సంవత్సరాలలో కూడా ఇటువంటి శిబిరాలే జరపాలని నిర్ణయించుకున్నారు. 2004, 2005 సంవత్సరాలలో నిర్వహించిన తెలుగు తరగతుల శిబిరాలకు 70 పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే అచ్చయ్య కుమార్ రావు గారు తెలుగు సంఘం ప్రధాన అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ఈయన ఎంతో దూరదృష్టి కల నాయకుడు. వారు ఈ సంవత్సరాంతర శిబిరాలను మరింత పటిష్టంగా జరపాలని, తెలుగు సంఘం నిధులతోనే దేశం మొత్తం మీద ఉన్న తెలుగు విద్యార్థులను ఒక ప్రాంతానికి చేర్చి అక్కడ “తెలుగు నీతి శిబిరం” పేరుతో తెలుగు తరగతులు నిర్వహించడం మొదలుపెట్టారు. ఈ సంఖ్య నానాటికి పెరుగుతూ ప్రతి నీతి శిబిరానికి సుమారు 400 మంది పిల్లలు హాజరవుతున్నారు. అయితే అచ్చయ్య కుమార్ రావు గారి ఆలోచనలు ఇంతటితో ఆగిపోలేదు. తనలోని తెలుగు తృష్ణ, తెలుగు భాషను పెంపొందించాలనే బలమైన ఆశయాలు ఈ భాషాఉద్యమాన్ని మరింత ఉధృతంగా ముందుకు నడిపించాయి.

తెలుగు సంఘానికి దేశం మొత్తం మీద ఉన్న శాఖలలో ప్రతివారం ఏదో ఒక రోజున మూడు గంటలపాటు తెలుగు తరగతులు నిర్వహించాలని సంకల్పించారు. తెలుగు తరగతులు నిర్వహిస్తేనే, ఆ తెలుగు సంఘపు శాఖ బ్రతుకుతుందని లేదంటే అది నిర్వీర్యం అవుతుందని అందరికీ తెలియజెప్పి తదితర శాఖల చైర్మన్లను ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండేలా ఒప్పించారు. ఈ సంకల్పానికి మొదట్లో కొంతమంది కలిసి రాకున్నా, వద్దని వారించినా అచ్చయ్య కుమార్ గారు తలవంచలేదు. ఎంతోమంది తెలుగు భాషాభిమానులు, తెలుగు సంఘ నాయకులు, తెలుగు ఉపాధ్యాయులు ఆయన తలచిన ఈ ప్రయత్నంలో సహకరించి, ఆయనతో కలిసి ముందుకు సాగడానికి తరలివచ్చారు. దానితో దేశం మొత్తం మీద ఉన్న 30 శాఖలలో వారంలో ఒక రోజున తెలుగు తరగతుల నిర్వహణ ప్రారంభమమై, అది ఇప్పటికీ నిరాటంకంగా కొనసాగుతూ ఉంది. కానీ ఇంతటితో సంతృప్తి పడిపోయే వ్యక్తి కాదు ఈ అచ్చయ్య. తెలుగు భాష బోధన ఒక క్రమపద్ధతిలో జరగాలని, దానికి నిర్దిష్టమైన బోధన ప్రణాళిక ఉండాలని భారతదేశంలోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో(ఇప్పుడు సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం) ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, విశ్వవిద్యాలయంతో ఎన్నో చర్చలు జరిపి, తెలుగు భాషాబోధనను నాలుగు విభాగాల స్థాయిలలో నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నారు. అలా ప్రవేశిక, మాధ్యమిక, ప్రవీణ, విశారద వంటి సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టి, సంవత్సరాంతర తెలుగు నీతి శిబిరంలో తెలుగు విశ్వవిద్యాలయం వారే స్వయంగా వచ్చి, పరీక్షలు నిర్వహించి, ఆ జవాబు పత్రాలను తిరిగి భారతదేశం తీసుకువెళ్ళి, వాటిని మూల్యాంకనం చేసి పాసైన విద్యార్థులకు తెలుగు విశ్వవిద్యాలయం సర్టిఫికెట్లను జారీచేసేలా ప్రణాళికలు జరిగాయి. “ఇంతింతై వటుడింతై” అన్న చందంగా అచ్చయ్య గారి అధ్యక్షతన చేపట్టిన ఈ సంస్కరణలు మంచి ఫలితాలని అందిస్తూ ఇప్పటివరకు మలేసియా దేశం మొత్తం మీద సుమారు 7000 మందికి పైగా విద్యార్థులు తెలుగు భాషను అభ్యసించారు.

ఈ క్రమంలోనే మలేసియాలో తెలుగు భాషాధ్యయన కేంద్రం ఒకటి ఏర్పరచాలనే ఆలోచన అచ్చయ్య గారి మస్తిష్కంలో పురుడుపోసుకుంది. తన ఆలోచనలను సంఘంలోని మిగతా నాయకులతో పంచుకొని, ఇంతకు ముందుతరం

నాయకులు ఏర్పాటు చేసిన తెలుగు సాంస్కృతిక నిలయానికి ఉన్న 4.5 ఎకరాల భూమిలో తెలుగు భాష అధ్యయన కేంద్రం "మలేసియా తెలుగు అకాడమీ" ఏర్పాటు చేసే బృహత్తర కార్యానికి శ్రీకారం చుట్టారు. దీనికి ప్రభుత్వ సహకారంతోపాటు, ఆయా సంఘం శాఖలు, తెలుగు భాషాభిమానులు తమ దాతృత్వాన్ని చాటుకొని విరాళాలు అందించారు. తెలుగు భాష మీద తమ అంతులేని ప్రేమను చాటుకున్నారు. రెండు సంవత్సరాల కాలంలోనే సుమారు 16 మిలియన్ల రింగట్లతో నాలుగు అంతస్తుల తెలుగు అకాడమీ భవనాన్ని నిర్మించారు. అచ్చయ్య గారు ఇచ్చిన పిలుపును అందుకొని మలేసియా తెలుగు భాషాభిమానులందరూ ఈ మహాయజ్ఞంలో పాలుపంచుకున్నారు. 2018లో శాస్త్రప్రకారం తెలుగు అకాడమీ గృహప్రవేశం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక భవనం అద్దెకు తీసుకొని నిర్వహించే తెలుగు నీతి శిబిరం తరగతులకు కూడా ఒక శాశ్వత చిరునామా చేకూరింది. 2018 డిసెంబర్ లో మలేసియా తెలుగు అకాడమీలో తొలి తెలుగు నీతి శిబిరం మొదలైంది. ఆగ్నేయ ఆసియాలోనే తెలుగు భాష యొక్క మొట్టమొదటి అధ్యయన కేంద్రంగా పేరుగాంచింది. నిరంతర తెలుగు భాషాపిపాసి అయిన డా. అచ్చయ్య గారు ఇంతటితో అలసిపోలేదు. తెలుగు విద్యాబోధనను డిప్లమో స్థాయికి తీసుకువెళ్ళాలనే ఆశయాన్ని పెట్టుకున్నారు.

అయితే, ఇక్కడ అచ్చయ్య గారు మరోలా ఆలోచించారు. ఇకపై ఈ తెలుగు ప్రయాణాన్ని యువకులైతే మరింత విస్తృతంగా, చురుగ్గా ముందుకు తీసుకెళ్ళగలరని విశ్వసించారు. ఆ ఆలోచనలను మిగతా సంఘ కేంద్ర నాయకులు, ఆయా శాఖల నాయకులతో పంచుకొని సమాలోచనలు చేసి తెలుగు భాషాభిమానం నరనరాన ఇనుమడింప చేసుకున్న ఒక యువకుడిని తెలుగు సంఘ ప్రధాన అధ్యక్షునిగా ఎన్నుకున్నారు, ఆయనే డా. వెంకట ప్రతాప్ గారు. వృత్తిరీత్యా వైద్యుడైనా, తెలుగు ఉపాధ్యాయుల కుటుంబంలో పుట్టిన ఈయన, స్వతహాగానే తెలుగు భాషాభిమాని. డాక్టర్ అచ్చయ్య కుమార్ గారి డిప్లమో ఆలోచనలను డాక్టర్ వెంకట ప్రతాప్ గారు ముందుకు తీసుకువెళ్ళారు. తొలి చిరు ప్రయత్నంగా అమెరికాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంలో మలేసియా నుండి అంతర్జాలంలో తెలుగు డిప్లమో కోర్సు పూర్తిచేసేలా ఒప్పందం చేసుకొని సుమారు ఐదుగురు విద్యార్థులతో ముందడుగు వేశారు. తర్వాత సంవత్సరం మరొక ఐదుగురు పిల్లలతో కూడిన మరొక జట్టుతో డిప్లమో కోర్సు కొనసాగింది. ఈ డిప్లమో కోర్సు మంచి ఫలితాలను ఇచ్చినా అధికవ్యయంతో కూడుకున్నది. అంతేకాకుండా, కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఉన్నవి. అప్పుడు డాక్టర్ వెంకట ప్రతాప్ గారు వారి అధ్యక్షతన ఒక ప్రతినిధి బృందం ఏర్పాటు చేసుకున్నారు. ఆ బృందంలో తెలుగు అకాడమీ ప్రధానోపాధ్యాయులు వెలగ అప్పలనాయుడు గారు, తెలుగు సంఘం సహాయ అధ్యక్షులు సురేశ్ నాయుడు గారు, ఇతర ఉపాధ్యాయులతో హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి వెళ్ళి, మలేసియా తెలుగు విద్యార్థులకు

తెలుగు డిప్లమో కోర్సు అందించవలసిందిగా కోరారు. అయితే ఇప్పటివరకు తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు భాష మీద డిప్లమో కోర్సును రూపొందించనే లేదు. విశ్వవిద్యాలయం వారితో పలు దఫాలుగా ఎన్నో చర్చలు, ఎన్నో సమాలోచనలు జరిపి మొత్తానికి ప్రతాప్ గారు అనుకున్నది సాధించారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు మలేషియా తెలుగు విద్యార్థులకు డిప్లమో "తెలుగు భాషా అధ్యయనం" కోర్సును రూపొందించేందుకు ముందుకు వచ్చారు. ఆచార్య రెడ్డి శ్యామల గారి అధ్యక్షతన అధ్యాపక బృందాన్ని మలేసియా తీసుకువచ్చి, ఇక్కడి తెలుగు విద్యార్థులు – వారి తెలుగు భాష పరిస్థితులను తెలుసుకునేలా ఏర్పాట్లు చేసి, వారి స్వగృహంలోనే అధ్యాపక బృందానికి ఆతిథ్యమిచ్చి పాఠ్యాంశాల రూపకల్పన జరిగేలా చూసుకున్నారు డా. ప్రతాప్ గారు. పలు రకాల అంశాలు చర్చించి, స్థానిక భాషాపరిస్థితులను వివరించి, మొత్తానికి తెలుగు డిప్లమో కోర్సును రూపొందించారు. ఈ మొత్తం ప్రక్రియలో దత్తు డాక్టర్ అచ్చయ్య కుమార్ రావు గారు తెలుగు సంఘం గౌరవ సలహాదారునిగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తగిన సలహాలు, సూచనలు అందిస్తూ వారి అమూల్యమైన సహాయ సహకారాలు అందించారు. ఈ డిప్లమో పరీక్షలు కూడా సంవత్సరాంతంలో జరిగే నీతి శిబిరంలో నిర్వహించేటట్లు, ఆ సమాధాన పత్రాలు భారతదేశము తీసుకువెళ్ళి మూల్యాంకనం చేసి ఫలితాలు అందించేలా ఏర్పాట్లు జరిగాయి. ఉత్తీర్ణులైన వారికి తెలుగు విశ్వవిద్యాలయం వారి నుండి ఉత్తీర్ణతా పత్రాలు అందజేయబడతాయి. ఇలా అచ్చయ్య కుమార్ గారి ఆశయాన్ని ఎంతో నిబద్ధతతో డాక్టర్ ప్రతాప్ గారు సుసాధ్యం చేశారు. ప్రస్తుతానికి 20 మంది విద్యార్థులు తెలుగు డిప్లమో కోర్సును చదువుతున్నారు. మలేసియా తెలుగు చరిత్రలో ప్రస్తుత దశ తెలుగు భాషకు స్వర్ణయుగంగా అభివర్ణించవచ్చును. ఇంతటి మహా తెలుగు యజ్ఞాన్ని చేస్తున్న మలేసియా తెలుగు సంఘం నాయకులు, తెలుగు భాషాభిమానులు ప్రపంచంలోని తెలుగు వారందరికీ ఆదర్శప్రాయులు.

రచయిత: తెలుగు అధ్యాపకులు, మలేసియా

తెలుగు సినిమా పాట - భాషావైవిధ్యం

డా. బూర్ల చంద్రశేఖర్

వ్యాస సంక్షిప్తి:

1931- 2000 వరకు వచ్చిన సినిమాలలోని పాటల్లో భాషా ప్రయోగాలు, ఔచిత్యాలు, అలంకారాలు, ధ్వని వైవిధ్యాలను సాహిత్య లక్షణాలను తెలపడం ప్రధాన ఉద్దేశం. అలాగే మొదట వచ్చిన సినిమాల్లో గ్రాంథిక భాషా వాసనలు, తరువాత వచ్చిన భాషా ప్రయోగాలు, పరిణామం తెలిపాను. అలాగే గత 30 సంవత్సరాలుగా సినిమా పాటల్లో వచ్చిన మిశ్రభాష గురించి, దాని ఆవశ్యకత, అనివార్యత గురించి తెలిపాను. అలాగే పైన తెలిపిన కాలాన్ని ఏడు దశాబ్దాలుగా ఇలా 1931- 1940 , 1941- 1950, 1951- 1960 ,1961- 1970 ,1971- 1980, 1981- 1990 ,1991- 2000 సౌలభ్యత కోసం, స్పష్టంగా వివరించడం కోసం విభజించుకొని విశ్లేషించాను. భాషపై ఆయా కాలంనాటి సామాజిక, సాంస్కృతిక ప్రభావాలను వివరించాను.

కీలక పదాలు:

సినిమా పాట, భాషా వైవిధ్యం, రచయిత, దశాబ్దం, గ్రాంథికభాష, నిత్యవ్యావహారిక పదాలు, ధ్వనిపరిణామాలు, అర్థపరిణామాలు, సామెతలు, జాతీయాలు, అన్యదేశాలు, మాండలికాలు, చేదర్థక, విధ్యర్థక మొదలగు క్రియా పదాలు, కృత్తద్ధిత పదాలు వాక్యనిర్మాణం.

పరిచయం:

సంగీత, సాహిత్య, అభినయాల మేలవింపే సినిమా పాట. పాట సాహిత్యంలో ఒక ప్రక్రియ. సాహిత్యానికున్న లక్షణాలన్నీ పాటకూ అన్వయిస్తాయి. సృష్టిలోని ఏ కవితకైనా స్పందించే గుణం ఉండాలి. పాటకు శ్రోతను స్పందింపజేసే గుణం ఎక్కువగా ఉంటుంది. అందులో దృశ్యాత్మకమైన సినిమా పాటకు ఆ గుణం మరీ ఎక్కువ. అలాంటి సినిమా పాటలో భాష, భావం, అలంకారాలు, ధ్వని మొదలైన సాహిత్య లక్షణాలను పరిశీలించవచ్చు. ఏదేని ఒక మంచి పాట వినగానే 'ఎంత బాగా రాసాడు' అని అంటారు. అంటే పాటలోని సాహిత్య పదాల కూర్పే కాకుండా అందులో భావ వ్యక్తీకరణకు ఉపయోగపడిన భాషావైవిధ్యం కూడా ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఎలాంటి భాష వాడారు, ఏనాటి భాష వాడారు, దాని వెనుక ఉన్న సామాజిక, సాంస్కృతిక, సమకాలీన పరిస్థితుల ప్రభావం ఎంతవరకుంది, దాని ద్వారా రచయిత ఆశించిన ప్రయోజనమేంటి అనే విషయాలను మనం గమనించవచ్చు.

తెలుగు తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద 1931, సెప్టెంబర్ 15 న వెలువడింది. నాటి నుండి నేటివరకు సినిమా పాటను భాషా కోణంలో చూసినట్లైతే ఎంతో వైవిధ్యం కనబడుతుంది. దాదాపు ఎనిమిది దశబ్దాల తెలుగు భాషను, దాని పరిణామాన్ని అధ్యయనం చేయవచ్చు.

పాటలలో వాడిన గ్రాంథికభాష, నిత్యవ్యావహారిక పదాలు, ధ్వనిపరిణామాలు, అర్థపరిణామాలు, సామెతలు, జాతీయాలు, అన్యదేశాలు, మాండలికాలు, చేదర్థక, విధ్యర్థక మొదలగు క్రియా పదాలు, కృత్తద్ధిత పదాలు మొదలగునవి పరిశీలించవచ్చు. అలాగే వాక్యనిర్మాణ పరిణామ విషయాలను కూడా గమనించవచ్చు.

ఉదా: గ్రాంథిక భాషనే తీసుకున్నట్లైతే సినిమా వచ్చిన కొత్తలో ఎక్కువగా పాటలపై పద్యప్రభావమే ఉంది. కాబట్టి పద్యాలలో వాడే గ్రాంథిక భాషనే ఎక్కువగా ఉండేది. మొదట్లో గ్రాంథిక పదాలు ఎక్కువగా ఉన్నా రానురాను సరళగ్రాంథికంగా, వ్యవహారిక భాషవాడుతూ రాసిన పాటలు ఎక్కువగా వచ్చాయి. నేడు ఆంగ్లపద సమ్మిళితమైన పాటలు కూడా కనిపిస్తున్నాయి.

"పరితాపంబు భరియింప తరమా కటకట నేవిధి గడువంగ జాలుదు" (భక్త ప్రహ్లాద-1931)

"నీదు మనసే నిండు కుండ, నీదు ఓరిమి భూమి ఓరిమి..."(కన్నతల్లి-1953) అనడంలో పై పాటలోని భాషలో గ్రాంథిక పదాలైన *పరితాపము, కటకట, నీదు ఓరిమి, మేలు వరవడి, నడవడి* మొదలగునవి కనడుతాయి.

ఇప్పుడు **"జూబ్లీ హిల్సొ బంగ్లాయివ్వు లేనిచో హైటెక్ సిటీయివ్వు, హైజాకవ్వని షైటొకటివ్వు"** (ఖడ్గం-2002)

"కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి ఆడితే ఆడాలిరా రఫాడాలి" (ఠాగూర్-2003 - చంద్రబోస్) మొదలగు మిశ్రమభాషా వ్యక్తీకరణలు కోకొల్లు కనబడతాయి. ఈ విధంగా తొలి సినిమా దగ్గర్నుంచి ఇప్పటి వరకు వచ్చిన పాటలలో భాషను వివిధ కోణాల్లో అధ్యయనం చేస్తూ నూత్న విషయాలను వెలికితీయవచ్చు.

దశాబ్దాల వారీగా వచ్చిన సినిమా పాటలు – భాషావైవిధ్యం – విశ్లేషణ:

పాట సినీసాహిత్యంలో 1931లోనే అడుగు పెట్టింది. మొదట గ్రాంథిక రూపంలో పద్యఛాయలతో ఉన్న సినిమా పాట క్రమ పరిణామ వికాసాలను పొందుతూ వస్తోంది. భాషను సూత్రాలతో బంధించలేం. ఇవాళ నిర్మించుకున్న సూత్రం రేపటికే మారిపోవచ్చు. భాష ప్రవాహశీలం కలిగింది. ప్రజల నోళ్ళే దాని వాహకం. కాబట్టి ఒక సూత్రాన్ని నిర్మించి అదే అందరు అనుసరించాలి అనే కఠిన నిబంధనలు పెట్టడం అంత తెలివైన పనికాదు. కాని సంవత్సరాల తరబడి వస్తున్న భాషలో పరిణామాన్ని శాస్త్రీయంగా పరిశోధించి సూత్రీకరణ మాత్రం చేయవచ్చు.

లిఖిత భాషకు, మాట్లాడే భాషకు చాలా తేడా ఉంటుంది. మాట్లాడే భాషకు వెనుక ముందులుండవు రాసేభాషలో అవుంటాయి. మాట్లాడే భాష కొన్ని అవసరాలు మాత్రమే తీరుస్తుంది. రాసే భాష అంతంలేని విజ్ఞానాన్ని అందించగలుగుతుంది. ఒక వ్యక్తి ఇంకో వ్యక్తితో సంభాషణ జరిపినప్పుడు వాడిన భాషను అదే విధంగా మనం రాయలేం. ఒక వేళ రాయడానికి ప్రయత్నించినా సమగ్రంగా ఉండదు. అంటే మనం రాసేటప్పుడు ఎడిట్ చేస్తూ రాస్తాం. ఎందుకంటే మాట్లాడేది మరుక్షణమే నశిస్తుంది కాని రాసేది శాశ్వతంగా ఉంటుంది. ప్రణాళికా బద్దంగా మనం నిత్యం మాట్లాడుకునే భాష ఉండదు, కాని ప్రణాళికాబద్దంగానే రాస్తాం. సినిమా పాట కూడా రాసినటువంటిదే కనుక అందులో చాలా జాగ్రత్తగా, కవిత్వీకరణకుపయోగపడే పదాలను వాడుతూ రాస్తారు. దానివల్ల ఆ పాట రచించిన కాలంనాటి భాష అదే అని మనం నిక్కచ్చిగా చెప్పలేం. ఇంట్లోగాని, బయటగాని మనుషులు సీరియల్లలో, సినిమాలలో మాట్లాడినట్లు మాట్లాడుకోలేరు ఒక వేళ అలా ప్రయత్నపూర్వకంగా మాట్లాడితే కృతకంగా ఉంటుంది. అలాగే నిజ జీవితంలో సినిమా పాటలను పాడుకుంటామే గాని, అందులోని భావాన్ని అనుభూతి చెందుతామే గాని, అందులో భాషను వాడుకోలేం. ప్రధానంగా రాత ఉపయోగం ఏమిటంటే మనసులోని భావాన్ని అవతలి వ్యక్తికి స్పష్టంగా, అందంగా, ఇంతకు ముందు ఎవరూచెప్పలేని విధంగా చెప్పడం, అందించడం. అందుకోసం భాషను పరిపరి విధాలుగా వైవిధ్యంగా వాడం మనకు కనిపిస్తుంది.

1. 1931–40

సమాజంలోని ప్రతీ రంగంలో భాషావసరం తప్పనిసరి. ప్రతీ రంగంలోని వస్తువుకు, భావానికి, వినియోగానికి భాష ప్రాథమిక అవసరం. భాషను అధ్యయనం చేస్తే ఆ కాలంనాటి వివిధ సామాజిక విషయాలను మనం అర్థం చేసుకోవచ్చు. తరానికి తరానికి మధ్య భాషావసరాలు చాలా పెరుగుతుంటాయి. అలాగే పూర్వం ఉన్న పదాలే ఇప్పుడు వాడతానంటే కూడా కుదరదు. తొలి కాలంలో కొన్ని వర్గాలవరే విద్యావంతులు వారు వ్యవహరించిన, రచించిన భాషే ప్రామాణికం అనే భావన ఉండేది. రానురాను అన్ని వర్గాల వారు విద్యావంతులు అవుతున్నారు కాబట్టి భాషలో మార్పు అనివార్యం అవుతుంది. అలా అన్ని వర్గాల వారు నిసించే, మాట్లాడే సమాజం నుంచి ఉద్భవించిందే సినిమా. అలాగే సినిమా పాటలో కూడా ఆ కాలం నాటి సామాజిక భాష ప్రభావం చాలా వరకు ప్రతిఫలిస్తుంది. భాషాపరంగా చూసినట్లైతే పాటకు లేని సౌలభ్యం సినిమాపాటకు మాత్రమే ఉన్న సౌలభ్యం ఏమిటంటే, సినిమా పాట భాషేతర భావప్రకటనా సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. సినిమా పాటలో దృశ్యం ఉంటుంది కనుక ఆయా పాటను అభినయించే వ్యక్తి (పాత్ర) హావభావాలు, (కళ్ళ సైగలు, మూతివిరుపులు, నవ్వు, కోపం) మొదలగునవి శబ్దాత్మకమైన పాటతో పాటు ప్రకటితమౌతాయి. కేవలం భాషద్వారా వచ్చే భావమే కాకుండా ఆయా నటన ద్వారా కూడా వచ్చే భావాన్ని ప్రేక్షకులు అనుభూతి చెందగలుగుతారు. అందుకే సినిమా పాట అంటే వినేది మాత్రమే కాదు చూస్తూ వినేది.

"ఈశ్వర సంకల్ప మెవ్వారెరుంగుదురు యేరీతి యెటులుండునో
ఐశ్వర్యమిప్పించు అంతనాదనిపించు ఆశలుకల్పించుగా
శాశ్వతమనిపించు సర్వము హరియించు క్షణములో..."

(సతీ సావిత్రి–1933)

ఈ పాటలో చాలా వరకు గ్రాంథిక పదాలను మనం చూడవచ్చు. అప్పటి పద్యసాహిత్య ప్రభావమే కాకుండా, సామాన్య జనాన్ని రంజింపజేసే నాటకాలలోని భాష ప్రభావం ఈ పాటపై ఉన్నట్లు మనకు తెలుస్తుంది. అలాగే ఎటులుండునో అనే పదంలో 'ఓ' అనే భవిష్యత్ సందేహార్థక రూపం సామాన్య ప్రజలు వాడే భాషలో వినబడేదే. కాని దానికి ముందున్న పదం ఎటుల అనేది గ్రాంథికంలో ఉన్న పదం దీని ఆధునిక రూపం *ఎట్లా/ఎలా.*

"కదలదు నీ సంకల్పము లేనిదే గడ్డిపోచయును కారణకారణా..."(సతీ సావిత్రి–1933) ఈ పై పాటలో 'శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు' అనే సామెత సామ్యమైన భావాన్ని తెలిపారు రచయిత. గడ్డిపోచయును గ్రాంథికం ఆధునిక రూపం గడ్డిపోచైన.

"రారొకరైన వెంట కనరారెవరున్ మన లేమి వేళలో

చేరుదురెల్లవారు సిరి చేరిన వేళలో...''

(భక్త కుచేల–1935)

ఇది సుమతి నీతి శతకంలోని భావాన్ని ప్రత్యక్షంగా రాసినట్టుంది. ఇందులో వాడిన పదాలన్నీ గ్రాంథికాలే.

"మంచివారమనగ సంచరించవలెనురా మనము కొంచమైన కీర్తి వలయురా గురుల మాట మీర రాదు పరుల నిందలాడరాదు ..." (సంపూర్ణ రామాయణము–1936)

ఇందులో వాడిన *వలయు* శబ్దం పొందు అనే పదంగా నేడు మనం వాడుతున్నాం.

"భరతదేశ గౌరవంబంతయును పాడొనరించెదరా నేటితో... వీరకేసరులార వెడలుడు వేవేగ భారతాంబకు మన ప్రాణమర్పింతము"

(ద్రౌపది మానసంరక్షణము–1936–దైతా గోపాలం)

ఇందులో వాడిన *వెడలు, వేవేగ, అర్పింతము* మొదలగు పదాలు శుద్ధ గ్రాంథికం.

"దేవుని మహిమా తెలియుగ వశమా పాపులకీ యిలలో...పాప వహ్నిలో పడబోకుమురా తరుణిలోలుడవై ..."

(కనకతార–1937–సముద్రాల)

ఈ పాటలో *పాప వహ్నిలో పడబోకుమురా* అనే విధ్యర్థక వాక్యం చివరలో *తరుణీ లోలుడవై* అనే కారణార్థాన్ని తెలిపే వాక్యంతో ముగించడం కనబడుతుంది. ఇందులో శ్రోతలో ఉత్కంటత కొరకు మొదలు చెప్పాల్సిన వాక్యం తరువాత చెప్పడం జరిగింది.

ఈ దశాబ్దంలో వచ్చిన సినిమాలలో కేవలం గ్రాంథిక పదాలేగాకా అన్యదేశాలు, మాండలిక పదాలు, వ్యవహారిక తిట్లతో కూడిన పదాలతో వచ్చి పాటలు కూడా ఉన్నయి. అలాగే ప్రసిద్ధి పొందిన జానపద గీతాల ఛాయలతో కూడిన పాటలున్నాయి.

హిందీ భాషలో ఉన్న కబీరు కీర్తనలు, వహ్వాయి లాంటి ఉర్దూ పదాలు, దీన్కి తాగి చూడు లాంటి ఉర్దూ తెలుగు మిశ్రమ వ్యవహారం కలిగిన క్రియలు, విభక్తులు (రామదాసు–1933)

"ఎల్లెల్లె నంజ నీ వోటము నా కెరుక నేదా బెంజాలి నంజ... దొమ్మరి నంజ"(లవకుశ–1934) **"నీ జమ్మడ నీ కడుపు మాడ వాజముండ, ఇల్లు వల్లకాడయ్యో... గడుసుముండ** (శ్రీకృష్ణ లీలలు–1935) మొదలగు పాటలో నింద్దార్థకాలు (తిట్లు) తో కూడిన మాండలిక భాషోపయోగం.

"సైసై చెన్నపరెడ్డి నీ పేరే బంగార్పకడ్డి" (రైతుబిడ్డ–1939) లాంటి ప్రసిద్ధి పొందిన జానపద గీతాల ఛాయలతో కూడిన పాటలున్నాయి.

"బేట్రాయి సామి దేవుడా నన్నేలినోడ కటమరాయుడా కదిరీ నరసింహుడా" (సుమంగలి–1940) మొదలగు మాండలిక పదాలుపయోగించిన పాటలు కూడా వచ్చాయి.

1.1941–50

ఏ భాషలోనైన సహాయక క్రియలు పరిమితంగా, ప్రధాన క్రియలు అపరిమితంగా ఉంటాయి. భావ వ్యక్తీకరణలో జహాయ క్రియల పాత్ర అనిర్వచనీయమైంది. వీటి సరైన ప్రయోగం వలన నూతన అభివ్యక్తీకరణలు ఎన్నో సాధ్యమవుతాయి. ఉదామరణకు ఈ క్రింది పాటలో

''రాదేచెలి నమ్మరాదే చెలి మగవారినిలా నమ్మరాదేచెలి... వాదే చెలి అపవాదే చెలి...మోసకారి కామదాసుల మాటలు నీటి మూటేచెలి..."

(దేవత–1941–సముద్రాల)

రాదు + ఏ= రాదే మొదలగు పదంలో *రాదు* అనే సహాయక్రియకు *ఏ* నిశ్చయార్థకం చేర్చడం వల్ల ధ్వని గర్భితమైన భావాన్ని వెల్లడిస్తున్నాడు కవి.

"లోకమంతా లోభులా కానరే నిరుపేదలా..."(దేవత–1941– సముద్రాల)

లోభులు+ఆ = లోభులా, పేదలా ఇందులోని *ఆ* ప్రశ్నార్థకం సూచిస్తుంది. సమాధానం ఆశించని, ఆత్మవిమర్శనాత్మకమైన, ప్రభోధాత్మక పదాన్ని ఈ *ఆ* అనే ప్రశ్నార్థకం వేయడం ద్వార సూచిస్తున్నాడు కవి.

"మాతాపితా గురుదేవాహిత ప్రీతియే మురవైరి సేవా

శాంతి సహనము సమతా కరుణా సత్యమే మురవైరి సేవా..." (భక్తపోతన–1942)

సత్యమే, ప్రీతియే మొదలగునవి నిశ్చయార్థక పదాలు.

"సాగించుమురా యువకా ధర్మము ..."

(పంతులమ్మ–1943–సముద్రాల)

వేదాతీతుడు వేమన సుమండీ వేమనబోధలు వినరండీ...." (యోగివేమన–1947–సముద్రాల)

సాగించుమురా, సుమండీ, వినరండీ మొదలగు విధ్యర్థక పదాల ద్వారా పాటలో ప్రభోదాన్ని, ప్రేక్షకునిలో, శ్రోతలో ఆసక్తిని ప్రేరేపించాడు కవి.

2. 1951-60

ఈ దశాబ్దంలో వచ్చిన పాటల్లో మనం ఇంతకు పూర్వం కంటే కొన్ని నూత్న వ్యక్తీకరణలు చూడవచ్చు. ఈ క్రింది పాట చూసినట్లైతే ఆక్షేప గర్భితమైన ప్రశ్నలాగా కనబడుతుంది. సామూహికంగా ప్రశ్నించడం చూడవచ్చు.

"ఉన్నది మనకు స్వతంత్రమంటే విన్నవారు నవ్వి పోరా..." (పెళ్ళికూతురు - 1951 - సముద్రాల)

చివరలో ఉన్న *నవ్విపోరా* అనే పదంలో *పోరు* ప్రథమపురుష బహువచనంపై *ఆ* అనే కాకుస్వరంతో ప్రశ్నించే ప్రత్యయం వ్యతిరేకార్థాన్నిస్తుంది. ఇలాంటి వ్యక్తీకరణ ద్వారా ఎంతో నిగూఢభావాన్ని శ్రోతలో స్ఫురింపసేయవచ్చు.

అదే విధంగా ఈ క్రింద చూపిన పాటలో

"కళ్ళు తెరచి కనరా సత్యం వొళ్ళు మరచి వినరా ...

పరమాన్నం తిని మురిసేవారికి పట్టెమంచంలో పండేవారికి

అంబలి త్రాగి ఆనందించే పేదలకున్న హాయీ లేదురా మేడలు..." (రాజు పేద -1954- కొసరాజు)

ఇందులో తెలిపిన *వినరా* అనే పదం *విను* మధ్యమపురుష ఏకవచనంపై చేరిన *రా* అనేది అభ్యర్థించు అర్థంలో వచ్చే ఆధునిక రూపం. అలాగే ఈ పాటలో వాడిన *అంబలి, పట్టెమంచం, మిద్దెలు, పూరి గుడిసెలు, హెచ్చు తగ్గులు, హుళుక్కి.* అనే వ్యావహారిక పదాలు, పదబంధాలు కనిపిస్తాయి.

3.1961-70

కొన్ని ఆమ్రేడిత రూపాల వల్ల భావంలో తీవ్రతను తీసుకురావచ్చు. దాని ద్వారా చెప్పే విషయానికి ప్రాధన్యత ఎక్కువ ఇవ్వడమే కాకుండా ఆలంకారికంగా కూడా భాసిస్తుంది. ఉదాహరణకు

''కులములో ఏముందిరా, సోదరా మతములో ఏముందిరా...

మట్టిలో కలిసేటి మడిసి మడిసికి భేదం ఏముందిరా .."

(సత్య హరిశ్చంద్ర-1965-పింగళి)

ఇక్కడ *మడిసి మడిసికి* అన్న ఆమ్రేడిత పదబంధం *ఆ* పాట ద్వారా రచయిత తెలపాలనుకున్న భావాన్ని సమగ్రంగా పరిపుష్టం చేసింది. *ఏముందిరా* అనే పదం పునరావృత్తి (రిపీట్) కావడం వల్ల కూడ ఒక లయబద్ధమైన సౌందర్యం భాసించడం ఒకటైతే, తద్ధర్మకాలంలో వచ్చే ఇలాంటి క్రియలపై చిన్నపిల్లలను కాని (పెద్దవాళ్ళు చిన్న పిల్లలని మందలించే సమయంలో), మర్యాదపూర్వకంగా కాని, బుదిరికించుతూ నచ్చజెప్పే విషయంలో కాని ప్రశ్న రూపంలో ఉన్న వ్యతిరేకార్థం తెల్పుతుంది. అంటే ఏముందిరా అంటే ఏం లేదు అనే అర్థం వస్తుంది. ఇలాంటివి వ్యవహార భాషలో చాలా వాడతాం.

ఈ క్రింది పాటలో కూడా ఇలాంటి ప్రశ్నార్థకవ్యతిరేక రూపాలున్నాయి.

"కలిమి నిలవదు లేమి మిగలదు కలకాలం ఒకరీతి గడవదు నవ్విన కళ్ళే చెమ్మగిల్లవా వాడిన బ్రతుకే పచ్చగిల్లదా

(రంగులరాట్నం-1967-భుజంగరాయశర్మ)

చెమ్మగిల్లవా, పచ్చగిల్లదా మొదలగునవి.

4.1971-80

"తలచింది జరిగిందంటే నీ తెలివేనంటావు

బెడిసిందా తలరాతంటూ విధిపై నెడతావు...

కర్మను నమ్మినవాళ్ళెవరూ కలిమిని స్థిరమనుకోరు, కళ్ళు మూసుకోరు

మనసు తెలిసిన వాళ్ళెవరు మమత చంపుకోరు, మనిషినొదులుకోరు..."

(తాశీల్‌దార్ గారి అమ్మాయి-1971- ఆత్రేయ)

ఈ పాటలో ఉన్న వాక్య నిర్మాణం చూసినట్లైతే ఒక వ్యక్తి మన పక్కనే కూర్చుండి మనతో మాట్లాడినట్లే ఉంటుంది. ఒక్కోసారి ఇలాంటి సామాన్యవాక్యాలు వాడడంవల్ల ప్రబోధాత్మకమైన, సందేశాత్మకమైన, ఆలోచనాత్మకమైన విషయాలను కవి పాటలో సంధించవచ్చు.

ఈ క్రింద తెలిపిన ఉదాహరణలు కూడా అలాంటివే. కానీ పై పాటలో ఉన్నట్టు కాకుండా ఇందులోని వాక్యాలు కొంత అలంకారాత్మక కవిత్వపదాలు కనబడతాయి.

"పదరా బాటసారి కనరా బతుకుదారి

వెదకాలి నువ్వు పూలదారి అది చేరుదాక అపకోయి స్వారి..." (నిజం నిరూపిస్తా- 1972 -ఆరుద్ర)

"ఏదిలేదని అనుకున్నప్పుడు ఉన్నది అంతా తృప్తిరా,

ఎంతో ఉందని అనుకోగానే శూన్యంరా వట్టి శూన్యం..." (దేవుడే దిగివస్తే - 1975-ఆరుద్ర)

5.1981-90

"అలాంటిలాంటి అమ్మిని కాను ... పైసాకు నా దేశంలో పట్టంకడతారు

ప్రాణాన్ని పైసా కన్నా చౌకగా చూస్తారు... పిళ్యాటౌతుందా " (47 రోజులు – 1981 – ఆత్రేయ)

పై పాటలో ప్రాంతీయ మాండలికాలు వాడడం వల్ల అందులో శ్రోత హృదయాన్ని రంజింపజేసే, ఆహ్లాదపరిచే గుణం కనబడుతుంది. సమాజంలో నాది, నా భాష అనే అభిమానం ప్రతిఒక్కరికి ఉంటుంది. వ్యక్తి సామూహికంగా ఉన్నప్పుడు ఒక విధంగా, ఒంటరిగా ఉన్నప్పుడు ఒకవిధంగా ఆలోచిస్తాడు. సమూహమనస్తత్వాన్ని తృప్తిపర్చేవిషయాలు ఇలాంటివి కొన్ని ఉంటాయి. పాటలలో అలాంటి టెక్నిక్స్ ఆధునిక సినీ రచయితలు ఎక్కువ అవలంభిస్తున్నారు.

"జననీ జన్మభూమిశ్చ... స్వర్గాదపీగరీయసీ...

ఏ తల్లి నిను కన్నదో... ఆ తల్లినే కన్న భూమి గొప్పదిరా...

నీ తల్లి మోసేది నవమాసాలేరా

ఈ తల్లి మోయాలి కడవరకురా..."

(బొబ్బిలి పులి–1982–దాసరి)

ఈ పాటలో భాషాపరమైన ఇక వైవిధ్యాన్ని రచయిత అనుసరించాడు. అది సంస్కృతంలో ఉన్న ఒక కొటేషన్ లేదా శ్లోక పాద ఆధారంగా పాటను సృష్టించడం. ఇంతకు ముందూ కూడా సంస్కృతంలోని ఎన్నో సూక్తుల భావాలను తెలుగుపాటలో కనబర్చినా వాటికీ ఈ పాటకు తేడా ఏమిటంటే ఆ పాట పల్లవి ఆ శ్లోకానికి అనువాదంలా ఉండడవే కాకుండా, ఉదాహరణలను తీసుకొని వ్యాఖ్యానిస్తున్నట్లుంటుంది. మొదట వచ్చే సూక్తి అందరికి అర్థం కాకపోయిన తరువత వచ్చే తెలుగు వాక్యాల ద్వారా పాటలోని భావం హృదయంగమం అవుతుంది.

"తన వేళ్ళే సంకెళ్ళై కదలలేని మొక్కలా...

ఆమనికై ఎదురు చూస్తు ఆగిపోదు ఎక్కడా..."

(స్వర్ణ కమలం–1988–సిరివెన్నెల)

అలాగే ఈ పాటలో సజీవమైన వేళ్ళకు నిర్జీవమైన సంకెళ్ళు అని అభేదం చెప్పడం వల్ల భావతీవ్రత భాషద్వారా సాధించడం జరిగింది. సజీవత్వ భావన కలిగిన పదానికి నిర్జీవత్వ పదం వాడడంలో వ్యతిరేకత్వ భావన కనిపిస్తున్నా అందులో కావ్యధ్వని స్పురింపజేసే అలౌకికర్థం లోతుగా దాగి ఉంది.

6. 1991–2000

"ఎవరు రాయగలరు అమ్మా అను మాట కన్న కమ్మని కావ్యం

ఎవరు పాడగలరు అమ్మా అనురాగం కన్న తీయని రాగం... (అమ్మా రాజీనామా–1991–సిరివెన్నెల)

ఈ పాటలో క్రియపైన *గలరు* అనే సామర్థ్యార్థకాన్ని వాడుతు వ్యతిరేకార్థాన్నిచ్చే ప్రశ్న సంధించడం జరిగింది.

"ముద్దుల జానకి పెళ్ళికి మబ్బుల పల్లకి తేవలెనే

ఆశలరెక్కల హంసలు పల్లకి మోసుకు పోవలెనే"

(పెద్దరికం–1992–వడ్డేపల్లి కృష్ణ)

తేవలెనే, పోవలెనే మొదలగు పదాలలో *తెచ్చు తేగా, పోవు పోగా* మారినవి వాటిపైన *వలె* అనే సామర్థ్యార్థక పదం చేరింది *ఆ* పైన *ఏ* అనే ప్రార్థనార్థక ప్రత్యయం చేరింది. దీనివల్ల సంభాషణలో ఒక దగ్గరితనం, అలాగే మృధుత్వం భాసిస్తుంది.

"సిరులొలికించే చిన్ని నవ్వులే మణిమాణిక్యాలూ,

చీకటి ఎరుగని బాబు కన్నులే మలగని దీపాలు..."

(యమలీల –1994– సిరివెన్నెల)

మణిమాణిక్యాలు, మలగని దీపాలు లాంటి జాతీయాలు వాడడం ద్వారా పాటను ఉన్నతీకరించడం జరిగింది.

"కంటే కూతుర్నే కనాలిరా..."

(కంటే కూతుర్నేకను–1998– అశోక్ తేజ)

సమాజంలో పురుషాహంకారాన్ని తొలగించే గీతమిది. దీనికోసం *కనాలిరా* అనే విధ్యర్థక క్రియారూపాన్ని వాడి స్త్రీ పురుషులందరూ సమానమే అని ఉద్బోధ చేస్తాడు కవి. ఆడపిల్లలను తక్కువ చేసి మాట్లాడకూడదనే భావముంది.

"పుల్లలమంటివి కదరా ఇదిగో పులి పిల్లాలమై వచ్చినామురా...

చుక్కలంటె మేడలెక్కడివి మా చెమట కారక.."

(ఒసేయ్ రాములమ్మ –1998– అశోక్ తేజ)

ఇందులో వాడిన *కదరా, వచ్చినామురా* మొదలగు పదాల్లోని *రా* నిందార్థకాన్ని సూచిస్తుంది. పాట రచయిత వీరత్వాన్ని తెలిపేవిధంగా, పాత్రౌచిత్యంగా ఈ భాష వాడారు.

ముగింపు

ఈ విధంగా స్థాలీపులాకంగా చూసినట్లైతే సినిమా పాటలలో ఆది నుండి ఇప్పటి వరకు వచ్చిన పాటల్లో భాషా ప్రయోగాలు, ఔచిత్యాలు, వైవిధ్యాలను మనం చూడవచ్చు. ఇంకా 2000 ల తరువాత నుంచి ఇప్పటి వరకు వచ్చిన సినిమా పాటలను చూసినట్లైతే భాషాపరమైన ప్రయోగాలు కోకొల్లలు మనం గమనించవచ్చు. భాష పరిణామశీలం.

గలిగింది కనుక భాషా పండితుల దృష్టిలో ఏ భాషా ప్రయోగం తప్పు కాదు మరేది ఒప్పుకాదు నిరంతరం ప్రవహించే భాషాపరిణామాన్ని భద్రపర్చుకోవడం, విశ్లేషించుకోవడమే ఉత్తమమైన పని.

ఇలా ఒక భాషలో వచ్చే పరిణామాన్ని మనం నిరంతరం ఆహ్వానించాలి. అంతే కానీ మా కాలంలో వచ్చిన సినిమాల్లో ఉండే పాటలున్నాయి చూడూ... అందులోని భాష అమోఘం... అంటూ మొదలుపెడితే ఇప్పుడచ్చే కొత్త వ్యక్తీకరణలను ఆహ్వానించలేం, అనుభూతి చెందలేం. ఎప్పటి పరిణామాన్ని అప్పుడే అందిపుచ్చుకుంటూ పాతలోని విజ్ఞానాన్ని కొత్తలోని ప్రయోగాల్ని అనుసంధానిస్తూ భాషాపరమైన సౌందర్యాన్ని పరిశీలించాలి.

ఆధార గ్రంథాలు:

1. అశోక్ తేజ, సుద్దాల. నెమలికన్నోడ. 2012. విశాలాంధ్రపబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్

2. పురుషోత్తం, బొడ్డుపల్లి(సంకలనకర్త). వ్యాకరణ పదకోశం. 2006. తెలుగుఅకాడమి. హైదరాబాద్.

3. పైడిపాల. తెలుగు సినిమా పాట. 1992. స్నేహ ప్రచురణలు. మద్రాసు.

4. రమేష్ బాబు, హెచ్(సంకలన కర్త). తొలినాటి సినిమా పాటల పుస్తకములు(1933-37). 2011. చిన్ని పబ్లికేషన్స్.మొదటి సంపుటి. మహబూబ్ నగర్.

5. రమేష్ బాబు, హెచ్.(సంకలన కర్త). తొలినాటి సినిమా పాటల పుస్తకములు(1938-40). 2011. చిన్ని పబ్లికేషన్స్.రెండవ సంపుటి. మహబూబ్ నగర్.

6. మందలపు వి. రమణయ్య, కర్నాటి తోమాసయ్య (సంపాదకులు). తెలుగు భాష సిద్ధాంతం-అనువర్తనం. 2005. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్.

వెబ్ సైట్లు

1. https://te.wikipedia.org

2. http://telugucinemasongs-lyrics.blogspot.in

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్

తెలుగు శాఖ, ఎస్.ఆర్.ఆర్.ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వ), కరీంనగర్.

<u>**రచయితలకు సూచనలు:**</u>

1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.

2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.

3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.

4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.

5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.

- సం.

'నేను' యౌగిక కావ్యం : పరిణామ పథం – ఛాయ చిత్రాల విశ్లేషణ

డా. జొన్నలగడ్డ వెంకటరమణ

'నేను' యౌగిక కావ్యం విశ్వర్షి వాసిలి వసంత కుమార్ రచన. ఈ రచన పరిణామపథం, ప్రమోదపథం, ప్రమాణపథం, ప్రస్థానపథం, ప్రయోగపథం, ప్రవిమలపథం, పరమపథం అనే ఏడు విభాగాలతో సప్తర్షి మండలంలా కనిపిస్తుంది. ఒక్కొక్క విభాగాన్ని మరికొన్ని ఉపవిభాగాలుగా విభజించారు. కావ్యంలో అక్కడక్కడ కవి తన భావాలకు అనుగుణంగా కొన్ని చిత్రాలను గీయించి, పుస్తకంలో జతచేశారు. అవి కవి అక్షరాలకు చిత్రరూపాన్ని ఇచ్చాయి. ఈ ఛాయాచిత్రాలు పాఠకులను భౌతికస్థితి నుండి మానసికమైన యౌగిక, ఒక అలౌకిక స్థితికి తీసుకెళ్లడానికి తోడ్పడుతాయనడంలో అతిశయోక్తి లేదు.

సాహిత్య సాంస్కృతిక అధ్యయనాలలో సంకేతశాస్త్ర (Semiotics) అధ్యయనానికి ప్రత్యేకస్థానం ఉంది. దీనిని అనుసరించి యౌగిక కావ్య విశ్లేషణకు ఈ చిత్రాలు తోడ్పడుతాయి. కవి భావాలకూ, చిత్రాలకూ గల అవినాభావ సంబంధాన్ని తెలుసుకునే ప్రయత్నమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం. దీంతోపాటు చిత్రకళలోని సర్రియలిజం, మినిమలిజం, సింబాలిజం, నైరూప్య చిత్రకళ లాంటి వాదాల సహకారంతో వాటి నేపథ్య విశేషాలను తెలుసుకుంటూ ; కలుపుకుంటూ ముందుకుపోదాం.

కావ్య ప్రత్యేకతలు:

సౌమ్యమైన పదవిన్యాసం, సరళమైన భావవ్యక్తీకరణ యౌగికంలోని అంతర్గత అంశాలను కవిత్వంగా వివరిస్తూనే, ఆత్మసాధనలో ఎదురయ్యే సంక్షోభాలు, ప్రశాంతతను పొందే ఆత్మాన్వేషణతో కూడిన రచన. 'నేను' యౌగిక కావ్యం ద్వారా రచయిత వాసిలి సాధారణ 'నేను' భావనను ఆత్మచింతనలోని లోతైన అర్థంగా మార్చి, పరిపూర్ణత, శాంతిని పొందే మార్గాన్ని చూపించడానికి ప్రయత్నించారు. ఇది ఆత్మవిశ్లేషణకు ఒక స్ఫూర్తిదాయక రచనగా నిలుస్తుంది.

1. మొదటి చిత్రం:

ఇది 'నేను' యౌగిక కావ్యంలోని తొలిచిత్రం. బుద్ధుడు ధ్యానం చేస్తున్న చిత్రం. బుద్ధుడు పద్మాసనంలో కూర్చొని, కళ్ళు మూసుకొని ధ్యాన స్థితిలో ఉన్నాడు. కుడి చేయి అభయ ముద్రలో, ఎడమ చేయి ధ్యాన ముద్రలో ఉంది. వెనుక ప్రవాహం లాంటి ఆకారం ప్రశాంత వాతావరణంతో కూడి ఉంది. ఇది బుద్ధుని బోధనలైన ధ్యానం, అంతర్గత ప్రశాంతతను సూచిస్తుంది. బుద్ధుని ధ్యానముద్ర మానసిక ప్రశాంతతను, మౌనాన్ని, ఆత్మ పరిశీలనను ప్రతిబింబిస్తుంది.



విశ్లేషణ:

ఇది బుద్ధుని ధ్యానాన్ని ప్రతిబింబిస్తూనే, 'నేను' అనేది వ్యక్తిగత, అంతరంగిక ఆత్మాన్వేషణలో ఎలా లీనమవుతుందో సూచిస్తుంది. యౌగికం అంటే యోగమార్గం, ఆత్మసాధన మార్గంలో వ్యక్తిగత అనుభూతులపై ఆధారపడిన కావ్యమని రచయిత తెలియజేస్తున్నారు. ఈ ముద్రలు బుద్ధుని జీవన తత్త్వాలను ప్రతిబింబిస్తాయి, అవి మనలో కూడా శాంతిని,దృఢత్వాన్ని కలిగించేందుకు ఉపకరిస్తాయి.

'నేను' యౌగిక కావ్యం అనేది వ్యక్తి అంతరంగ జ్ఞానయాత్ర. ధ్యానం, మౌనం, ఆత్మసాధనలో పొందే అనుభూతులను కవిత్వ రూపంలో వ్యక్తం చేసిన రచన. కావ్యంలో 'నేను' అనేది ఆత్మను సూచిస్తుంది. శరీరం, మనస్సు, ప్రాణం, ఆత్మల మధ్య ఉన్న బంధాన్ని అర్థమయ్యేలా చేస్తుంది. యోగం అంటే కేవలం శారీరక ఆసనాలు కాకుండా, అంతర్గత శుద్ధి, ఏకాగ్రతలతో పరమసత్యానికి చేరువ కావడమేనని అనిపిస్తుంది. బుద్ధుని ధ్యానం ప్రతిబింబించే ఈ చిత్రం ద్వారా ప్రశాంతత, ధ్యానం నుండి పొందే మౌనానంద జీవితం మొదలైన అంశాలను సూచిస్తుంది. ఈ కావ్యంలో ధ్యాన స్థితి ద్వారా 'నేను ఎవరు?' అనే ప్రశ్నకు సమాధానం కనుగొనే ప్రక్రియ కవితాత్మకంగా చిత్రించబడింది.

2. రెండవ చిత్రం:

ఈ చిత్రం విషయసూచికలో ఉన్నది. రచయిత 'నేను' గడపలోనే పాఠకులకు కీకారణ్యం లాంటి కావ్యంలోకి వెళ్ళే ముందే లోపల చెప్పబోయే అంశాల తాలూకు విషయాన్ని,

కావ్యాన్ని ఏ దృష్టితో చూడాలనే విషయాన్ని ప్రస్తావిస్తూ ఇక్కడ లాంతరులా దీన్ని ఇచ్చాడు.

విశ్లేషణ:

ఈ చిత్రంలో మధ్యలో 'నేను' అనే పదం పెద్దగా ఉంది. దాని చుట్టూ వివిధ ప్రకృతి, శాస్త్ర, తత్త్వ చిహ్నాలు ఉన్నాయి. ఎడమ వైపున అణునిర్మాణం ముగ్గులా వృత్తాకార గీతలు శాస్త్ర సాంకేతికతను సూచిస్తాయి. ఎడమ వైపునే సూర్యుడు, కుడి వైపున చంద్రుడు, నక్షత్రాలూ విశ్వాన్ని సూచిస్తున్నాయి. జలచరాలైన తాబేలు, చేపలు నీటిలో జీవనాన్ని సూచిస్తున్నాయి. కుడిఎడమలనున్న తామరపూలు, గింజలు ప్రకృతిని సూచిస్తున్నాయి. అగ్నికీలలు దహన శక్తిని సూచిస్తున్నాయి. వృక్షాలు, జలధారలు ప్రకృతి పరంపరను సూచిస్తున్నాయి.

చిత్రంలోని తత్త్వం:

'నే+ను' అక్షరాల కూడిక లౌకిక, అలౌకికాలకు, ఆధ్యాత్మికతకు ప్రతీక. ప్రకృతి, గ్రహాల చిహ్నాలు, జీవితంలోని అన్ని వర్గాలూ ఒకే ఆధ్యాత్మిక మూలం నుండి ఉద్భవించాయన్న తత్త్వాన్ని సూచిస్తున్నాయి. ప్రకృతి, జలచరాలు, వృక్షాలు, పూలు, విశ్వంలోని సూర్యచంద్రులు, నక్షత్రాలు ఇవన్నీ ఒకే విస్తారమైన జీవశక్తి పరిధిలో భాగమేనని చెబుతారు. దీని ద్వారా ఏకత్వ భావన కనిపిస్తుంది. మానవ ప్రగతిలో ప్రకృతి పరిరక్షణ, ఆధ్యాత్మికత సమన్వయం అవసరమని స్పష్టం చేస్తుంది. కింద భాగంలో తీరం వద్ద నీటి ప్రవాహం కనిపిస్తుంది. వాయు, అగ్ని, నీరు, భూలోక జీవులు, విశ్వం ఇలా అన్ని అంశాలకూ ప్రతినిధిగా ప్రవాహాన్ని చూపించారు.

చిత్ర శైలి:

రేఖా చిత్ర శైలిలో ఉంది. నలుపు, తెలుపు రంగులతో, సన్నని గీతలతో ప్రతీ అంశాన్ని స్పష్టంగా చూపించారు. సాంప్రదాయిక, ఆధునిక శాస్త్ర చిహ్నాలను కలిపే ప్రయత్నం చేసారు. సన్నని గీతలతో వస్తువులను చూపించడం ద్వారా గుణాత్మక అందాన్ని చూపించడానికి ప్రయత్నించారు. ఒక సాధారణ రేఖాచిత్రంతో లోతైన ఆలోచనలకు రూపం ఇచ్చారు. చిత్రంలోని అన్ని అంశాల మధ్యలో ఉన్న 'నేను' చుట్టూతా ఉంచి సమన్వయాన్ని చూపించారు. ప్రకృతి, శాస్త్రం, ఆధ్యాత్మికత అన్నీ ఒకే మూలం నుండి పుట్టి, పరస్పర ఆధారపడే జీవన తత్త్వాన్ని వివరించే దృశ్య ప్రకటన. ఇది విజ్ఞానశాస్త్రాన్ని, ప్రకృతి, ఆధ్యాత్మికతలోని పరస్పర సంబంధాన్ని చెబుతుంది.

ప్రాణులు ప్రతి ఒక్కరు తమ స్థానం, దైవికత, ప్రకృతిలో భాగమని గుర్తుంచుకోవాలి. గ్రహమాల, చంద్రుడు, సూర్యుడు విశ్వంలో మానవుడి స్థానాన్ని, విజ్ఞాన శోధనను, అంతరిక్ష పరిశోధనను గుర్తుచేస్తాయి. జలచరాలు, తామర పువ్వు ప్రకృతి పరిరక్షణ, నీటి ప్రాధాన్యతను గుర్తుచేస్తాయి. అగ్ని జ్వాలలు శక్తి, జీవ, ప్రాణ మార్పులను సూచిస్తాయి. ప్రతీ అంశం 'నేను' చుట్టూ ఉంచడంవల్ల మనిషి ప్రకృతి, శాస్త్రం, విశ్వం మధ్యనున్న ఏకత్వ సంబంధాన్ని చూపిస్తుంది; నిరూపిస్తుంది.

యోగ సంబంధిత విశేషాలు

'నేను' అక్షరం యోగతత్త్వానికి సంకేతం. యోగంలో ఆత్మచింతన ప్రధాన భాగం. నేను అనేది ఇహలోకంలోని వ్యక్తిస్థానం, విశ్వంలో తన పాత్రను తెలుసుకోవడం, ఆత్మాన్వేషణకు తొలిమెట్టు. యోగంలో 'అహం బ్రహ్మాస్మి'–

"ఈ జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు, వాటివాటి అంతర్గతమైన లోకములు, (బ్రహ్మాండములు – ఇవన్నీ కూడా నావలననే, నాయందే ఏర్పడుచున్నాయి. కలుగుచున్నాయి. త్రిమూర్తులతో సహా ఇదంతా ఆత్మయందే ప్రతిష్ఠితమై యున్నది! ఇవన్నీ ఆత్మయందే లయిస్తున్నాయి. ఈ సృష్టి–స్థితిలయములు ఎందులో దృశ్యమానమగుచున్నాయో... అట్టి అద్వయ పరబ్రహ్మమే నేను! (అహమ్ బ్రహ్మాస్మి – యజుర్వేదం)" (హనుమ రామకృష్ణ, యేలేశ్వరపు:2015:204)

అని చెప్పినట్టు, ఈ 'నేను' కూడా తత్త్వంగా బ్రహ్మతో (విశ్వ చైతన్యంతో) సమానమని గుర్తించుకునే దానికి గుర్తు. ప్రకృతి, విశ్వం, జీవరాశుల మధ్య ఏకత్వం. యోగతత్త్వంలో ప్రకృతితో సమన్వయింపబడింది. పంచభూతాల్లో మనిషీ భాగమని గుర్తించడం ఒక ప్రధాన భావన. ఇది యోగంలో చెప్పే 'సంయమ' (ఆత్మనిగ్రహ) భావనకు దగ్గరగా ఉంటుంది.

సంకేతాలు

రాకెట్ (ప్రయత్నం), అగ్ని (శక్తి), సూర్యుడు (ప్రాణశక్తి), చంద్రుడు (మనోచింతన) ఇవన్నీ యోగంలో వినియోగించే తత్త్వాలు. ప్రాణాయామంలో 'సూర్యచక్రం' (పింగళ), 'చంద్రచక్రం' (ఇడా) భావనలుగా ఉంటాయి.

"మానవుని శరీరమున మూలాధారము మొదలుకొని బ్రహ్మరంధ్రము వరకును వీణాదండము (బ్రహ్మదండము)

గణుపుగల వెదురు రజ్జువలె నున్నది. మూలాధారచక్రమందలి త్రికోణమునందు సుషుమ్నానాడి యున్నది. దానికి ఆరుపార్శ్వముల యందును ఇడ, పింగళ యను నాడులు విలంబినియను నాడితో కలిసి నాభిస్థానము నాశ్రయించి యున్నవి." (రామసుబ్బయ్య, మట్టిబోయిన: 2003:126)

జీవనశక్తి చలనానికి ఇవి చిహ్నాలు. తామర పువ్వు (సహస్రారచక్ర) – యోగ, ధ్యానంలో శుద్ధత, జ్ఞానం, మోక్షానికి ప్రతీక. కుండలినీ చక్రాలలో సహస్రార చక్రానికి తామర పువ్వు ప్రతీకగా పేర్కొంటారు. కలిసిన చక్రాలు (సౌరమండల చిహ్నం). యోగంలో 'నాభిచక్రం', 'హృదయచక్రం' మొదలైనవి శరీరంలో శక్తి కేంద్రాలు. ఈ గ్రహమాల ఆకారం కూడా అంతర్గత చక్రాల వలే ప్రాతినిధ్యం వహించవచ్చు.

ఇలా ఈ చిత్రం యౌగిక తత్వానికి సంబంధించిన ఆత్మ చింతనతో, ప్రకృతితో ఏకత్వం, శక్తి చలన సూత్రం, మోక్ష సాధనమార్గం లాంటి అంశాలను ప్రతిబింబిస్తోంది.

3. మూడవ చిత్రం:

ఈ చిత్రంలో మనిషి, ప్రకృతి, జంతుజాల సమూహాల పరస్పర సంబంధాన్ని సంకేతాత్మకంగా చూపిస్తుంది. పైభాగంలో ఉన్న శీర్షిక 'పరిణామ పథం' అని ఉంది. ఇది సంస్కృత తత్సమ పదాల మిళితం. ఈ చిత్రం మనిషి పరిణామ పథాన్ని ఘనంగా, గాఢంగా, సంకేతాత్మకంగా ప్రతిబింబించింది. ఇది మనిషి ప్రకృతిలోంచి ఎలా రూపుదిద్దుకున్నాడో, ఎలా భిన్న జీవరాశుల నుంచి అభివృద్ధి చెందినాడో చూపించే కళాత్మక దృశ్యంగా సూచించవచ్చు.



చిత్ర తత్వం:

చిత్రంలోని మనిషి శరీరాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే, అందులో ఎన్నో జంతువుల ఆకృతులు లీనమై ఉన్నాయి. గుర్రం, పక్షులు, సర్పాలు, పాములు, పందులు, ఏనుగులు, వానరాలు మొదలైనవి. ఇది ప్రకృతిలోని అన్ని జీవరాశులతో మనిషి సాన్నిహిత్యాన్ని, ఒకే మూలం నుండి వచ్చిన సంబంధాన్ని తెలియజేస్తుంది. వాతావరణం, మేఘాలు, దిక్కుల మధ్య మనిషి మిళితమై ఉండడం అతను ప్రకృతిలో భాగమని చెబుతుంది. జంతువులు, పక్షులు, సముద్ర జీవులు ఇలా అన్ని జీవులు కలిసిపోయిన శరీరం జీవపరిణామ స్థితిని గుర్తుచేస్తుంది. జంతు రూపాలతో మనిషి శరీరమంతా వివిధ జంతువులతో నిర్మితమై ఉంది. ఇది 'డార్విన్ సిద్ధాంతం' ...

"ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ (1809-1882) జీవ పరిణామ సిద్ధాంతం వానరుడు నరవానరుడుగాను, నరవానరుడు నరుడుగాను భూమిపై ప్రాణ పరిణామ క్రమంలో ఏర్పడడాన్ని తెలియ జేస్తుంది. ఆయన పుస్తకం 'ది ఆరిజిన్ ఆఫ్ స్పిసీస్ (The Origin of Species)' 1859 లో ప్రచురించబడింది. ఆయన పరిణామ సిద్ధాంతం ఋజువవుతుంది" (సుబ్బారావు, ఆర్.వి:2007:11)

దీని ఆధారంగానూ 'మనిషి అనేక జీవరాశుల పరిణామం' అనే భావనను సూచిస్తుంది. శరీరం ఒక ప్రవాహంలా (ప్రకృతి ప్రవాహంలా) ముందుకు సాగుతోంది. ఇది కాల పరంపరలో జీవపరిణామం ఎలా నిరంతరంగా సాగుతుందో ప్రతిబింబిస్తుంది. ఇది జీవుల మార్గం – మానవ రూపం అనే క్రమాన్ని బలంగా సూచిస్తుంది. ఆకాశం, ప్రకృతి, మేఘాలు వీటి మధ్య మనిషి రూపం నిలిచినట్లు కనిపిస్తుంది. ఇది మనిషి ప్రకృతిలో భాగమనేదాన్ని సూటిగా సూచిస్తుంది. 'ప్రకృతిలోని శక్తుల సమ్మేళనం వల్లే మనిషి ఉద్భవించాడు' అనే తత్వాన్ని తెలియజేస్తుంది.

సంకేతాలు:

తల ఎత్తి ఉన్న మనిషి రూపం ఒక జ్ఞానార్జనాన్ని లేదా ప్రకృతిని అంతరించని తత్వంగా గ్రహించే దృక్పథాన్ని సూచించవచ్చు. ఇది వేదాంత తత్వాలు లేదా ఆదివాసి జీవితానికి దగ్గరగా ఉంటుంది. మనిషి – ప్రకృతి వేర్వేరు కాదు ఒకటే. అణునిర్మాణం శాస్త్రీయ విజ్ఞానాన్ని సూచిస్తుంది. ఇది ఆధునిక విజ్ఞానం ప్రారంభ బిందువును సూచించే చిహ్నంగా ఉంది. సూర్యచంద్రులు కాలానికి, ప్రకృతి చక్రానికి సంకేతాలు. సమయ మార్పులనూ, జీవ పరిణామాన్ని సూచిస్తాయి. పుష్పాలు, వృక్షాలు, జల ప్రవాహం, చేపలు ప్రకృతి సౌందర్యాన్ని, జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ముఖాకృతిని సృష్టికర్తగా లేదా ప్రకృతిమాతగా భావించవచ్చు. జీవనానికి మూలాధారమైన శక్తిని సూచిస్తుంది. గోళాకారాలు గ్రహాలు. ఇవి విశ్వ విస్తృతిని, ఖగోళ విజ్ఞానాన్ని సూచిస్తున్నాయి. 'ప్రకృతిని మనిషి జయించలేడు; ఎందుకంటే మనిషే దానిలో భాగమే'నని చెబుతుంది. అంతేకాక, అన్ని జీవరాశులతో మనిషి మానవత్వాన్ని గుర్తించి, సమానత్వంతో జీవించాలన్న నైతిక బోధన ఇందులో ఉంది.

చిత్ర శైలి:

ఇది సర్రియలిజం (Surrealism) కళాశైలిని పోలి ఉంది.

"సర్రియలిజం = అధివాస్తవిక వాదాన్నే సర్రియలిజం అంటారు. అచేతన దశలో కనిపించే అసహజ రూపాలకు ప్రతిబింబం ఈ వాదం. వాస్తవికతను అధిగమించిపోయి అనిర్వచనీయమైన నిగూఢానుభూతిని కల్గించే కవితను/ చిత్రలేఖనాన్ని సర్రియలిస్టు పోకడ అంటారు. 1924లో బయలుదేరిన ఈ వాదం సాహిత్యంలోనూ చిత్రకళలోనూ ప్రవేశించింది." (ప్రసాద్, ఎ.బి.కె:1996:177)

కలల లోకాన్ని, ఆంతరంగిక భావనలను బాహ్యరూపాల్లో చూపించే శైలి. చూసేందుకు క్లిష్టంగా కనిపించే ఆకృతులు, ఒకదానికొకటి మిళితమైన రూపాలు మానవ అస్తిత్వాన్ని ప్రశ్నించేలా ఉన్నాయి.

చిత్ర విశ్లేషణ:

పరిణామ పథం – అనేది పైకి కనిపించే మార్పులను సూచించేది మాత్రమే కాదు. ఇది మనిషి మానసిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక పరిణామాన్ని కూడా సూచించేది. ఈ చిత్రం మనిషి ఎలా జంతువు నుంచి మానవునిగా పరిణమించాడో స్పష్టంగా వివరిస్తుంది. శరీరంలో జంతువుల సమ్మేళనం ద్వారా చిత్రకారుడు మానవ, ప్రకృతి జీవనానికి పరిపూరకంగా ఉందనే సందేశాన్ని తెలుపుతాడు. ఈ చిత్రం ప్రకృతి, శక్తి, విజ్ఞానం, శాస్త్ర విషయాల పరస్పర సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది.

4. నాల్గవ చిత్రం:

ఈ చిత్రం కూడా ప్రకృతి, శక్తి, విజ్ఞాన శాస్త్రాల పరస్పర సంబంధాన్ని చిత్రంగా ప్రతిబింబిస్తుంది.

చిత్రం తత్వం:

అణు నిర్మాణం శాస్త్రీయ విజ్ఞానాన్ని సూచిస్తుంది. ఇది ఆధునిక విజ్ఞానం ప్రారంభ బిందువును సూచించే చిహ్నంగా ఉంది. సూర్యచంద్రులు కాలానికి, ప్రకృతి చక్రానికి సంకేతాలు. సమయ మార్పులనూ, జీవ పరిణామాన్ని సూచిస్తాయి. పుష్పాలు,



వృక్షాలు, జల ప్రవాహం, చేపలు ప్రకృతి సౌందర్యాన్ని, జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. మానవాకృతిని సృష్టికర్తగా భావించవచ్చు. జీవనానికి మూలాధారమైన శక్తిని సూచిస్తుంది. గోళాకారాలు గ్రహాలు. ఇవి విశ్వ విస్తృతిని, ఖగోళ విజ్ఞానాన్ని సూచిస్తున్నాయి.

విశ్లేషణ: ఈ ఖండికలో ప్రారంభంలో 'శూన్యం' అనే పదంతో శూన్య స్థితి ఎలా ఉంటుందో చెబుతారు. సృష్టి ప్రారంభానికి ముందు ఎలాంటి స్థితి కల్గి ఉండేదనే దాన్ని ప్రస్తావించారు. శక్తి పరిణామాలు, శాస్త్రీయ సమన్వయాలు కాలక్రమంలో ఉష్ణశక్తి, శాస్త్ర విజ్ఞానం, ప్రకృతి శక్తుల పరస్పర సహకారంతో సృష్టి పుట్టిందంటారు. ముగింపులో "పదార్థసాంద్రత ఉష్ణతీవ్రతలతో గోళావిష్కరణ, సౌరకుటుంబ ప్రాభవంతో గురుత్వాకర్షణ" అనే పదాల ద్వారా భౌతికశాస్త్ర సూత్రాల ఆధారంగా విశ్వనిర్మాణాన్ని కవితాత్మకంగా చెబితే దానికే చిత్రంగా రూపాన్నిచ్చారు.

సంకేతాలు:

సృష్టి–ఆరంభం, ప్రకృతి–శక్తి, అణువు– శాస్త్రం, అనంతం–అసంపూర్ణజ్ఞానమనే భావాలు కలిపిన ఒక సాంకేతిక, సాంస్కృతిక చైతన్యాన్ని తెలియజేస్తాయి. ఇది విజ్ఞాన, భౌతికశాస్త్ర, తత్వ, ప్రకృతి తత్వాల సమ్మేళనంగా ఆవిష్కరించారు.

చిత్రం శైలి:

ఈ చిత్రం నైరూప్య చిత్రకళాశైలి (Abstract Art) లో ఉంది. దీని లక్షణాలను ప్రస్తావిస్తూ సగే సరేనో (Sage Serrano) అనే చిత్రకారుడు ఇలా అంటాడు–

"Abstract arts main purpose is to spark the imagination and invoke a personal emotional experience. The best abstract art can create a different experience depending on one's personality or mood. - Abstract art is about the balance or unbalance of form, line, composition, and color to achieve harmony, or disarray. Some pieces may be focused on the method in which the piece is made and which materials are involved. Others focus on the movement of the paint across the canvas or panel."

దీనినే వియుక్త కళ అని కూడా పిలుస్తారు. ఈ కళ ప్రధానోద్దేశ్యం ఊహను రేకెత్తించడం. వ్యక్తిగత భావోద్వేగ అనుభవాన్ని ప్రేరేపించడం. ఉత్తమ నైరూప్య కళనేది ఒకరి వ్యక్తిత్వం లేదా మానసిక స్థితిని బట్టి భిన్నమైన అనుభవాన్ని సృష్టించగలదు.

ఈ చిత్రాన్ని కేవలం నలుపు, తెలుపు రంగులతో రూపొందించారు. నైరూప్యకళల్లో ఒకటి మినిమలిజం. సాధారణ రూపాలతో, స్పష్టమైన రంగులతో, ఖాళీ స్థలాలతో ఒక భావాన్ని

లేదా ఆలోచనను వ్యక్తీకరించే ఒక నైరూప్య శైలి. ఈ చిత్రాన్ని మినిమలిజ శైలిలో భాగంగా పరిగణించవచ్చు. చిత్రం మొత్తం రేఖలతో నిర్మితమై ఉంది. ఇక్కడ సంకేత పదాలుగా ఉన్న అణునిర్మాణం, సూర్యచంద్రులు, పుష్పాలు, చేపలు మొదలైనవన్నీ స్పష్టమైన ఉపమాన రూపాలుగా కాక, భావాలకు ప్రతిరూపాలుగా కనిపిస్తున్నాయి. ఇది ఒక మానవుని ఆత్మ, సృష్టి, చైతన్యం లాంటి భావాలను బహిర్గతం చేస్తుంది. మామూలు గీతలే అయినా, లోతైన భావాన్ని తెలియజేస్తున్న లైన్ ఆర్ట్ చిత్రలేఖనా శైలికి ఉదాహరణ.

5. ఐదవ చిత్రం:

'నేను' యౌగిక కావ్యంలోని 'పరిణామ పథం' లో చివరి చిత్రమిది. అహం బ్రహ్మాస్మి అనే దానితో పాటు శంకరాచార్యుల అద్వైత సిద్ధాంతాన్ని నిరూపించే చిత్రం.

చిత్ర విశ్లేషణ:

చిత్రం కింది భాగంలో ధ్యానం చేస్తున్న వ్యక్తిని కేంద్ర బిందువుగా కలిగి ఉన్నది. ఇది మనిషి అంతఃచింతన, యోగ ధ్యానం లేదా అతిలోతైన ధ్యానస్థితిని సూచిస్తుంది. అతను పర్వతాలపై కూర్చుని, మేఘాల మధ్య స్థితమై ఉన్నట్లు కనిపిస్తున్నాడు. ఆకాశంలో తేలుతున్న ఒక విగ్రహం లేదా ఆకారం శక్తి రూపం. ఇది బ్రహ్మాండ శక్తిని, విశ్వాత్మను సూచించే రూపంగా భావించవచ్చు. ఇది వ్యక్తి నుండే వ్యాపించి, విశ్వాన్ని నింపుతున్న శక్తిగా చిత్రీకరించబడింది. చుట్టూ గ్రహాలు, తారలు, తిరుగుతున్న రేఖలు ఇవి మనిషి ధ్యానస్థితి విశ్వవ్యాప్తమై, గ్రహనక్షత్రాలను కూడా అందుకొని ఉందనే భావనను ఇస్తాయి. మనిషి ఒక విశ్వరూపుడు అనే సిద్ధాంతాన్ని బలపరుస్తున్నాయి.

" 'నేహ నానాస్తి కించన' అని బ్రహ్మకంటే వ్యతిరిక్తమైన మరొక వస్తువేదీ లేదు అని చెప్పే ఉపనిషద్వాక్యాల శ్రవణము. మనన నిధిధ్యాసలు కూడా చేసి అద్వైత బ్రహ్మ మొక్కటియే పరమార్థతత్త్వము, ఈ జగత్తు కల్పితము, నేను ఆ బ్రహ్మ ఒక్కటే అనే తత్వసాక్షాత్మారం కలిగిన పిమ్మట ఈ జగత్తు, ఇతరభేదాలు అన్నీ విలీనమైపోతాయి. అంతా బ్రహ్మగానే కనబడుతుంది. అది పారమార్థిక సత్యము.



దీనికి ఒక చక్కని ఉదాహరణం చూపించినారు శ్రీ శంకరాచార్యులు." (శ్రీరామచంద్రుడు, పుల్లెల: 2011:40)

ఈ అంశాన్ని తెలిపే 'నేను' యౌగిక కావ్యంలోని కింది పంక్తులు అద్వైత తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఆత్మ, విశ్వం పరస్పరం కలిసిపోయినవే. నేను విశ్వానికి కేంద్రం, విశ్వం కూడా నేనుకే కేంద్రం అనే భావన. ఒకటి ఆధారమైన చలనశక్తి (సృష్టి). ఇంకొకటి అనంత చిత్తం (ఆధ్యాత్మిక స్థితి). అంటే సృష్టి, భావన రెండూ కలిపిన రూపమే మనిషి. దీన్నే కవి మాటల్లో ఇలా అంటాడు.

"నేను
కేంద్రంగా విశ్వం
విశ్వం కేంద్రంగా 'నేను'."
"అంతరంగపు చిత్తరువు నాది
అంతర్యాన వర్ణచిత్రం విశ్వానిది." (నేను: పుట 61)

సంకేతాలు:

ఇది నేను అంతరంగికుడిని, కానీ విశ్వం నా ప్రతిబింబంగా ఉంది. అంటే జీవాత్మ-పరమాత్మ రెండూ ఒకటే. ఇక్కడ వ్యక్తిగత ధైర్యం, నమ్మకం, విశ్వాసం గురించి మాట్లాడుతున్నారు. తాను ఎంచుకున్న బాటలో ధైర్యంగా ముందుకెళతానని, ప్రేమతో జీవిస్తానని స్పష్టం చేస్తున్నారు.

చిత్ర శైలి:

ఈ చిత్రం నైరూప్య సంకేతవాదంలో గీసినది. నైరూప్య సంకేతవాదం (Abstractive Symbolism) సంకేతవాదం నైరూప్య చిత్రకళలో ఒకటి. ఒక వస్తువు లేదా భావనను మరొక దానితో సూచించడం. అయితే, నైరూప్య సంకేతవాదంలో, ఒక నిర్దిష్ట వస్తువును కాకుండా, సాధారణ రూపాలు, రంగులు లేదా ఇతర కళాత్మక అంశాలను ఉపయోగించి ఒక భావాన్ని లేదా ఆలోచనను సూచిస్తారు. అలాగే తన భావాలను లేదా ఆలోచనలను సూచించడానికి సాధారణ రూపాలను ఉపయోగించి చిత్రకారుడు పాఠకుడి లేదా వీక్షకుడి ఊహకు వదిలేస్తాడు. దీని ద్వారా, కళాకారుడు మరింత వ్యక్తిగత, లోతైన భావోద్వేగాలను వ్యక్తం చేయగలడు.

ఇక్కడ నలుపు, తెలుపు రంగుల చిత్రలేఖనా శైలిలో ఉంది. రేఖల్లో ఉల్లేఖనాత్మక గ్రహబలాలు, ధ్యానపు రూపం అన్నీ కలగలిపి ధ్యానం + విజ్ఞానం + విశ్వం అనే రూపాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని చెప్పుకోవచ్చు. ఇది తత్త్వవాద చిత్రకళకు ఒక మంచి ఉదాహరణ. ఈ చిత్రం, ఈ ఖండిక రెండూ కలిసిపోతూ ఒక స్పష్టమైన సందేశాన్నిస్తున్నాయి. 'నేనే

తరువాయి 24వ పేజీలో....

'నిర్వాణ' నవల - సవిమర్శనాత్మక పరిశీలన

డా. మళ్ళా పెంచల ప్రసాద్

మానవునిలో బౌద్ధిక, మానసిక వికాసాలను పెంపొందించడమే లక్ష్యంగా రూపుదిద్దుకున్న అతి కొద్ది గ్రంథాలలో మొదటి వరుసలో పేర్కొనదగిన గ్రంథం పంచతంత్రం. ఇందులోని ఒక శ్లోకాన్ని పరిశీలిస్తే ఆ విషయం మనకు మరింత సుస్పష్టంగా గోచరమౌతుంది.

పూర్వే వయసి యః శాంతః స శాన్త ఇతి మే మతిః।
ధాతుషు క్షీయమాణేషు శమః కస్య న జాయతే ॥

– పంచతంత్రం

'వయసు మళ్లిన తరువాత, ధాతువులు క్షీణించిన అనంతరం ఎవరైన శాంతియుతమైన జీవితాన్ని సాగించ గలుగుతారు. కానీ ఎవరైతే నవ యవ్వన వయసులో ఉండి కూడా శాంతియుతంగా జీవితాన్ని సాగించడానికి సిద్ధపడుతారో వారే నిజమైన శాంత స్వభావులని' ఈ శ్లోకం ఉద్ఘాటిస్తుంది. ఈ శ్లోకంలోని మూలాంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు రచయిత విష్ణుశర్మ ఈ శ్లోకాన్ని బౌద్ధమతంలోని మూలసూత్రాను సారంగా రూపొందించి ఉంటాడని ఊహించవచ్చు. అందుకు కారణం విష్ణుశర్మ కాలం కొంచెం అటు ఇటుగా బుద్ధుడు జీవించిన కాలానికి అనగా క్రీ.పూ. 5, 6 శతాబ్దాలకు దగ్గరగా ఉండటమే. ఆ కాలంలో రచించబడిన అనేక గ్రంథాలపై బౌద్ధమత ప్రభావం ఉందని సాహితీ విమర్శకులు ఆధార సహితంగా నిరూపించి ఉన్నారు.

మతమేదైనా మానవాళికి బోధించేది ఒక్కటే. శాంతి యుతమైనా, సత్యం, ధర్మం, ఆహింసాయుతమైన జీవనాన్ని సాగించాలని. కానీ నేడు సమాజంలో మనిషి అందుకు పూర్తి భిన్నమైన జీవితాన్ని సాగిస్తున్నాడు. తత్ ఫలితమే దు:ఖం. అట్టి దు:ఖాన్ని నిర్మూలించడానికి, మనిషి మనీషిగా మారి సద్ధర్మవంతుడిగా జీవితం సాగించడానికి దిశానిర్దేశం చేసిన భగవత్ స్వరూపుడే బుద్ధభగవానుడు. ఆయన బోధించిన ధర్మమే సద్ధర్మం. అదే బౌద్ధ ధర్మం. అట్టి ధర్మమే మనిషి యొక్క నైతిక, ధార్మిక జీవనానికి జీవగర్ర.

కవిపరిచయం:

ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిగా, కథకునిగా, నవలా రచయితగా, రేడియో నాటక కర్తగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందిన డా॥ బండి సత్యనారాయణ గారు ఫిబ్రవరి 15, 1965లో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి సమీపంలోని విలస రావిగుంట చెరువు గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు బండి వీరమ్మ, వనమయ్యలు. వీరి ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసాలు రావిగుంట చెరువు, ముక్తేశ్వరాలలో సాగాయి. తరువాత అమలాపురంలోని కోనసీమ భానోజీ రామర్స్ కళాశాల నుండి బి.ఏ తెలుగులో బి.ఏ. పట్టాను, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ నుండి ఎం.ఏ తెలుగు పట్టాను పొందారు. తరువాత ఆచార్య పర్వతనేని సుబ్బారావుగారి పర్యవేక్షణలో 'పోతన భాగవతంపై పరిశోధన చేసి ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుండి పిహెచ్.డి. పట్టాను అందుకున్నారు. విశ్వవిద్యాలయంలో ఆచార్యులు కావాలన్న ఆశతో వివిధ ప్రయత్నాలు చేసి, చివరికి కుటుంబ బాధ్యతల రీత్యా ఆకాశవాణిలో ఉద్యోగంలో చేరి స్థిరపడ్డారు.

సత్యనారాయణ గారికి కవిగా తొలి కవిత 'చావు స్వప్నం'. తరువాత వాన కురిసిన రాత్రి, రెప్ప లేని కన్ను, కొత్త రుతువు, గుండె పగిలిన శబ్దం వంటి కొన్ని కవితా ఖండికలను, తెలుగు తేజం పురిపండా అప్పల స్వామి పేరిట జీవిత చరిత్రను, తమసోమా జ్యోతిర్గమయ పేరిట ఒక శతకాన్ని, అనేక రేడియో నాటికలను రచించారు. ఈయన సాహితీ సేవకుగాను గిడుగు రామ్మూర్తి పంతులు గారి భాషా పురస్కారం, తెలుగు భాషా పురస్కారం, పాండిచ్చేరి ప్రభుత్వం వారి సాహితీ పురస్కారం, విశాఖ వుడా వారి ఉత్తమ ఉగాది కవితా పురస్కారం, డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య సాహితీ పురస్కారం, గెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ వారి పురస్కారం వంటి అనేక సాహితీ పురస్కారాలు అందుకున్నారు.

నిర్వాణ నవల – పరిశీలన:

కథకైనా, నవలకైనా కథారంభం ప్రాణప్రదమైనది. గృహనిర్మాణానికి పునాది ఎలాంటిదో, కథా లేదా నవల రూపకల్పనలో కథారంభం లేదా ఎత్తుగడ అలాంటిదని చెప్పవచ్చు. రచయిత రూపొందించుకునే ఎత్తుగడలోనే కొన్ని సార్లు పాఠకునికి 'కథా దాని కమామీషులు' ద్యోతక మౌతుంటాయి. అట్టి దృష్టితో నిర్వాణ నవలను పరిశీలించినప్పుడు.., నిర్వాణ నవల 'మలిసంధ్య వేళ. పలుచని చీకట్లు అలముకుంటున్నాయి. దర్భలు సేకరించుకుని తాపసులు ఆశ్రమాలకు చేరుకుంటున్నారు' అంటూ ఆరంభమౌతుంది. ఇది పాఠకునికి ఒక సహజమైన మలి సంధ్యా వర్ణనగా తోస్తుంది.

ఇది రచయిత తన నవలకు రూపొందించుకున్న ఎత్తుగడ. కానీ ఇక్కడ రచయిత దూర దృష్టిని నిశితంగా పరిశీలించినట్లైతే, ఈ మలిసంధ్యా వర్ణనలో పాఠకునికి ఒక అరుదైన శిల్పం తారసపడుతుంది. మానవుని జీవితంపై అలుముకున్న దు:ఖమనే చీకట్లను తొలుచుకుంటూ జ్ఞానజ్యోతిని వెలిగించే బుద్ధుని సద్ధర్మ ప్రభకు ఈ ఎత్తు ప్రతీకగా నిలుస్తుందని చెప్పవచ్చు. మలిసంధ్య మనిషి జీవితంలో అలుముకున్న దు:ఖమనే చీకట్లకు ప్రతీకగానూ, తాపసులు వెదికి తెచ్చే దర్భ బుద్ధుడు శోధించి కనుగొనబోవు పరిష్కార మార్గంగానూ తోస్తుంది. ఈ శిల్పం రచయిత యొక్క రచనా పరిపక్వతకు, రచనా శైలిలోని మాధుర్యానికి అద్దం పడుతుంది.

సంప్రదాయ బౌద్ధమతావలంభకులందరూ సిద్ధార్థుని పరివ్రాజకత్వానికి కారణం ఆయన చూసిన నాలుగు చూడకూడని దృశ్యాలే అని పేర్కొనగా, ఈ నవలలో రచయిత సత్యనారాయణగారు మాత్రం రోహిణీ నదీ జలాల విషయంలో తండ్రి తరపు బంధువులైన శాక్యులకు, తల్లి తరపు బంధువులైన కొలియులకు మధ్య చెలరేగిన వివాదమేనని ప్రస్తావించారు. ఇది నవలలో పాఠకునికి కనిపించే ప్రస్తావన. కానీ, నవలలో అంతర్లీనంగా ప్రస్తావించబడిన మరికొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలించినప్పుడు సంప్రదాయ బౌద్ధమతావలంభకుల భావనలు మన కళ్ళ ముందు సాక్షాత్కారమౌతాయి. సిద్ధార్థుడు జన్మించినప్పుడు ఆయన తండ్రి శుద్ధోదనుడు సిద్ధార్థుని జాతకాది సంస్కారకర్మలను చేయించాడని, అప్పుడు జోతిష్కులు సిద్ధార్థుని జాతకాన్ని పరిశీలించి 'ఇతడు అయితే గొప్ప చక్రవర్తి అయినా కావాలి లేదా పరివ్రాజక శిరోమణి అయినా కావాలి' అని పేర్కొన్నారని సంప్రదాయ బౌద్ధమతావలంభకులు అనేక గ్రంథాలలో ప్రస్థావించి ఉన్నారు. ఈ భావమే నిర్వాణ నవలలో అనేక చోట్ల అంతర్నిగూఢంగా కనిపిస్తుంది.

యుక్త వయస్సులో ఉన్న సిద్ధార్థుని సాధు సాంగత్యాన్ని, సాధు స్వభావాన్ని చూసి శుద్ధోదనుడు కొడుకు సన్యసించి వివాహం చేసుకోడేమోనని క్షోభ పడటం (పుట: 19, 20), శుద్ధోదనుడితో పాటు వ్యవసాయక్షేత్రంలో తిరిగే సందర్భంలో తాను వివాహం చేసుకోనని మొండికేసిన సిద్ధార్థుడ్ని చూసి శుద్ధోదనుడు దిగులు చెందటం. ఎలాగైనా సిద్ధార్థుని గృహస్థుని మార్చాలని తానే స్వయంగా పూనుకొని శుద్ధోదనుడు చేసిన ప్రయత్నాలు (పుట:87), "తన మంత్రి ద్వారా 'అష్టైశ్వరాలను అనుభవించడమే ఈ జన్మకి పరమార్థం. రాచ పుట్టుకలోనే రసికత ఉంది. అది రాజధర్మాల్లో ఒకటి. స్త్రీని ప్రేమించి, ఆమెను ఆనందపరచడం యుక్త వయస్సులో ఉన్న రాజకుమారుల ధర్మం" అంటూ పరి పరి విధాలుగా సిద్ధార్థుడిని దారి మళ్ళించేందుకు శుద్ధోదనుడు చేసిన ప్రయత్నాలు, చివరికి మామగారైన దండపాణి సైతం గూఢచారులు చెప్పిన 'వార్త' విని సిద్ధార్థుడు సన్యాసియే అని భ్రమపడటం వంటి అంశాల్ని పరిశీలించినప్పుడు వివాహానికి పూర్వమే సిద్ధార్థుడు పరివ్రాజక జీవితానుసారంగా బ్రతకడం ప్రారంభించాడని తెలుస్తుంది. దీనిని బట్టీ అప్పటికే సిద్ధార్థుడు నాలుగు చూడకూడని దృశ్యాలు చూసి, దృఢమైన సంకల్పంతో పరివ్రాజకత్వం స్వీకరించాలని భావించినట్లు తేటతెల్లమౌతుంది. ఈ అంశాలన్నీ నవలలో ప్రస్తావించబడి ఉన్నాయి. కేవలం తల్లిదండ్రుల మనస్సు నొప్పించకూడదనే కారణం చేతనో, లేక యశోధరకు తన పట్లగల ప్రేమానురాగాల చేతనో సిద్ధార్థుడు గృహస్థుడై ఉండవచ్చే తప్ప, వివాహానికి పూర్వమే సిద్ధార్థుడిలో పరివ్రాజకత్వం స్వీకరించాలనే ఆలోచనలు ఉన్నట్లు మనకు ఈ అంశాల ఆధారంగా నిర్ధారణ అవుతుంది. అయితే రోహిణీ నదీ జలాల విషయంలో ఇరు కుటుంబాల మధ్య జరగబోయే మారణకాండను ముందుగానే గ్రహించి తన నిర్ణయాన్ని దృఢపరచుకొని సిద్ధార్థుడు పరివ్రాజకునిగా మారాడని చెప్పవచ్చు.

ఈ దృష్టితో నవలను పరిశీలించినట్లైతే రచయిత అంతర్నిగూఢంగా సంప్రదాయ బౌద్ధమతావలంభకుల భావనలను చాపకింద నీరులా ఈ నవలలో పొందుపరిచారని అవగతమౌతుంది. మరొక సందర్భాన్ని పరిశీలిస్తే, సిద్ధార్థుడు రాజ్యాధికాలను విడిచిపెట్టి భరద్వాజ ముని చేతులమీదుగా పరివ్రాజక దీక్షను స్వీకరించి, వివిధ ప్రాంతాలు సందర్శిస్తూ రాజగృహ చేరుకుంటాడు. అక్కడ బింబిసార చక్రవర్తిని కలిసి సందర్భంలో బింబిసారుడు కుశల ప్రశ్నలు వేసి 'యువరాజా! శాక్య వంశీయులు మాకు ఎంతో ఆప్తులు. మీరు శాక్య యువరాజులై ఉండి ఇలా రాజ్యాన్ని త్యజించి దేశాటన చేయాల్సిరావడం చాలా బాధాకరం. కపిలవస్తు రాజ్యం మీ పాలనకు అవిూదయోగ్యంగా లేనిచో నా సువిశాల సామ్రాజ్యంలో సగభాగం మీకిస్తాను. ప్రజానురంజకులై పాలనచేసి కీర్తి పొందండి' లేదా 'నా సైన్యబలంతో మీ శత్రువులను తుదముట్టించి వద్దాం పదండి' అంటాడు. అప్పుడు సిద్ధార్థుడు, ప్రియమైన రాజా నాకు 'ఈ ప్రాంపంచిక విషయాలపట్ల ఏ మాత్రం ఆసక్తి లేదు' అంటాడు. అలాగే సిద్ధార్థుడు రాజగృహలో పరివ్రాజకునిగా ఉన్న సందర్భంలో కౌండిన్యుడనే ముని సిద్ధార్థునితో 'మీకీ విషయం తెలుసో లేదో, ఇపుడు కపిలవస్తులో శాక్య, కొలియులు శాంతియుతంగా ఉంటున్నారట' అన్నప్పుడు సైతం సిద్ధార్థుడు నాకక్కడి విషయాల గురించి చింత లేదు' (పుట: 32) అంటాడు. ఈ మాటలను బట్టీ పాఠకునికి సిద్ధార్థుని స్వభావం, ఆలోచనా దృక్పథాలు గోచరమౌతాయి. సిద్ధార్థుడు పరివ్రాజకత్వం స్వీకరించడానికి కారణం కేవలం శాక్య, కొలియుల వివాదమే అని చెప్పుకోవడం కొంత సత్యదూరమైన విషయంగా పాఠకునికి తోస్తుంది.

సిద్ధార్థుని జ్ఞానాన్వేషణ:

పరివ్రాజకత్వం స్వీకరించిన సిద్ధార్థుడు 'మానవులు ఎన్ని ప్రాథమిక సౌకర్యాలు కలిగి ఉన్నప్పటికీ సదా అసంతృప్తులై జీవిస్తున్నారు. అందుకు గల కారణం ఏమై ఉంటుందో తెలుసుకోవాలనే ఉద్దేశంతో లోతైన అన్వేషణ ప్రారంభిస్తాడు'. ఈ అన్వేషణలో భాగంగా భృఘు మహర్షి, ఉద్దాకరామ పుత్రుడు, నేగరిముని వంటి తాపసుల కలసి వారి వద్ద కొంతకాలం ధ్యాన దీక్షను తీసుకుంటాడు. అనేక మంది మహర్షులను కలిసి 'సృష్టి ఎలా ఏర్పడిందంటూ' సృష్టి గురించి ఆరా తీస్తాడు. విశ్వకర్ముడు, ఆగమ ఆర్షణుడు, అనిలరుషి, దీర్ఘతముడు వంటి ఋషుల భావనలను అడిగి తెలుసుకుంటాడు. ఇవన్నీ సిద్ధార్థుని ఆలోచనలకు మరింత బలం చేకూర్చాయని చెప్పవచ్చు. చాతుర్వర్ణ వ్యవస్థ పట్ల ఏహ్యాభావం, వేదజ్ఞానం, అతీంద్రియ శక్తులపట్లు వ్యతిరేకత, జీవాత్మ, పరమాత్మలు లేనే లేవనే భావజాలాలు సిద్ధార్థునికి నాలుగు చూడకూడని దృశ్యాలు చూసినప్పుడే కలిగి ఉండవచ్చు. కాబట్టే అనంతరకాలంలో సిద్ధార్థుడు (బుద్ధుడు) స్థాపించిన బౌద్ధ ధర్మంలో ఇట్టి భావజాలలకు ఎక్కడా చోటు కల్పించలేదు. సర్వమానవ సౌభ్రాతృత్వ భావాన్ని, సర్వ మానవ సమానత్వ భావాల్ని బుద్ధుడు బౌద్ధధర్మంలో నిబిడీకృతం చేశాడు. వేదం మనిషిని జ్ఞాన వంతుడిగా తీర్చిదిద్దేదిగా ఉండాల్సిన ఉండగా మన వేదాలు వివిధ అంశాల దృష్ట్యా మనిషిని మనిషికి దూరం చేసేవిగా ఉన్నాయని బుద్ధుడు దృఢంగా విశ్వసించాడు. కుల, వర్ణ, వర్గ భావజాలాల్ని రేకెత్తించేలా అవి సిద్ధార్థునికి తోచాయి. అందుకే సిద్ధార్థుడు ఈ లోకంలో కుల, వర్ణ, వర్గ రహితమైన ఒక నూతన వ్యవస్థను రూపొందించాలని సంకల్పించాడు. కాబట్టే సిద్ధార్థుడు ధర్మదీక్షను శిష్యులకు ప్రసాదించే సమయంలో సైతం కుల, మత, వర్ణ, వర్గాలకు అతీతంగా అందరికీ సద్ధర్మ దీక్షను ప్రసాదించడం ఈ నవలలో కనిపిస్తుంది. అందుకు ఉదాహరణ ఆనందుడు ప్రకృతి అనే చండాల స్త్రీకి ధర్మదీక్ష ఇవ్వడం, బుద్ధుని బోధనలను దూరం నుండి వింటూ నిలబడిన సుప్రియుడు, శ్వపాకుడు, ఉపాలి వంటి కొందరు అంటరానివారిగా పరిగణించే వారిని బుద్ధుడు పిలిచి మనుషులంతా ఒక్కటే అని వాళ్ళకు ధర్మదీక్షను ప్రసాదించడం (పుట: 98, 123). అలాగే కుష్ఠువ్యాధి గ్రస్థుడైన సుప్రబుద్ధుడు బుద్ధభగవానుడిని చేరి తన వ్యాధిని గురించి వివరించిన సందర్భంలో సామాన్య పాఠకుని ఆలోచనలు బుద్ధుడు తన శక్తియుక్తులతో కుష్ఠువ్యాధిగ్రస్థుడిని వ్యాధిని నయం చేస్తాడని భావిస్తాడు. కానీ అందుకు భిన్నంగా బుద్ధుడు సుప్రబుద్ధుడిని ప్రేమగా చేరదీసి ప్రేమగా ధర్మదీక్షను ప్రసాధించడం (పుట: 98) ఇవన్నీ బుద్ధుని సమసమాజ కాంక్షకు నిదర్శనాలుగా కనిపిస్తాయి. అట్టి సమతా భావంతో కూడుకున్నదే నేడు మనం చూస్తున్న బౌద్ధ ధర్మం.

బుద్ధుని బోధనలు:

సిద్ధార్థునికి వైశాఖ పౌర్ణమి నాడు బోధి వృక్షం కింద కూర్చొని ధ్యానం చేస్తుండగా జ్ఞానోదయమయ్యింది. నాడే సిద్ధార్థుడు బుద్ధునిగా పరివర్తన చెందాడు. 'దు:ఖం లోకమంతటా ఉంది. అది విపరీతమైన తృష్ణ వలన కలుగుతుంది. ఆ తృష్ణ అజ్ఞానం వలన సిద్ధిస్తుంది. ఆ అజ్ఞానం చిత్తవృత్తిని నియంత్రణ చేయడం ద్వారా నిర్మూలమౌతుంది' (పుట: 46) అంటూ, దు:ఖానికి కారణాలు కోరికలు. కోరికలను తెజించటమే దు:ఖ నివారణకు మార్గం' అని కనుగొన్నాడు. ఈ విషయాన్నే నేగరి ముని ఆశ్రమంలోని ఐదుగురు మునులకు మొదటగా బుద్ధుడు తెలియజేశాడు. వీరే పంచవర్గీయ భిక్షువులు. వీరికి బుద్ధుడు బోధించిన తొలి ఉపదేశామే 'ధర్మచక్ర పరివర్తనం'గా పేరుపొందింది. తదనంతరం బుద్ధుడు కుశినార, శ్రావస్తి, కురుదేశం, పావ, రాజ గుహ, మగద, కపిల వస్తు వంటి అనేక ప్రాంతాలను సందర్శించి ప్రజలకు బౌద్ధతత్త్వ బోధనలు చేస్తాడు. అనేక మందికి ధర్మదీక్షలను ప్రసాదించాడు. అట్టి సందర్భంలో బుద్ధుడు బోధించిన అనేక బోధనలు, నీతి కథలు పాఠకుని హృదయాలను ఎంతగానో పరవశింపజేస్తాయి.

ఒకసారి బుద్ధుడు కాశీలో భిక్షాటన చేస్తున్న సందర్భంలో ఒక స్త్రీ బుద్ధునికి భిక్ష వేయకపోగా పలు విధాలుగా దూషిస్తుంది. అప్పుడు బుద్ధుడు 'తల్లీ! నాకు మీరు ఇప్పుడు ఒక వస్తువు ఇచ్చారనుకోండి. ఆ వస్తువును నేను స్వీకరించలేదనుకోండి. అపుడు ఆ వస్తువు ఎవరికి చెందుతుంది? అని ప్రశ్నిస్తాడు. అపుడు ఆ స్త్రీ నవ్వుతూ నీవు స్వీకరించపోతే ఎవరి చెందుతుంది నా వస్తువు కనుక నాకే చెందుతుంది' అని సమాధానం ఇస్తుంది. అప్పుడు బుద్ధుడు సర్గిగా చెప్పారు మీరు. అలాగే మీరు నన్ను దూషిస్తున్నారు కదా! వాటిని నేను స్వీకరించకపోతే అప్పుడు అవి ఎవరికి చెందుతాయి అని ప్రశ్నిస్తాడు' అప్పుడు ఆ స్త్రీ తాను చేసిన తప్పిదాన్ని తెలుసుకొని, బుద్ధుని గొప్పతనాన్ని అర్థం చేసుకొని ఆయన పాదాలపై ప్రణమిల్లుతుంది. ఇట్టి సుబోధనలు విన్నప్పుడు పాఠకునికి హృదయంలో ఏదో తెలియని తన్మయత్వం మొదలౌతుంది. బుద్ధుని పట్ల ఆయన ఆలోచనా దృక్పథాల పట్ల పాఠకులకు ఒక ఆరాధనా భావం కలుగుతుంది.

నేటి ఆధునిక సమాజంలోని అతి భాషికులై ప్రవర్తిస్తున్న అనేక మందికి ఇట్టి సద్ధర్మబోధ మానసికమైన పరివర్తనను తీసుకురావడానికి ఇతోధికంగా తోడ్పడుతుందని చెప్పవచ్చు. అలాగే చెంగా అనే దొంగలో పరివర్తన తీసుకురావటం, అంగులీమాలుడు అనే దారి దోపిడీ దొంగను మార్చి ధర్మదీక్ష ప్రసాదించడం వంటి మరిన్ని కథలు ఈ నవలకు సొగసులద్దాయి. ఇట్టి బోధనలన్నీ పాఠకులను ఎంతగానో ఆకట్టుకుని, బౌద్ధ ధర్మం పట్ల పాఠకుడిని ఆకర్షితుడ్ని చేస్తాయి.

నిర్వాణ స్థితి – అడ్డంకులు:

'నిర్వాణ' అనే పదం గురించి సిక్కు గ్రంథాలలో ప్రస్తావించబడి ఉంది. 'నిర్బన్' అనే పదానికి 'జీవించేవారికి ఒక లక్ష్యం' అని అర్థం. ఈ నిర్బన్ పదం నుండి పుట్టినదే నిర్వాణం. మానవుని సర్వ క్రియలకు మనసే కేంద్రం. మనసు కేంద్రంగా జరిగే అన్ని పనులను మనిషి తెజించాలి. అంటే కోరికలను తెజించాలి. మనిషి నిర్వికారచిత్తునిగా మారాలి. అట్టి నిర్వికారస్థితి నుండి రూపుదిద్దుకున్నదే నిర్వాణ స్థితి. ఒక్క మాటలో చెప్పాలంటే 'నిర్వాణం అంటే నిప్పు పూర్తిగా ఆరిపోవడం. బూడిదలా మారటం'. బుడిదను తిరిగి మండించలేం. అలాగే ఒకసారి నిర్వాణ స్థితిని పొందాక తిరిగి వారి జీవితంలో కోరికలకు తావుండదు. సుఖదు:ఖాలు రెండూ వేదనలే. ఈ రెండూ లేని స్థితినే నిర్వాణం' (పుట: 46) అంటాం. ఆర్య సత్యాలు, అష్టాంగమార్గాలు, హేతువాదదృక్పథం వంటి అంశాలు నిర్వాణ స్థితిని పొందడానికి సోపానాలు. సంప్రదాయ బౌద్ధమతావలంబకులు సైతం నిర్వాణమంటే కోరికలు, బాధలు, కర్మలు, సంసార భవ బంధములు అధిగమించి పొందగలిగే అత్యున్నత స్థితి అని అభివర్ణించారు. ఇట్టి నిర్వాణ స్థితిని పొందాలంటే మనిషి అనేకమైన అడ్డంకులను అధిగమించాలి. 'అజ్ఞానం, కోపం, వ్యామోహం, నిరాశ, జడత్వం వంటి మానసిక భావాలు మనిషిని నిర్వాణ స్థితికి చేరకుండా అడ్డుపడుతుంటాయి'. అట్టి వ్యామోహాల నుండి బయటపడటమే నిర్వాణస్థితి. ఇట్టి నిర్వాణ స్థితిని బుద్ధభగవానుడు జీవిత పర్యంతం వరకు అనుసరించాడు. అందుకు ఉదాహరణయే తండ్రి శుద్ధోధనుడి మరణవార్త విన్నప్పుడు, తల్లి గౌతమి ప్రజాపతి మరణం గురించి తెలుసుకున్నప్పుడూ బుద్ధునిలో ఎలాంటి చలనం కనిపించకపోవటం. పైగా మరణం మనుషులందరికీ అందరికీ అనివార్యం అంటూ శాంతి వచనాలు బోధించటం.

ఈ నవల అద్యంతం ఒక దివ్యమైన ఆరామాన్ని సందర్శించినట్లు పాఠకుడిని ఆకట్టుకుంటుంది. అక్కడక్కడ కొన్ని చిన్న దోషాలను (టైపు దోషాలుగాను, ముద్రణాదోషాలుగాను భావించాలి) మినహాయిస్తే, నవల పాఠకుడిని ఏక బిగిన చదివిస్తుంది. పాఠకుడు నవల చదువుతున్నంతసేపు టైమ్ ట్రావెల్ చేసి బుద్ధుడిని స్వయంగా దర్శించినట్లు, బుద్ధుని బోధనలను ప్రత్యక్షంగా విన్నట్లు, కన్నట్లు భావప్రాప్తిని పొందుతాడు. ఇలా మనిషి ఎలా జీవించాలి. ఎలా జీవించడం వల్ల మనిషి మనీషిగా మారుతాడు. బౌద్ధధర్మం అంటే ఏమిటి, నిర్వాణమంటే ఏమిటి, నిర్వాణ స్థితిని పొందడానికి మానవుడు అనుసరించాల్సిన విధివిధానాలేమిటి వంటి అనేక అంశాలను ఈ నవల పాఠకుని ముందుంచుతుంది.

ఆధార గ్రంథాలు:

1. గౌతమ బుద్ధుడు వికీపిడియా
2. నిర్వాణ నవల– డా॥ బండి సత్యనారాయణ
3. పంచతంత్రం– విష్ణుశర్మ
4. భారతీయ తత్త్వశాస్త్రం – సమగ్ర పరిశీలన – ఆచార్య గూడ సుందర రామయ్య
5. భారతీయ తత్త్వశాస్త్రము – శ్రీ నిర్వికల్పానందస్వామి, సాధన గ్రంథ మండలి, తెనాలి, 1949.
6. బౌద్ధ మతం వికీపిడియా
7. సంస్కృత సాహిత్య చరిత్ర – డా॥ ముదిగంటి గోపాలరెడ్డి, డా॥ ముదిగంటి సుజాతా రెడ్డి, 1997

రచయిత: అసోసియేట్ ప్రొఫెసర్

(20వ పేజీ తరువాయి)

విశ్వం, విశ్వమే నేను' అనే ఒక ఆధ్యాత్మిక తాత్విక సందేశంతోనిండి ఉంది. ఇది విజ్ఞానశాస్త్రం, ధ్యానం, విశ్వచైతన్యం మధ్య అనుసంధానాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ విధంగా 'నేను' యౌగిక కావ్యంలోని 'పరిణామ పథం'లో గల ఛాయాచిత్రాల విశ్లేషణను చెప్పుకోవచ్చు. ఇదేవిధంగా మిగిలిన పథాలను కూడా తర్వాతి వ్యాసాలలో విశదీకరించుకోవాలి.

ఆధార గ్రంథాలు:

1. ప్రసాద్, ఎబికె, సతీష్ చందర్ (సం.). *వార్త పలుకుబడి.* హైదరాబాదు: ఎబికె పబ్లికేషన్స్, 1996.
2. విశ్వర్షి వాసిలి. *నేను యౌగిక కావ్యం.* హైదరాబాదు: యోగాలయ, 2020
3. రామసుబ్బయ్య, మట్టిబోయిన. *బ్రహ్మజిజ్ఞాస (ద్వితీయభాగం).* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు, 2003.
4. శాస్త్రి, జి.ఎల్.ఎన్. *తైత్తరీయోపనిషత్తు.* గుంటూరు: జగద్గురు పీఠము–గుంటూరు శాఖ, 2000.
5. శ్రీరామచంద్రుడు, పుల్లెల. *ఉపనిషత్ సుధాలహరి.* హైదరాబాదు: యువభారతి పబ్లిషర్స్, 2011.
6. హనుమ రామకృష్ణ, యేలేశ్వరపు. *చతుర్వేదాంతర్గత ఉపనిషత్ ఉద్యానవనము (సంపుటి 2).* కూచిపూడి (కృష్ణాజిల్లా): శ్రీమతి యేలేశ్వరపు కనకదుర్గ పబ్లిషర్స్, 2015.

రచయిత: అసోసియేట్ ప్రొఫెసర్

గల్ఫ్ దేశాల మోసాలు - ఎడారి మంటలు

డా. ఎ. మల్లేశ్

'ఎడారి మంటలు' నవల రచయిత పెద్దింటి అశోక్‌కుమార్. ఈయన ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చి రచనా రంగంలోకి అడుగుపెట్టాడు. రచయిత కరీంనగర్ జిల్లాకు చెందినవాడు. 'ఎడారి మంటలు' నవల తెలంగాణలోని సిరిసిల్ల ప్రాంతం నుంచి మస్కట్ వలసెల్లిన దేవరాజు జీవిత కథ. దేవరాజు తన సొంతూర్లో వ్యవసాయం, కూలీ చేసుకొని బతికుతాడు. మస్కట్ వెళ్లి తనకున్న అప్పు తీర్చుకోవాలని నిశ్చయించుకొని, తనకున్న పొలాన్ని, ఇల్లునమ్ముకుంటాడు. తన సొంతూరు వ్యక్తి అయిన యాదగిరి మాటలిని మోస పోతాడు. అలాగే గల్ఫ్ దేశాలకు వలసెల్లే వాళ్లు ఏజెంట్ల చేతిలో ఎలా మోసపోతారో ఈ నవల వివరిస్తుంది. తెలంగాణ నుంచి ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని గ్రామాల నుంచి చాలా మంది మగవారు బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తుంటారు. ఇలా వలస వెళ్లడానికి కారణాలు అనేకం ఉన్నాయి. మొదట మహారాష్ట్రలోని బొంబాయి, బివాండి ప్రాంతాలకు వలస వెళ్లేవారు. ఆ తర్వాత గల్ఫ్ దేశాలకు మెలమెల్లగా వలస వెళ్లడం అలవాటైంది. ఈ ప్రాంతం నుంచి వలసలు దాదాపు 50 సంవత్సరాల నుంచి జరుగుతున్నాయి. నేటికీ కూడా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి ఏడాది గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్లే వాళ్ల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. వలసలు కొంత మంది జీవితాల్లో మార్పులు తీసుకొస్తాయి. వలస వెళ్లిన వాళ్లే రాజ్యాలేలిన చరిత్ర ఉంది. మరికొంత వలస వెళ్లి ప్రాణాలను కోల్పోయిన చరిత్ర కూడా ఉంది. ఇలా వలసపోయిన వాళ్లు కొంత మంది బాగుపడ్డారు. కొంత మంది నష్టపోయారు. అందువల్ల వనసల వల్ల ఆర్థికంగా లాభాలున్నాయి. నష్టాలున్నాయి. సామాజిక చైతన్యం కూడా ఉంది.

'ఎడారి మంటలు' నవలలో ప్రధాన పాత్ర దేవరాజు. అతనికి తన సొంతూరులో ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంటుంది. తన ఊర్లోనే వ్యవసాయం చేసుకొని అప్పుడప్పుడు కూలికి పోయేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు, వయస్సు మీద పడిన తల్లి ఉంటుంది. భార్య పద్మ పదవ తరగతి వరకు చదువుకుంది. పద్మ చిన్నప్పుడే తల్లిని కోల్పోయి సవితి తల్లి సమక్షంలో పెరిగింది. పెళ్లి కాకముందే ఆమెకు ఆమె జీవితం ఎంతో అనుభవాన్ని నేర్పిన విషయం ఈ నవల మనకు తెలియజేస్తుంది. దేవరాజు తల్లి నర్సవ్వ. ఈమె ఈమె జీవితంలో ఎప్పుడూ సుఖమెరుగదు. కష్టాలోనే పుడుతుంది. కష్టాలతోనే చనిపోతుంది. దేవరాజుకు ఒక చెల్లెలు వనజ. ఆమెకు పెళ్లయిపోతుంది. ఈమెను పక్కూరికే ఇస్తారు.

దేవరాజుకు ఒక ఎకరం పొలం మాత్రమే ఉంటుంది. వరుసగా రెండేళ్లు కరువస్తుంది. పంటలేవు. పనులేవు. దానికి తోడు అప్పులు మెడకు చుట్టుకొని భారంగా మారుతాయి. ఈ అప్పులు ఎలా తీర్చాలో అనే ఆలోచనలే దేవరాజును కమ్ముకుంటాయి. వాటి గురించి పదేపదే ఆలోచిస్తుంటాడు. వాటిని తీర్చుదామంటే ఒక పక్క కరువు మరో పక్క చేద్దామంటే పని సరిగ్గా ఉండదు. ఇల్లును మాత్రం దేవరాజు భార్య పద్మ బీడీలు చేసి నడుపుతుంది. ఉత్తర తెలంగాణలోని చాలా మంది స్త్రీలు బీడీలు చేసి కుటుంబాన్ని నడుపుతుంటారు. అవసరమైతే అప్పుడప్పుడు భర్త ఖర్చులకు డబ్బులు కూడా ఇస్తుంది. తన భర్త సంతోషానికి ఏం చేయడానికైనా పద్మ వెనుకాడదు. భర్త అవసరాలను గమనించి వాటిని తీర్చడంలోనే సంతోషాన్ని వెతుకునే భార్యలు ఎందరుంటారో కాని రచయిత ఈ నవలలో పద్మ పాత్రను అతిశయోక్తిగా చూపించాడని మనకు అర్థమవుతుంది. బీడీలు ఆ ప్రాంత వారికి జీవనోపాది కూడా. ఈ పనిలో కూడా దోపడి ఉంటుంది.

పద్మ ఎన్నోసార్లు దేవరాజుకు ఆలోచిస్తే అప్పు తీరదని ఎంత ధైర్యం చెప్పినా అతడు అప్పు గురించే ఆలోచిస్తూ ఉంటాడు. "నువ్వు ఎన్నయినా చెప్పు. నాది రోషం పుట్టుక. మూడు రోజులు ఉపవాసమైన ఉంటాను కానీ మాటంటే పడను" అంటాడు తన భార్యతో దేవరాజు. నిజంగానే దేవరాజు లాంటి వారు ఆకలైన భరిస్తారు కానీ అవమానాన్ని భరించరు. ఇది తెలంగాణ సంస్కృతిలో భాగం. తన బతుకే తనకు భారమై తనని నిత్యం నిద్ర లేకుండా వెంటాడుతుంది. కలవరపెడుతుంది. కాక మీద ఉన్నప్పుడే ఇనుము సాగుతుంది. కష్టాల్లో ఉన్నప్పుడే మనిషి ఏదో చేద్దామని అనుకుంటాడు. అందుకే దేవరాజు అప్పుతీర్చడం కోసం మొదట బొంబాయి, బివాండి వెళ్దామని నిర్ణయించుకుంటాడు. కానీ తన భార్యకు దేవరాజు ఎక్కడికి వెళ్లడం ఇష్టం లేదు. ఎందుకంటే తన భర్తను

చూడకుండా ఒక్కరోజు కూడా ఉండలేదు. ఎప్పుడైనా పుట్టింటికి వెళ్తే మరునాడు తిరిగి వచ్చేది. దేవరాజు కూడా అంతే. ఆమెను విడిచి ఉండలేదు. దేవరాజు, పద్మల మధ్య రచయిత చాలా చక్కటి బంధాన్ని తెలియజేస్తాడు. కానీ కరువు వారిద్దరిని మధ్య ఎడబాటు తీసుకొస్తుంది. ఈ నవల పద్మ పాత్రలో చాలా ఎక్కువ ఓర్పును కూడా చూపిస్తాడు. అతి ఓర్పు గాడిత లక్షణమంటారు కొందరు. ఎప్పుడు కూడా భర్తకు ఎదురు మాట్లాడదు. ఎదురు మాట్లాడవల్సిన సందర్భంలో కూడా మాట్లాడకుండా పద్మ పాత్రను రచయిత తగ్గిస్తాడు.

దేవరాజు తన ఊరిలో మల్లయ్య సేటు వద్ద తన తల్లి ఆరోగ్యం బాగా లేకుంటే ఐదు వేల రూపాయల అప్పు తీసుకుంటాడు. అలాగే బ్యాంక్‌లో అప్పు ఉంటాడు. ఇంకా ఇతరుల వద్ద కూడా అప్పులు చేస్తాడు. ఈ అప్పులు తీర్చడం దేవరాజుకు ఒక గుడిబండగా మారుతుంది. తీర్చుదామంటే పని లేదు పంట లేదు. రోజులు పెరుగుతున్న కొద్ది మరిన్ని అప్పులవుతాడు. రోజురోజుకు అప్పులు పెరుగుతున్నాయే తప్ప తీరవు. చివరికి అతనికున్న ఎకరం పొలం అమ్మిన తీరని అప్పు అతనికుంది. మల్లయ్య సేటు ఊరిలో చాలా మందికి అప్పులిస్తాడు. అప్పు తీర్చకుంటే అప్పు తీసుకున్న వారి వద్ద ఇతర ఆస్తులు తన పేరు రాయించుకుంటాడు. ఇది మల్లయ్య ఎత్తుగడ. ఒకరోజు మల్లయ్య సేటు దేవరాజు ఇంటికొచ్చి అప్పు అడుగుతాడు. ఇంటికి రాగానే "నేను కూర్చుందుడుకు రాలేదు. అటో ఇటో తేల్చుకోవడానికే వచ్చిన, నా బాకీ ఎప్పుడు తీరుస్తవు చెప్పు! ఎన్నిరోజులు ఆగాలి? ఆపద ఉందంటే ఐదు వేలు ఇస్తిని. ఏడాదులు గడిచినా పడ్డీ లేదు. అసలు లేదు. బయట నా గురించి వేరే రకంగా చెప్పవడితివి. ఇస్తవా? ఇద్యవా? చెప్పు" అని గొంతు చించుకొని అరుస్తాడు. ఇలా వారిద్దరి మధ్య మాట, మాట పెరుగుతుంది. మల్లయ్య సేటు దేవరాజును బూతులు తిడుతూ, ఆ బూతు మాటలను ఇంటి ఆడవాళ్ల మీదికి మళ్ళిస్తాడు. అంత వరకు శాంతం ఉన్న దేవరాజు తన ఇంటి ఆడవాళ్లను తిట్టంగానే అనుకోకుండా మల్లయ్య సేటును నెట్టివేస్తాడు. నెట్టి వేయగానే కావాలని మల్లయ్య సేటు కింద పడిపోయి ఏడవడం మొదలుపెడతాడు. కింద పడ్డ మల్లయ్య సేటును అక్కడున్న కొంతమంది లేపి కూర్చోపెడతారు. ఈ సంఘటన జరిగిన తర్వాత దేవరాజు గుండెల్లో దడపుతుంది. ఎందుకంటే మల్లయ్య అన్న మాటలు ఎవరు పట్టించుకోరు. కింద పడ్డదే అందరూ చూస్తారు. అప్పుడే వెంటనే అక్కడున్న జనం నలుగురు నాలుగు మాటలు అనడం మొదలుపెడుతారు. 'పేదవాడి కోపం పెదవికి చేటన్న' విధంగా దేవరాజు పరిస్థితి ఏర్పతుంది. ఈ సంఘటనతో పద్మకు నోటి నుంచి మాటలు రావడం ఆగిపోతాయి. నర్సవ్వ ఒత్తిడికి గురై దీర్ఘాలోచనలో పడుతుంది. మల్లయ్య దగ్గర తన కోసమే అప్పు చేశారని మరింత కృంగిపోతుంది. ఆర్థిక ఇబ్బందులొస్తే కుటుంబాలెలా ఆగమవుతాయో ఈ నవల మనకు తెలియజేస్తుంది. పరువు పోతే తిరిగి పరువు రాదని పద్మాదేవరాజులు బాధలో పడిపోతారు. పేదోడి కోపం ఎన్ని అర్థాలకు దారితీస్తుందో దేవరాజుకు, పద్మకు అర్థమవుతుంది.

చివరికి దేవరాజు మల్లయ్య సేటును కొట్టినందుకు ఊర్లో పంచాయతీ పెడతారు. పంచాయతీ కంటే ముందే దేవరాజు తన తల్లి మాట మీద ఊర్లో ఉన్న కొంతమంది పెద్ద మనుషుల్ని కలిసి నేను కావాలని చేయలేదని వేడుకుంటాడు. కానీ వారు దేవరాజు మాట వినరు. అతని మాటకు విలువ లేదు. చివరికి ఊరు పెద్దలు దేవరాజుకు వెయ్యి రూపాయలు జరిమానం వేసి, వారం రోజుల్లో జరిమానం వేసిన డబ్బులు తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని ఊరు పెద్దలు తీర్మానం చేస్తారు. వారంలో తిరిగివ్వకుంటే దేవరాజుకున్న ఒక ఎకరం పొలం మల్లయ్య సేటు పేరా అవుతుందని కూడా తీర్మానం చేస్తారు. ఈ మాటలిన్నా నర్సవ్వ ఊరు పెద్దల మీద అరుస్తుంది. కానీ ఆమె మాటలు ఎవరినరని పద్మ కర్థమై అక్కడ నుంచి నర్సవ్వను తీసుకొనిపోతుంది. ఇక్కడ రచయిత నవలలో ఊరి పెద్ద మనుషుల స్వభావాన్ని చాలా చక్కగా వెల్లడిస్తాడు. 'గుత్తుప ఉన్నోడిదే బర్రె అన్నట్టు' మనకు అర్థం చేయిస్తాడు. నిజానికి ఊరు కొన్నిసార్లు ఎవరికి అర్థం కాదు. కొన్నిసార్లు ఊరు ఎటువైపు ఉంటుందో, ఎవరి పక్షనా ఉంటుందో చెప్పలేము. ఊరు ఒక ఫ్యూడల్ స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఊరంటే కుల వ్యవస్థ. ఊరు కుల పరమైన ఆకారంలో ఉంటుంది. మానవీయత ఉన్నట్టు కనిపిస్తుంది. న్యాయం దొరుకుతుందని నమ్మిస్తుంది. ఊరు అవసరాల పరిస్థితుల మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుందని ఈ నవల చెపుతుంది. నిజానికి మల్లయ్య సేటు నిజాయితీ పరుడేమి కాదు. ఆశాజీవి. ఆస్తి పిచ్చి. ఒక పక్క వ్యాపారం చేస్తూ, మరో పక్క అప్పులిచ్చి ఆస్తులు రాపిచ్చుకునే రకం. మల్లయ్య సేటు పక్కనే దేవరాజు ఎకరా పొలం ఉంటుంది. ఎప్పటి నుంచో మల్లయ్య కన్ను ఆ పొలం మీద పడుతుంది. దానిని దక్కించుకునే అవకాశం కొరకు ఎదురుచూస్తాడు. ఆ అవకాశం రానే వచ్చింది. ఏ ఉద్దేశం లేకుండా ఎవరికి ఏ ఆలోచన రాదు. ఒక్కొక్క సారి ఉద్దేశమే మనిషి ఆలోచనలను నిర్ణయిస్తుందేమోనని అనిపిస్తుంది. మల్లయ్య ఉద్దేశపూర్వకంగానే దేవరాజుతో గొడవ పడతాడు. పంచాయితీలో మల్లయ్య తన మాట నెగ్గించుకుంటాడు.

దేవరాజుకు రోజురోజుకు అప్పులు, వాటి మిత్తీలు పెరిగిపోయి అతని గుండెల్లో గుబులు పుట్టిస్తాయి. ఎలాగైనా అప్పు తీర్చాలని నిర్ణయించుకుంటాడు. తన ఊరి వాడైనా యాదగిరి మస్కట్‌లో ఐదేళ్లు ఉండి ఊరికి తిరిగి వస్తాడు. మస్కట్ వెళ్లొచ్చిన తరువాత ఆర్థికంగా అతని జీవితం మారిపోతుంది. అతనికి ఊరిలో మర్యాదలు పెరిగిపోతాయి. మర్యాద మానవ సంబంధాలన్ని పెంచాలి. కానీ డబ్బే మర్యాదగా ఈ నవల చెపుతుంది. యాదగిరిలో నిజాయితీ ఏమాత్రం లేదు. యాదగిరి భార్య సుశీల మంచి మనిషి. చదువుకోకపోయినా నిజాయితీ పరురాలు. సుశీలకు, పద్మకు మంచి సోపతి ఉంటుంది. ఒకరినొకరు అర్థం చేసుకునే గొప్ప మనసు వాళ్లది. అప్పుడప్పుడు సుశీల పద్మకు బాధలను అర్థం చేసుకొని సహాయపడుతూ ఉంటుంది. పద్మ కూడా సుశీలకు ఏదో రకంగా సహాయపడుతుంది. మస్కట్ నుంచి తన భర్త వేసిన ఉత్తరాలను పద్మ చదివి సుశీలకు వినిపిస్తుంది. మళ్లీ ఉత్తరం కూడా రాస్తూ ఉంటుంది. సుశీల పద్మను తన తోడ పుట్టిన చెల్లెలుగా భావిస్తుంది. ఈ ఇద్దరి పాత్రల ద్వారా రచయిత గొప్ప మానవ సంబంధాన్ని చక్కగా విశదీకరిస్తాడు. మానవ సంబంధాలు మెరుగుపడాలంటే మర్యాద, నమ్మకం చాలా ముఖ్యమైనవి. మర్యాద, నమ్మకంతోనే మానవ సంబంధాలు మెరుగుపడతాయి. బలపడతాయి కూడా. సుశీల, పద్మల మధ్య చివరి వరకు విడిపోని బంధంగానే నవల చిత్రీకరించబడింది. కానీ యాదగిరి నీచ బుద్ధి పద్మ మీద పడుతుంది. ఆమెను ఎలాగైనా లొంగ తీసుకోవాలని వల వేస్తాడు. కానీ పద్మ అతని వలకు లొంగలేదు. చివరికి దేవరాజును ఎలాగైనా మస్కట్ పంపించి తన వశం చేసుకుందామని కూడా కొత్త ఎత్తుగడ వేస్తాడు. అది కూడా కుదరదు.

యాదగిరి మస్కట్ నుంచి వచ్చినప్పుడు పది వీసాలను తీసుకొచ్చాడని దేవరాజు చెవుల పడుతుంది. ఆ మాట విన్న దేవరాజు కాలు నిలువక అతనింటికెళ్లి అతన్ని పలకరించి విషయం తెలుసుకుంటాడు. మాటల్లో మాట కలుపుతూ తన పరిస్థితిని దేవరాజు, యాదగిరికి మొత్తం చెప్పుకొని తను కూడా మస్కట్ పోతానని యాదిగిరితో దేవరాజు చెప్పుకుంటాడు. యాదగిరి దానికింత ఖర్చవుతుందని చెబుతాడు. అయినా పర్వాలేదంటాడు దేవరాజు. ఎప్పుడు అలవాటు లేని దేవరాజుకు యాదగిరి తాగుడు అలవాటు చేస్తాడు. రోజురోజుకు దేవరాజులో మొండితనం, కర్కశం ఎక్కువవుతుంది. దీనిని చూసి తన భార్య, తల్లి భయపడి చల్లించిపోతారు. అయిన దేవరాజుకు ఎదురు చెప్పరు. ఎందుకంటే వద్దంటే ఏదైన చేసుకుంటాడేమోనని వాళ్లు భయపడిపోతారు. నిజానికి దేవరాజు మస్కట్ వెళ్లడానికున్నది ఒకటే దారి అది అతని ఉన్న ఎకరం పొలం అమ్మడం. ఆ పొలం అమ్మితే అప్పులకే సరిపోవు కాబట్టి ఎవరికి తెలియకుండా దేవరాజు తన పొలాన్ని యాదగిరికి అమ్మాలని చూస్తాడు. కాని యాదగిరి, దేవరాజు పొలాన్ని మల్లయ్య సేటుకు తక్కువ ధరకు ఇప్పించి, అందులో కమిషన్ తీసుకుంటాడు. ఈ విషయం దేవరాజుకు తెలియదు. ఎందుకంటే అతని కోరిక నెరవేరుతుందని సంతోషంలో మునిగిపోతాడు. చివరికి మల్లయ్య సేటు తన అప్పు పట్టుకొని మిగిలి డబ్బులు ఇస్తాడు. మల్లయ్య ఇచ్చిన డబ్బులు దేవరాజు మస్కట్ వెళ్లడానికి సరిపోవు. చివరికి తన ఇల్లు కూడా అమ్ముకుంటాడు. చివరికి దేవరాజు కుటుంబం తను అమ్మిన ఇంట్లోనే అద్దెకు ఉంటారు. నిజానికి గల్ఫ్ దేశాలకు వెళ్లేవాళు అప్పు గురించి, మిత్తి గురించి, వారికున్న చిన్న చిన్న ఆస్తుల గురించి ఆలోచించరు. అక్కడికి ఎలాగైన వెళ్లాలనే ఆలోచన మాత్రమే చేస్తారు. మొదటి నుంచి దేవరాజు తల్లి యాదగిరి గురించి ఎంత చెప్పిన వినిపంచుకోడు. చివరికి తన మాటనే దేవరాజు నెగ్గించుకున్నాడు. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు వెళ్లేవాళ్లు వీసా చూపించి మరింత అప్పు చేస్తారు. వీసా చూసి కూడా అప్పు ఇస్తారు.

యాదగిరి ముందే పథకం ప్రకారం మొదట తను పంపించిన పది మందితో పాటు దేవరాజును పంచించడు. అప్పుడు దేవరాజు మదిలో గబులు మొదలవుతుంది. ఒకవేళ మస్కట్ వెళ్లకుండా తన పరిస్థితేందని ఆలోచనల లోకంలో పడిపోతాడు. ఇతని ఒక్కణ్ణి ఒంటరిగా పంపిస్తాడు. మొదట ఊరి నుంచి బయలుదేరి ముంబాయికి దేవరాజు, యాదగిరి వస్తారు. అక్కడ మొదటి రోజు పని కాదు. దేవరాజును ఒక్కణ్ణే అక్కడ ఒంటరిగా వదిలి పెట్టి యాదగిరి వెళ్లిపోతాడు. ఈ నెల రోజులు దేవరాజు నరకం అనుభవిస్తాడు. తన దగ్గర ఉన్న డబ్బులన్ని అయిపోతాయి. చివరికి కూలి పని చేస్తాడు. ముంబాయిలో నెల రోజులలో ఎన్నో ఇబ్బందులను ఎదురుకుంటాడు. చివరి ఊరికి పోదామంటే కాళ్లు ఆడవు. తనకు తన భార్య పిల్లలు, తల్లి గుర్తుకు వస్తారు. వారి మాటనన్న వినకపోతినని మనుసులో అనుకుంటాడు. 'చెప్పితే వినపోతే చెడితే బుద్ధి వస్తుందనే' విధంగా దేవరాజు పరిస్థితి ఏర్పడుతుంది. యాదగిరి నెల రోజుల తరువాత వస్తాడు. అతని చూడగానే దేవరాజుకు ఎక్కడలేని కోపం ముంచుకొస్తుంది. దేవరాజు పరిస్థితిని గమనించి యాదగిరి మెల్లగా అలస్యమైన అక్కడ నీకు మంచి పని దొరికింది. అది మూన్సిపాలిటీ పని లాంటిది అంటాడు. అంత వరకు కోపంగా ఉన్న దేవరాజు ఆ మాట వినగానే అతనిలో ఉన్న కోపం మెల్లగా చల్లారుతుంది. అంత

నా మంచికే జరిగిందని మనసులో అనుకుంటాడు. పరిసరాలు, అవసరాలు మనిషిని ఏ విధంగా మలుచుతాయో దేవరాజు పాత్ర మనకు చెపుతుంది. చివరికి దేవరాజు విమానమెక్కి మస్కట్‌లో అడుగుపెడుతాడు. ముందుగానే యాదగిరి చెప్పినట్టుగానే మస్కెట్ వెళ్లగానే ఎయిర్‌పోర్టుకు ఒకరొచ్చి పికప్ చేసుకుంటాడని చెపుతాడు. అలాగే ఒకరు వచ్చి పికప్ చేసుకుంటాడు. మొదటి మూడు రోజులు దేవరాజును ఎసి గదుల్లోనే ఉంచుకున్నాడు. అక్కడ అతనికి అంత ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఎవరికైనా కొత్త ప్రదేశాలను చూసినప్పుడు ఆశ్చర్యం కలుగడం సహజం. మొదటి రోజు దేవరాజుకు మొక్కలకు నీళ్లు పోసే పని చెపుతారు. ఇదే నా పని అనుకుంటాడు కూడా దేవరాజు. అక్కడి భాష అతనికి రాదు. అక్కడి చేరుకోగానే ఇంటికి ఉత్తరం రాయాలనిపిస్తుంది. అక్కడ ఉన్న హౌస్‌బాయ్‌కి సైగ చేసి ఉత్తరం తెప్పించుకొని ఇక్కడ క్షేమంగా చేరుకున్నాను. ఇక్కడ ఎక్కువ పనేమీ లేదని ఇంటికి ఉత్తరం రాస్తాడు. మస్కట్‌లో ఉన్నవారిని, ఊర్లో ఉన్న వారికి కలిపేది శక్తి ఆ రోజుల్లో ఒక ఉత్తరానికే ఉంది. ఆ రోజుల్లో ఉత్తరానికి ప్రాధాన్యత ఎక్కువగా ఉండేది. మూడు రోజుల తరువాత దేవరాజును, కపిల్ కమాండర్ జీపులో కూర్చోబెట్టుకొని బయటకు వెళ్తాడు. ఎక్కడికి వెళ్లేది దేవరాజు తెలియదు. మూడు గంటల తరువాత జీపు ఒక చోటు ఆగుతుంది. ఆ ప్రాంతాన్ని చూసిన దేవరాజు ఆలోచనలు ఎక్కడికో పోతాయి. అది ఎడారి ప్రాంతం. అక్కడ గొర్రెలు ఉన్నాయి. ఒక గుడారం ఉంది. వాటిని చూడగానే తన పనేమిటో దేవరాజుకు వాస్తవం అర్థమైపోయింది. అంతకు ముందే మస్కట్‌లో గొర్రెల కాపరి జీవితం దుర్భరంగా, నరకంగా ఉంటుందని, అక్కడ మనుషులెరు ఉండరని విన్నాడు. అలాంటి జీవితం తనకే వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. తను ఇక్కడ ఉండనని ఎంత సైగలతో కపిల్‌కు చెప్పిన వినిపించుకోకుండానే దేవరాజు గుడారంలోకి లాక్కుపోతాడు. లోపల గుడారం ఇల్లు వలెనే రెండు గదులున్నాయి. అందులో కిరోసిన్, స్టౌవ్, వంట పాత్రలు, నీటి పాత్రలు ఇంతకు ముందే ఎవరో వాడినట్టు ఉన్నాయి. బతుకుదెరువు కోసమని వెళ్తే చావు నోట్ల పడ్డట్లయింది దేవరాజు జీవితం.

దేవరాజు మొదటిసారి రాసిన ఉత్తరం తన వాళ్లకు అందింది. అందులో ఉన్న విషయాన్ని తెలుసుకొని సంతోషిస్తారు. దేవరాజు మస్కట్ పోయిన తరువాత అతని కుటుంబం మీద చాలా మందికి ప్రేమలు, సానుభూతి పెరిగే విధానం ఎంతో అద్భుతంగా వర్ణించాడు రచయిత. ఎప్పుడు మాట్లాడని వారు నర్సవ్వతో, పద్మతో మాట్లాడే సన్నివేశాలు అద్భుతంగా అనిపిస్తాయి. మస్కట్ వెళ్లే కుటుంబాలకు మర్యాదలేక్కువేనని అనిపిస్తుంది. దేవరాజు ఊళ్లో ఉన్నప్పుడు ఎవరు అతని కుటంబాన్ని పెద్ద పలుకరించేది కాదు. దేవరాజు మస్కట్‌లో మంచి పని చేస్తుండని, బాగానే సంపాదిస్తున్నాడని తెలుసుకొని తన భార్యను, తల్లిని అందరు మర్యాదలతో పలుకరిస్తారు. ఇక్కడ రచయిత మనుషులు ఏ సందర్భంలో ఎలా ఉంటారో ఈ నవలలో మనకు వివరిస్తాడు. అలాగే ఏ ఎండకు ఆ గొడుకు పట్టే మనిషి మల్లయ్య సేటు. మస్కట్‌లో ఉన్నవాడి అప్పు బ్యాంక్‌లో వేసినట్టే అంటాడు. డబ్బు ముఖ్యమా, మనిషి ముఖ్యమా అనే విధంగా నవలా సాగి డబ్బే ముఖ్యమనే విధంగా నవలా నడుస్తుంది.

పద్మ, నర్సవ్వల బతుకు దేవరాజు మస్కట్ వెళ్లకముందు ఒక రంధి, వెళ్లిన తరువాత మరో రంధి అయింది. కండ్ల ముందు కొడుకు కంటికి దూరమైతే తల్లి బాధ ఎట్లుంటదో రచయిత చాలా చక్క వ్యక్తపరిచాడు. "కలిగిన కాడికి తిని కండ్లముందట ఉండురా అంటే విన లేదు. ఇక్కడ పని చేతకాక మస్కట్ పోతనని మంకుపట్టుపట్టె. రేపే మస్కట్ వెళ్లుడని బొంబాయి పాయె. అమాసకు అమాసదాటిపాయె. ఈ రోజుకు నెల మీద ఇరువై రోజులాయె. ఏ విషయం తెలియకపాయె. కారటు గూడా లేకపాయెం'' అని దేవరాజు తల్లి దిగులుపడుతుంది. ఇక్కడ రచయిత సామాన్యుడి కలల ప్రపంచం మస్కట్ అంటాడు. అదొక్కటే కాదు సౌదీ అరేబియా, దువాఖతర్, దుబాయ్, బైరన్. మేమన్, ఖత్తర్ మొదలైన గల్ఫ్ దేశాలన్నీ. అక్కడికెళ్లగానే చాలా మంది లక్షాధికారులై పోతామనుకుంటారు. ఎంత డబ్బు వెచ్చించి వెళ్లడానికైనా వెనుకాడరు. ఎవరో ఒకరు అక్కడికెళ్లి లక్షలు సంపాదిస్తే, వారిని చూసి తాము కూడా సంపాదించాలన్నా కోరికతో ఉన్న ఆస్తులు అన్ని అమ్మి వెళుతారంటాడు రచయిత. చెప్పుడు మాటలు ఎంత ప్రభావాన్ని చూపుతాయో ఇక్కడ రచయిత మనకు అర్థం చేయిస్తున్నాడు. గల్ఫ్ దేశాలు ఒక్కప్పుడు పేద దేశాలే. పెట్రోల్ నిలువలు ఆ దేశాలకు ఒక వరంలా దొరకడం వల్ల ఇతర దేశాలు వాటి మీద ఆధారపడం జరిగింది. దీంతో ఆ దేశ పరిస్థితి మారిపోయింది. ఆ దేశాలకు పని కోసం వలసలు పెరిగిపోయాయంటారు రచయిత.

గల్ఫ్ దేశాల్లో గొర్ల కాపరిగా పని చేసే వారి జీవితాలను కండ్లకు కట్టినట్లు రచయిత చిత్రిస్తాడు. గొర్లకు పాలు పిండడం. వాటిని రోజు మేపుకు రావడం గొర్ల కాపరుల నిత్య క్రియ. ఎడారిలో దారులన్ని ఒకే విధంగా ఉంటాయి. దారి తప్పితే ఆ దినం రాత్రి పస్తులే ఉండాలి. ప్రమాదకరమైన పాములు రాత్రి పూట సంచరిస్తుంటాయి. ఎడారిలో కరెంటు ఉండదు.

కొవ్వత్తే దిక్కు. సమయం ఎంతో తెలుసుకోవడం అతి కష్టమంటాడు. మనిషే, మనిషి మీద మృగంలా దేవరాజు మీద కపిల్ ప్రవర్తిస్తాడు. జీతం, ఉత్తరం అడిగినందుకు కపిల్‌ను కొట్టి, దేవరాజు కోసం తెచ్చిన ఆహార పదార్థాలను, నీటి. కిరోసిన్ ఎడారి పాలు చేస్తాడు. మనిషికి మనిషే ఎందుకు మృగమవుతాడో ఇప్పటికి మనిషి తెలుసుకోలేపోతున్నాడంటాడు రచయిత. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ఇక్కడికొచ్చి నరకయాతన పడే విధంగా పాఠకులను కలవరపెడుతుంది. ఒంటరితనం పిచ్చివాడిని చేస్తుందనే విధంగా దేవరాజు బతుకు పిచ్చివాడిలా తయారవుతుంది.

దేవరాజును కపిల్ కొట్టిన రోజు అతడు గొర్లను మేపడానికి వెళ్లడు. గుడారంలో ఉంటాడు. రోజు ఎండలో తిరిగిన అతనికి గుడారంలో చల్లగా ఉంటుంది. గుడారంలో ఉన్న రోజు తను రోజు ఎంత నరకం అనుభవిస్తున్నాడో తెలుసుకున్నాడు. పగలు తప్ప రాత్రి ఆ గుడారంలో ఏమి కనిపించదు. ఆ రోజు గుడారంలో ఒక చిట్టి (కాగితం) కనిపిస్తుంది. దానిని చదివి అక్కడ ఒక్క నిమిషంలో ఉండకూడదని నిర్ణయించుకుంటాడు. అందులో ఎటుపోతే ఏమి వస్తుందో రాసి ఉంటుంది. అ చిట్టిని అక్కడే పెట్టి తన కాళ్లకు పని చెపుతాడు. ఈ ఎడారిలో "కన్నుపొడుచుకున్నా కనిపించని చీకటి. అడుగు ముందు ఏముందో తెలియదు. అడుగులో అడుగు చేసుకుంటూ నడుస్తున్నాడు" దేవరాజు. అక్కడి నుండి బయలుదేరిన మరునాడు కపిల్ గుడారం దగ్గరికి వస్తాడు. గుడారంలో దేవరాజు కనిపించకపోవడంలో పారిపోయిననట్టు గ్రహించి, ఇంటికి వెళ్లిన వెంటనే హౌస్‌బాయ్ దగ్గర దేవరాజు ఇంటి అడ్రస్ తీసుకొని, దేవరాజు ఆక్సిడెంట్‌లో చనిపోయాడని దేవరాజు ఇంటికి కపిల్ టెలిగ్రామ్ పెడుతాడు. ఇక్కడ మనం గమనించవలసిన విషయం జీతం ఇవ్వకుండా పని చేయించుకొని, దేవరాజు మీద దౌర్జన్యం చేస్తూ, చివరికి చనిపోయాడని అసత్యాలు చెప్పడం చాలా బాధకమైన విషయం. ఎందుకంటే, ఆధునిక ప్రపంచం, అభివృద్ధి చెందిన సమాజమని చెప్పుకునే అగ్రదేశాలకు ఈ అన్యాయాలు కనిపించయా! అనిపిస్తుంది. మనుషులు కోపంలో ఏమి చేస్తారో అర్థం కాని ఆధునిక ప్రపంచమిది. దేవరాజు అసత్యపు మరణవార్త అందుకున్న కుటుంబం అల్లకల్లోమవుతుంది. చివరికి దేవరాజు తల్లి మరణిస్తుంది. దేవరాజు భార్య హస్పిటల్ పాలవుతుంది. తర్వాత తన తల్లిగారింటికి వెళ్ళిపోతుంది. యాదగిరి భార్య సుశీలకు కూడా దేవరాజు మరణవార్త తెలుస్తుంది. వెంటనే పద్మ ఉన్న తల్లిగారింటికి వెళ్తుంది. యాదగిరి కూడా ఎజెంట్ మోసం చేసి దుబాయ్ పారిపోయాడని సుశీలతో చెపుతాడు. ఈ సంఘటన జరిగిన తరువాత యాదగిరి సుశీలతో ఇల్లు, భూమి అమ్మమని చెపుతాడు. ఇల్లు అమ్మితే అనుమానం వస్తుందని ముందు భూమి నమ్మి వీసా కోసం డబ్బులు కట్టిన వారికి ఇస్తుంది. అలాగే దేవరాజు భార్యకు 60 వేలు ఇవ్వబోతే పద్మ తీసుకోదు. 'అందరు కావాలె కావాలె అంటరు... నువ్వేంటే డబ్బు ఇస్తనంటే వద్దంటున్నవు' అంటూ ఆశ్చర్యమనిపిస్తుంది సుశీలకు. డబ్బే తన కుటుంబం ఈ పరిస్థితికి వచ్చిన కూడా సుశీల ఇచ్చే డబ్బు తీసుకోదు. ఈ డబ్బును పద్మకు తెలియకుండా తన సవితి తల్లి సుశీల నుంచి తీసుకుంటుంది. ఆపదలో ఉన్న వారికంటే అత్యాశ పరులకే డబ్బు ఎక్కువగా ఉపయోగపడుతుందని అనిపిస్తుంది. ఈ నవలలో రచయిత సుశీల పాత్రను నవలా మొత్తంగా పాజిటివ్‌గా చిత్రీకరించాడు. కాని సుశీల భర్త యాదగిరి నవలా మొత్తంగా కుటిలపరుడిగా కనిపిస్తాడు. 'జివ్వకో రుచి, పుర్రెకో బుద్ధి' అనే విధంగా మనుషుల గుణాలున్నాయని ఈ నవల తెలుపుతుంది.

దేవరాజు చివరికి కనకయ్య అనే తెలుగు వాణ్ణి కలుసుకుంటాడు. ఇతను కూడా దేవరాజుతో నెల రోజులు పని చేయించుకొని డబ్బులివ్వకుండా మోసం చేస్తాడు. ఎజెంట్‌తో మాట్లాడి పని కల్పిస్తానని నమ్మిస్తాడు. చివరికి ఒక అక్కడనే ఒంటరిగా ఒంటెలు కాస్తున్న తెలుగు వాడి ద్వారా కనకయ్య మోసపు గుణం గురించి తెలుసుకొని అక్కడి నుంచి మళ్లీ బయలుదేరుతాడు. మృత్యువు తనను ఎప్పుడు కబలిస్తుందో తెలియని సందిద్గ లోకంలో పడుతాడు. చివరి ఒక పట్టణాన్ని చేరుకుంటాడు. అక్కడ ఒక హస్పిటల్ కనిపిస్తుందనికి. అక్కడికెళ్తాడు. అక్కడ ఒక తెలుగు డాక్టర్ పలుకరించడంతో అదృష్టంగా భావిస్తాడు. తనకు జరిగిన కథనంతా చెప్పుకొని ఏడుస్తాడు. దేవరాజుకు జరిగిన అన్యాయాన్ని విని డాక్టర్లు జాలిపడి అతనికి ట్రీట్‌మెంట్ చేస్తారు. ఇక్కడే తనకు పని చూపించమని వాళ్ల కాళ్లు పట్టుకుంటాడు. పరిస్థితులకు మనిషి ఎలా బానిస అవుతాడో ఈ నవలలో దేవరాజు పాత్ర ద్వారా చిత్రీకరిస్తాడు. చివరికి డాక్టర్లు ఇండియన్ ఎన్‌ఆర్‌ఐలతో మాట్లాడి లక్ష రూపాయలు సహయం చేస్తారు. అక్కడి నుండి తన ఊరికి విమానంలో బయలుదేరుతాడు. దీనితో కథ ముగుస్తుంది.

అలాగే రచయిత ఆ దేశాల్లో వరకట్న సమస్య ఉండదని అంటారు. ఆడపిల్ల తల్లిదండ్రులకే కన్యాశుల్కం ఇస్తారని అంటారు. అక్కడైన మన దేశంలోనైన పెండ్లి జరగాలంటే కట్నం ఇచ్చుకునే సాంఘిక దురాచారం మాత్రం ఉంది. గల్ఫ్ దేశాల్లో అక్షరాస్యత ఎక్కువగానే ఉంటుందంటాడు. ఈ తరం వారందరికి మస్కట్‌లో విద్యావకాలున్నాయని అంటాడు. అక్కడ పేదరికం కూడా తక్కువే అంటాడు.

పుస్తక
పరిచయం

'కన్నీటి కాలువ'లో కొట్టుకుపోతున్న తాండాలు

డా. సైదులు ఖేతావత్

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనేది సంస్కృత సుభాషితాల్లో అత్యంత ప్రసిద్ధిచెందిన వాక్యం. దీని అర్థం "జననీ, జన్మభూమి స్వర్గం కంటే గొప్పవని, ఈ వాక్యం భారతీయ సంస్కృతిలో మాతృభూమి, మాతృప్రేమ కృతజ్ఞతాభావాలకు ప్రతీకలుగా కన్పిస్తాయి. మనం పుట్టిన నేల, మన సంస్కృతి, మన భాషకు మన వ్యక్తిత్వానికి పునాదులు వేస్తాయి. పై సుభాషితం ఆంగోత్ వెంకట్ పవార్ రాసిన "మరోలదణి"కి అక్షరాల సరిపోతుంది. మెకంజీ సేకరించిన కైఫీయత్తులు ఆయాగ్రామాల చరిత్రను జీవన విధానాన్ని సంస్కృతిని తెలియజేస్తాయి. కైఫియత్తుల మాదిరే దేశ చరిత్రలోనే మొదటి తాండా చరిత్ర "మరోలదణి" (తాండా కైఫీ యత్) రచించారు. రచయిత ఆంగోత్ వెంకట్ పవార్. ఉమ్మడి పాలమూరు జిల్లా (ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లా) బిజినపల్లి మండలంలోని కారుకొండ తాండాలో జన్మించారు. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరి ప్రవృత్తి పరిశోధన, విమర్శ, కథ, నవల వంటి సాహిత్య ప్రక్రియలలో రచనా వ్యాసంగం చేస్తున్నారు. మరోలదనణి పుస్తకం 2017 సంవత్సరంలో రచించారు. ఈ పుస్తకంలో 149 పేజీలతో 13 అంశాలను ప్రధానంగా చేసి ముంపుకు గురవుతున్న తండాల కన్నీటి జీవితాలను అక్షరీకరించారు. దీనితోపాటు 'కేసరి సముద్ర బుద్ధుడు' అనే పుస్తకానికి వనపట్ల సుబ్బయ్యతో కలిసి సంపాదకత్వం వహించారు. ఉద్యమకారుల అంతరంగం' లోచూపు' అనే పుస్తకం, ముంపు బాధితుల గోసను 'కన్నీళ్ళ కథలు 'పేరుతో కథల పుస్తకం ముద్రణ దశలో ఉన్నాయి. మరుగున పడ్డ గోరు బంజారాల అస్తిత్వ సాహిత్యాన్ని వెలికితీయడానికి కంకణ బద్ధులయ్యారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న బంజారాలు(లంబాడాలు) సంచార జీవితాన్ని వదిలి స్థిరనివాసం ఏర్పరుచుకొని జీవిస్తున్నారు. బంజారాలది(లంబాడాలది) అత్యంత విశిష్టమైన చరిత్ర, సంప్రదాయం, సాంస్కృతిక వైభవం కలిగి ఉన్నది. వీరు ప్రాచీన కాలం నుండి వ్యాపారం, పశుపోషణ, దేశమంతా ప్రయాణిస్తూ జీవనం సాగించారు. బంజారాల (లాంబడాల) జీవితంలో లదణి(బిడారు) అనేది కేవలం తాత్కాలిక నివాసం మాత్రమే కాక, వారి సామాజిక, సాంస్కృతిక జీవనానికి కేంద్ర బిందువు. బిడారు అనేది బంజారా కుటుంబాలు తాత్కాలికంగా స్థిరపడే గుడారాల సమూహం. పశువులకు మేత, నీరు లభించే ప్రదేశాలలో లేదా వాణిజ్య మార్గాల వెంట బంజారాలు బిడారు వేస్తారు.

కొన్ని అదృశ్య శక్తుల ప్రోద్బలంతో బంజార కుటుంబాలను బంజారహిల్స్ నుండి తరిమేస్తే 19వ శతాబ్దంలో పొట్టచేత పట్టుకొని దక్షిణ వికారాబాద్ అడవులు, గండీడ్ అడవుల గుండా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వట్టెం అటవీ ప్రాంతానికి వలస వచ్చిన ఆంగోత్ నరాణ్ కోవలి కుటుంబ కథా చిత్రమిది. బిందవు బిందువు కలిస్తే సింధువైనట్లు, ఒక్కరూ ఇద్దరై ఒక అందమైన తాండా నిర్మాణానికి పునాది వేశారు. మహావృక్షంలాంటి తన తాండాను కూకటి వేళ్లతో సహ పెకిలిస్తున్నారని తెలుసుకొని రచయిత పడ్డ వేదన నుండి పురుడుపోసుకున్న పుస్తకమే "మరో లదణి".

రాష్ట్రంలో నిర్మాణం అవుతున్న నూతన నీటి ప్రాజెక్టు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా వట్టెం రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న తాండాలు కారుకొండ తాండా, అనేఖాన్ పల్లి తాండా, జిగుట్ట తాండ, రామ్ రెడ్డి పల్లి తాండాలతో పాటువేరే చోట్ల ఎక్కువగాతాండాలు కొన్ని ఊర్లు ఈ ఎత్తిపోతల పథకం తన పొట్టలో పెట్టుకుంది. తాండాల జల సమాధిని, ముంపునకు గురై నిర్వీర్యమైపోతున్న తాండా చరిత్రను ఈ సమాజం ముందుంచే ప్రయత్నం చేశారు. రెండు వందల ఏళ్ళ చరిత్ర కలిగిన తాండాలు నేడు కనుమరుగవుతుంటే ఊహించుకుంటేనే ప్రాణం తరుక్కుపోతుందని వాపోయారు. కన్నతల్లిని ఉన్న ఊరును ఉన్న పలానా విడిచిపెట్టి వెళ్లిపోమంటే ఎక్కడికి పోయేది ఎలా పోయేదని ప్రశ్నిస్తాడు. తాండా చుట్టూ అల్లుకున్న అనుబంధాలు, ఆప్యాయతలు, అనురాగాలు, అమ్మకు ప్రేమతో నిర్మాణం చేసుకున్న దేవాలయంలాంటి మట్ (ఘూట్)లను వదిలేసి ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోండి డబ్బులు ఇచ్చేస్తానంటే వెలకట్టలేని తాండా జీవితానికి ఖరీదు కట్టగలరా అని అంటాడు.

.... నా మెడలో 'త్యాగశీలి'
బోర్డొకటి వేలాడుతూ ఉంది...
ఆ బోర్డు తగిలించిన
నన్ను భుజాలపై మోస్తున్న
వారినొక్కటే అడిగేది
నన్ను ముంచే నీరు పారే

పాలాల్లో ఒక ఎకరం/అదే ధరకు నాకిచ్చి
మీరు బోర్డు ఒకటి తగిలించుకోమంటున్నా....
(మరో లదణి –ఆంగోత్ వెంకట్ పవర్)

నిజమే బంజారాలు త్యాగశీలులే. పూర్వము ప్రకృతిలో జీవిస్తున్న కాలంలో అడవిని వదిలి త్యాగంచేశారు. అడవి నుండి ఊర్లోకి వస్తామంటే ఊరికి దూరంగా నెట్టివేయబడి, అంటరానివారిలా ఉంటూ త్యాగం చేశారు. ఊరికి తోకలుగా మొలసిన తాండాలు. ఎప్పుడూ ఒకేలా ఉండవు. బండ్లు ఓడలవుతాయి ఓడలు బండ్లవుతాయి అన్నట్లు, భూములకు రెక్కలొచ్చి ఆకాశాన్ని తాకే వేళన ఇప్పుడైనా సంతోషంగా గుండె మీద చెయ్యి వేసుకుని హాయిగా జీవిద్దామనుకుంటే నోటికాడి కూడు లాక్కున్నట్లు, మా భూములు మాకు దక్కకుండా పోయే పరిస్థితి వచ్చిందని, ఏదోరకంగా బ్రతుకుదామంటే కండ్లల్లో నిప్పుల కుంపటి పోసుకున్నట్లు తాండాల మీద పడి ఏడుస్తుంటే, వందల సంవత్సరాల చరిత్ర గల తాండాల బ్రతుకు ఏమైపోవాలని కవి ఆవేదన చెందుతారు.

అభివృద్ధి పేరుతో నగరానికి నీళ్లు కావాలంటే వందల కిలోమీటర్లు పైపుల ద్వారా నీళ్లిస్తున్నారు కదా! నగరాల ఆకలికి తండాలు బలవుతున్నాయి. తాండాలను మింగేస్తున్నట్లు నగరాలను కూడా మింగొచ్చు కదా అలా జరగదు. పులి ఆకలికి మేక బలి కావాలిసిందే. ఇదే లోకంతీరు. ప్రాజెక్టులు తాండాలను మింగేస్తుంటే ఎక్కడికి వెళ్లాలని అడుగుతారు. నమ్ముకున్న మట్టిని వదిలేసి ఎక్కడికి వెళ్లాలని తాండాలను చంపి అదే నీటితో మీ భూములు పచ్చబడుతుంటే మీ భూములను మాకిచ్చి మీరే త్యాగశీలులు అవ్వచ్చు కదా అని అంటాడు కవి.

మమ్మల్ని మోస్తున్న మట్టిని వదిలి, చిగురిస్తున్న ఆశలను వదిలి, పెంచుకున్న బంధాలను వదిలి, తండా చుట్టూ అల్లుకున్న తీపి జ్ఞాపకాలు వదిలి ఎక్కడికి వెళ్లాలి, ఎందుకెళ్లాలని అంటాడు. బయట సమాజానికి అమాయకతాండాలే కంటికి కనిపిస్తున్నాయి. ఇక్కడ తండావాసుల జీవితం ముడిపడి ఉంది. తాత ముత్తాతల కష్టం, కన్నీళ్లు, రక్త మోడిన పాదముద్రలు, చెమట చుక్కలు మట్టిని పులుముకున్న దేహాలు, భూతల్లి ఒడిలో హాయిగా నిద్రిస్తున్న శ్రమజీవుల ఆనవాల్లు, జ్ఞానసముపార్జన అందించిన దేవాలయాలు, తాండాకోసం గొడుగు పట్టిన పంచభూతాలన్ని కనుమరుగైపోతాయని కవి ఉద్వేగ భరితంగా పేర్కొన్నారు.

పూర్వకాలంలో గోర్ పరివార్లు, బంజారాలు, (లంబాడీలు) మాతృస్వామిక వ్యవస్థలో ఉన్నట్లు తెలుస్తుంది. సప్తమాతృకలను పూజించినట్లు చరిత్ర చెబుతుంది. వీరి వివాహ వ్యవస్థలో కన్యాశుల్కం ఉండేది. నేటికీ మాతృసామ్య వ్యవస్థను గౌరవిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. బంజారాలలో(లంబాడాలు) తత్వవేత్తలు, సంతులు, బావాజీలు, సాద్‌లు, భగత్‌లు ఈ సమాజంకోసం పనిచేశారు. భూత, భవిష్యత్తు, వర్తమానాన్ని తవ్విచూసి వారి బాగోగులకోసం పనిచేశారని తెలియజేశారు. ఈ ప్రాంతంలో నివసించిన జగ్యా సాద్ చరిత్రను అతని మహిమలను తాండ ప్రజలకు ఏ విధంగా చూపించారో తెలియజేశారు. ఇక్కడ నివసించినవారి గోత్రాలు గోత్రనామాలు, వారి పూర్వీకుల వయసును నిర్ధారించి, వంశవృక్షాన్ని చాలా చక్కగా వివరించారు.

"...గోర్ భాయ్ మేలుకో!
"ముట్టీ " బిగించి గట్టిగా నిలదీంచు
" అపణ్ తాండేమా అపణ్ రాజ్యం
చావణుకన్
నంగార మారన్ జాతేన్ జగావో
జాత్, వాతేన్ బచావో" (మరో లదణి – ఆంగోత్ వెంకట్ పవార్)

"గోర్ భాయ్" అనే దీర్ఘ కవితలో బంజారాలు పుట్టుక, సంస్కృతి సంప్రదాయాలు, జీవన విధానం పండుగలు, ఆహార నియమాలు, సప్తమాతృకలు,బంజార పుణ్యపురుషులు, పుట్టుక, తాండా న్యాయవ్యవస్థ బంజారాలకు జరుగుతున్న అన్యాయాలను పిడికిలి బిగించి నినదించి పోరాడాలి. మన తాండాలో మన రాజ్యం కావాలని నంగారభేరి మోగించి జాతిని మొత్తం ఐక్యం చేయాలని సూచించారు.

ఎనిమిది పదుల స్వతంత్ర భరతావనిలో గోర్ బంజారాల జీవితం దారం తెగిన గాలిపటమేనా, **"...పాలమూరు పచ్చబడుతుంటే / నేను మాత్రం ఎండిపోవాల్నా .....?** అని ప్రశ్నిస్తాడు. ఇక్కడ నేను అంటే ఏకవచనం కాదు, బహువచనమని అర్థం చేసుకోవాలి. ఒకప్పుడు పాలమూరు ప్రాంతంలోని లంబాడీలు పూణే, ముంబైకి పొట్ట చేతపట్టుకుని దేశం కాని దేశంలో ఆకలి, అవమానభారాల్ని భరించి, జీవితాన్ని గడిపిన రోజులు లెక్కలేనన్ని ఉన్నాయంటారు. ఇప్పుడిప్పుడే పాలమూరు పచ్చబడుతుందని ఆశలు నింపుకుంటే తాండా మీద పిడుగు పడ్డట్టు అయింది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన తాండాకు ఖరీదు కట్టే రోజు వస్తుందని కలలో కూడా ఊహించలేదని, అలాంటి రోజు సమీపిస్తున్నదని భూమికి డబ్బులు కాదు భూమికి భూమి ఇస్తే బాగుంటుందని, డబ్బిస్తే జీవనానికే సరిపోదని, ఇక్కడి ఎకరా భూమికి బదులు వేరేచోటన పది గుంటల భూమి కూడా రావడంలేదని, ఉన్న డబ్బు విలాసాలకు వాడుకుంటే, చివరికి బిక్షం ఎత్తుకొని బతకవలసి వస్తుందేమోనని, అలా జరగకుండా నీటి ప్రాజెక్టులలో నిర్వీర్యమైపోతున్న తాండావాసుల భవితవ్యానికి భరోసా కల్పించాలని తన ఆవేదనను వెలుబుచ్చారు.

రచయిత: సహాయ ఆచార్యులు
తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతాఫల్ మండి

పుస్తక
పరిచయం

దళిత జీవన ప్రతిబింబం - నెమలి కన్నులు

దాసరి శ్రీనివాస్

భారతీయ సమాజంలో, కులాన్ని బట్టి, వారు చేసే వృత్తిని బట్టి విలువ, సమానత్వం అనేవి లభిస్తున్నాయి. చాతుర్వర్ణ వ్యవస్థలో సమాజాన్ని కులాలుగా విభజించి, వారికి వృత్తులు అంటగట్టారు. అంటరానితనాన్ని, అసమానతలను దళితులపై చూపించి వారిపై ఆర్థిక, సాంస్కృతిక దాడులు నేటికి చేస్తూనే ఉన్నారు. ఇది అన్ని రంగాలలో కనిపిస్తున్నది. ఎన్నో అవమానాలను దాటుకొని ఎంతో కృషి చేసి ఉన్నతమైన రంగాలలో ఉన్నవారికి కూడా ఈ అసమానత, అంటరానితనం, చిన్నచూపు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితులను దాటుకొని, ఎంతోమంది విద్యార్థులకు, పాఠకులకు, తెలుగు సాహితీ లోకానికి తన రచనల ద్వారా సాహిత్య సేవ, సామాజిక సేవ చేస్తూ అటు సాహిత్య రంగంలో, ఇటు సమాజంలో తమదైన ముద్ర వేసుకొని సాహిత్యంలో ఎన్నో గౌరవ పురస్కారాలను అందుకొని ఎంతోమంది పెద్దల మన్ననలను పొంది, ప్రొఫెసర్‌గా ఎదిగిన సామాన్య వ్యక్తి ప్రొ. దార్ల వెంకటేశ్వరరావు. కవిగానే కాకుండా రచయితగా, వక్తగా, విమర్శకుడిగా, వ్యాసకర్తగా విభిన్న రంగాలలో తనదైన కృషిని చేస్తున్న అరుదైన వ్యక్తిత్వం ఆయనది.

దళిత సాహిత్య కెరటం దార్ల:

తెలుగు సాహితీ చరిత్రలో ఆచార్యులుగా, దళిత రచయితగా, విమర్శకులుగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కేంద్రంగా ఎంతో మంది పరిశోధకులకు, ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. సమకాలీన సాహిత్యాంశాల మీద నిరంతరం యువతను దృష్టి సారించేలా చేస్తూ తెలుగు సాహిత్యానికి ఎంతో కృషి చేస్తున్నారు. విద్యార్థులకు అటు అంతర్జాలంలోనూ, సమాజంలోనూ, సామాజిక మాధ్యమాలలోనూ పత్యక్షంగా పరోక్షంగా అందరికీ చేరువలో ఉంటున్నారు. సాహిత్య రచనలోనూ వెనకడుగు వేయకుండా విద్యార్థి దశ నుంచే ఎన్నో వ్యాసాలు, రచనలు, పరిశోధనా గ్రంథాలు, దళిత సాహిత్యంతో పాటు, సృజనాత్మక సాహిత్యంలో తనదైన కృషి సల్పుతున్నారు. ***'నెమలి కన్నులు కవితా సంపుటి, 'దళిత తాత్వికుడు, దళిత సాహిత్యం మాదిగ దృక్పథం', బహుజన సాహిత్య దృక్పథం'*** వంటి దళిత సాహిత్య విమర్శ గ్రంథాలతో పాటు ***'నెమలి కన్నులు'*** ఆత్మకథను (2003. మొదటి భాగం – బాల్యం) పాఠకులకు అందించారు. నెమలి కన్నులు చదువుతున్నంత సేపు పాఠకులు అనుకోకుండానే బాల్యంలోకి తీసుకెళ్లి దళితుల జీవిత చరిత్ర కళ్ళముందు దర్శనమవుతుంది. గత కొన్ని దశాబ్దాల దళిత ఆర్థిక, సాంస్కృతిక, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను, సంబంధ బాంధవ్యాలను, స్నేహాన్ని, విలువలను తమ ఆత్మకథ ద్వారా మళ్ళీ చిగురింపజేశారు దార్ల.

ఒక్కో మెట్టు ఎక్కుతూ జీవితంలో ఎన్నో మలుపులు, వయసుకు మించిన బరువులు, బాధ్యతలతో ఎదిగిన దార్లవారి బాల్య జీవితంలోని బాధల గాథే ఈ 'నెమలి కన్నులు' ఆత్మకథ. తన ఆత్మకథను రాయటానికి కారణం ఏమున్నది అని అనుకున్నపుడు

'బాల్యం కొంత మందికి ఆటల పల్లకి
బాల్యం కొంత మందికి పూల పరిమళం
కానీ నా బాల్యం అలా సాగలేదు
ఒక్కోసారి నిప్పుల కుంపటి,
ఒక్కోసారి ముళ్ల కిరీటం. . , "

అని నాలుగు వాక్యాల్లోనే ఆరు పదుల జీవితాన్ని చూపించారు. తన జీవితంలోని సంఘర్షణలను రికార్డు చేసి, భవిష్యత్తు తరాలకు అందించడమే ధ్యేయంగా రచనకు పూనుకున్నట్లు భావించవచ్చు.

దళిత సాహిత్యాగ్ర'హారం' ఆచార్య దార్ల:

'ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు' గారు 'అంబేద్కర్ కోనసీమ జిల్లా, చెయ్యేరు అగ్రహారంలో 'శ్రీ లంకయ్య, పెదనాగమ్మ' గారి మూడవ కుమారుడుగా జన్మించారు. తన ఇంటి పేరు, ఒంటి పేరులో ఉన్న రాజసం తన బాల్య జీవితంలో లేదు. ఎన్నో ఇబ్బందులతో, అసమానతలతో సాగిన జీవితం, అత్యున్నత స్థాయికి ఎదగాలి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి సమాజంలో ఆర్థికంగా, సాంస్కృతికంగా ఎదిగినప్పుడే మంచి గౌరవం దొరుకుతుంది అని బాల్యంలో అమ్మా, నాన్నలు చెప్పిన మాటలను, వారు కుటుంబం కోసం చేసిన కష్టాన్ని, వారు స్వయంగా ఆ చిన్న చేతులతో చేసిన కష్టాన్ని అమ్మానాన్నలకు తోడుగా ఉంటూ ఎదిగిన తీరు, సమాజంలో చిన్నవయసులోనే అనుభవించిన ఎన్నో అవమానాల, సంతోషాల అనుభవాలను మూటగట్టి 'నెమలి కన్నుల' ద్వారా ప్రతిబింబించారు.

ఎన్నో ప్రయాసలకోర్చి పుట్టి పెరిగిన ఊరిలోనే మొదటిగా ప్రభుత్వ ఉద్యోగాన్ని, జూనియర్ కళాశాల, డిగ్రీ

కళాశాల లెక్చరర్‌గా (2001) ఎంపికయ్యారు, 2004నుండి 'హైదరాబాదు విశ్వవిద్యాలయం', తెలుగుశాఖలో అధ్యాపకుడిగా పనిచేస్తూ 'తెలుగుశాఖకి అధ్యక్షులుగా' వ్యవహరించి తెలుగుశాఖను ఎంతో అభివృద్ధి పథంలో ముందుండి నడిపించారు. దళిత సాహిత్యానికి ఎంతో కృషి చేసి 'దళిత', 'బహుజనుల', కష్టాలను, జీవన సాఫల్యతను, తాను బాల్య జీవితంలో చేసిన ఆ చిన్న చేతుల పని విధానం ప్రతీ పాఠకుడిని తట్టిలేపుతాయి. దళిత తాత్వికతను, దళితులను చైతన్యం చేసే కవితలను, తన ఇతర గ్రంథాలలో తెలియజేసారు.

ఈ ఆత్మకథను ఆత్మకథనాత్మక పద్ధతిలో నిర్మించి, వైవిధ్యాన్ని ప్రదర్శించారు. 'దళిత తాత్వికత, సద్విమర్శనా ధోరణి' మేళవింపుతో ఈ రచన సాగింది. 'పాఠకులకు', పరిశోధకులకు ఈ 'నెమలి కన్నులు' ద్వారా ఒక వ్యక్తి మీద గాని, వారి గ్రంథాల మీద గాని 'కవి జీవిత విమర్శ' పద్ధతిలో పరిశోధన చేసి వారి ఆలోచనా దృక్పథాన్ని మరింత సులభతరం చేసి అన్నీ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు సుపరిచితులను చేసినప్పుడే ఆ రచయితకు వారి గ్రంథాలకి వారి ఆలోచనకి సరైన సఫలత. ఈ విషయంలో దార్ల వారు ముందే ఉన్నారు. ఇంకా మిగిలిందల్లా దార్ల వెంకటేశ్వరరావు గారి సాహిత్యం రాబోయే తరం పాఠకులకు చేరటమే. తన జీవిత అనుభవాలను, ఎదిగిన తీరును, విధి, విధానాలను పోగేసి ఒక క్రమ పద్ధతిలో రాసిన గ్రంథమే ఈ "నెమలి కన్నులు" ఆత్మకథ.

దార్ల కథా కావ్యం - నెమలి కన్నులు:

తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియల్లో 'ఆత్మకథ' కూడా ఒక ప్రక్రియ. ఆత్మకథ రాయడమంటే మామూలు విషయం కాదు. అందరూ రాసేది కాదు, రాసినా అటువంటి వాటివల్ల పాఠకులకి, రచయితకి ప్రయోజనం ఉండకపోవచ్చు. 'అరిస్తే కవిత్వం, పరిస్తే పద్యం, స్మరిస్తే కావ్యం' అన్నట్లుగా కాకుండా, రాసిన ఆ ఆత్మకథకి కూడా ఓ అర్థం, పరమార్థం, ప్రయోజనం ఉండాలి. అలాంటి ప్రశ్నలతోటే మొదలైంది నెమలి కన్నులు ఆత్మకథ. దానిని ఆత్మకథగానే కాక "ఆత్మకథా కావ్యం" అని పిలువవచ్చు. ఎందుకంటే విమర్శా పరంగా చూసినప్పుడు ఇందులో కావ్యనాయకుడు, పాత్రలు, ఒక్కో పాత్రకి ఒక్కో కథలా చెప్పుకునేలా కనిపిస్తాయి. నదీ వర్ణనలు కనిపిస్తాయి, ఓ కుటుంబ వ్యవస్థ, దళిత జీవన, సామాజిక అవసరాలు, అసమానతలు, చిన్న చిన్న ఆనందాలు, దుఃఖ భరితమైన భావాలూ ఈ రచనతో అవగతమవుతాయి. ఇక్కడ సహజంగానే రచయిత విమర్శకుడు కూడా అవడం వల్ల ఆత్మకథను ఒక పద్ధతిలో సహజత్వాన్ని కోల్పోకుండా అవసరమైన ప్రతీ విషయాన్ని పాఠకుల మనస్సుకు చేరే విధంగా బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు.

ప్రామాణిక తెలుగు భాషలోనే పదాలను ఉపయోగిస్తూ, దళిత వాదాన్ని, ప్రతిబింబించేలా తన బాల్య జీవితాన్ని పూరించారు. తూర్పు గోదావరి అంటే భాషలో కొంత మార్పు కనిపిస్తుంది అనుకుంటాం కానీ రచయిత ఆ ధోరణిలో ఏ మాత్రం వెళ్లలేదు. ఎటువంటి ప్రాంతీయ మాండలికం కనిపించదు. ఈ 'ఆత్మకథ' సామాజికులను, విమర్శకులను సమకాలీన సమాజానికి, ఆనాటి వ్యవస్థలోని వ్యవహారాలను వాస్తవికంగా ఆలోచింపజేస్తుంది. ఈ సమాజంలో సామాన్య మానవుని జీవితంలో దళిత, బహుజనులు, పరిశోధకులు, విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు చదువుతున్నంత సేపు, ఇప్పటి కాలంలోనూ మన కళ్ల ముందుహౌ కనిపిస్తాయి. కావున వారు ఎదుర్కొన్న సవాళ్లను, 'దళిత వాదాన్ని' తన ఆత్మకథను భూమిపుత్ర దిన పత్రికలో 'ధారావాహికగా' ప్రచురించారు. తర్వాత గ్రంథరూపంగా నేడు అందుబాటులోకి తెచ్చారు.

'Poetry is the criticism of life. 'జీవిత విమర్శనమే కవిత్వం' (మాథ్యూ ఆర్నాల్డ్) చెప్పినట్లుగా, రాసింది ఆత్మకథే అయినా వ్యక్తిగతంగా దార్ల విమర్శకుడే కావున స్వంతంగా తన జీవితాన్ని తాను సద్విమర్శ చేసుకునట్లుగానే ఉంటుంది. ఎక్కడా పలాన విషయాన్ని దాచినట్లుగా లేదు అనిపించదు. బాల్యంలో జరిగిన విషయాలను పూస గుచ్చినట్లుగా వివరించారు. ఆ బాల్యంలో ఎంతో సాధారణ, అసాధారణ విషయాలను అవగతం చేసారు. తల్లిదండ్రుల ప్రేమను వాత్సల్యాన్ని, అన్నదమ్ముల, స్నేహితుల అనుబంధాలను నిజాయితీగా వివరించారు.

ఊరికి చివరి గుడిసెలో బతికే వాళ్ళం.
కులం అంట గట్టిన అవమానాల్ని
ఇంకా మోయక తప్పని వాళ్ళం.
చూపుల్తో, మాటల్తో నేటికీ
నిత్యం నలిగిపోతున్న వాళ్ళం.
తాత ముత్తాతల నాటి నుండీ మడులూ,
మాన్యాలు మాకేమీలేకపోయినా
తరతరాలుగా వెంటాడుతున్న వృత్తుల్ని
నిస్సహాయంగా చేస్తున్న వాళ్ళం.
ఆ అవమానాల్ని అనుభవిస్తున్న వాళ్ళం.

అంటూ మాదిగల నిస్సహాయ స్థితిని వాక్య రూపంలో కళ్ళముందు ఉంచారు. ఇప్పటికీ మాదిగల జీవితాలలో ఏ మార్పు లేదు. ఆ అసమానతలూ పోలేదు. ఏదో కాస్త చట్టాలకు భయపడి సమానంగా ఉన్నట్లు ప్రవర్తించడం నేడు అందరం చూస్తున్నదే. ఈ పరిస్థితుల నేపథ్యంలోంచి ఈ గ్రంథాన్ని పాఠకులకు చదువుతున్నంత సేపు ఒక కథా కావ్యంలా వాక్యాలు ముందుకు తీసుకెళ్తుంది. పాఠకులను ఒక భావోద్వేగానికి గురిచేస్తుంది. ఇక్కడ మనం విశ్వనాథుని కావ్య నిర్వచనం గుర్తుచేసుకోవచ్చు. ***'వాక్యం రసాత్మకం కావ్యం'.*** రసాత్మకమైన వాక్యము కావ్యము అవుతుందని విశ్వనాథుడు కావ్యాన్ని నిర్వచించాడు. 'నెమలి కన్నుల' ద్వారా దళిత వాడల

మనసుల్లో ఉన్న ఆర్ద్రతను రసాత్మకమైన వాక్యాల ద్వారా తెలియజేసి, తన రచనను కావ్యంగా రూపుదిద్దాడు.

బాల్యంలో అందరికీ సంతోషాలే ఉండవు. అలాగని చెప్పుకోలేని కష్టాలు కూడా ఉండవు. ఒక దళిత ఉమ్మడి కుటుంబంలో పుట్టి పెరిగిన ప్రతీ సామాన్య మానవుని దార్ల ప్రస్తావించిన కొన్ని సంఘటనలు మనస్సుని కదిలేలా చేస్తాయి. ఇంట్లో నలుగురు పిల్లలుంటే నలుగురూ ఏదో ఒక పనిలో తోడుగా చేయవలసిందే. పది సంవత్సరాలు వచ్చే లోపే పూర్తిగా ఎద్దులను మేపడం, గడ్డి కోయడం, చెలకలో గడ్డి కుప్పలు తీయడం వంటి పనులు చేస్తూనే బడికి వెళ్ళడం వంటి పనులు చదువుతున్నంత సేపు కళ్ళముందు దార్ల గారి వేదనాభరిత జీవితం కనిపిస్తుంది. దళితుల జీవితాలు చిన్నప్పటి నుండే ఏవో పనులకు, పటేల్ పొలాలకు కూలీలకు వెళ్ళడం, అమ్మాయిలకి అబ్బాయిలకి, తప్పకుండా ఆదివారం వచ్చిందంటే, లేదా సెలవులు వచ్చాయంటే తప్పకుండా పత్తి ఏరడానికో, లేదా గడ్డి కలవాడానికో వెళ్లాలి. ఎందుకంటే పండగలకో, హాస్పిటల్ ఖర్చుకని ముందే దొరల దగ్గర పైసలు తీసుకోవడం దళితుల్లో ఇప్పటికీ సాధారణ విషయమే. అక్కడ మాదిగలకు వేరే నీళ్లు, శూద్రులకు వేరే నీళ్ళు ఉపయోగించడం ఇప్పటికీ కొనసాగుతున్న వైనమే. అయినా చాలామంది ప్రశ్నిస్తే ఎన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందో మనందరికి తెలిసిన విషయమే. కానీ, వాటికి దార్ల గారు జడుసుకోలేదు. ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఈ గ్రంథంలో అనేక చోట్ల చూడవచ్చు. అటువంటి సందర్భమే తనని ఇలా ప్రశ్నించేలా చేసింది. పాడైన అన్నం వేసినపుడు తినకుండా ***"మామ్మ గారూ... దీన్నే మీ మనమలకు పెట్టారా'*** ? అని ప్రశ్నించడం ఆ వయస్సుకి సాహసమనే చెప్పాలి.

'నాన్న మాకు అప్పుడప్పుడూ కాత్రేని కోనలో జరిగే శనివారం సంతలో పాత బట్టలు కొనుక్కొచ్చేవాడు' అంటూ తన చిన్ననాటి సందర్భాన్ని గుర్తు చేసుకున్నప్పుడు చాలామంది అది కనెక్ట్ అవుతుంది. వేసుకోవడానికి బట్టలు లేని సమయంలో చిరిగిపోయిన, మాసిపోయిన బట్టలేసుకొని పాత బట్టల్లో కొత్తదనాన్ని చూసుకోని సంతోషంగా మురిసిపోవడం సాధారణంగా పేదింటి కుటుంబాలలో నిరంతరం ఉండేదే.

'ఒక్కరోజు పాలేరు పనికి వెళ్ళినప్పుడు వాళ్ళు పెట్టిన పాడైన ఆహారం తినడం కోసం ఎంత ఇబ్బంది పడిన సందర్భాన్ని ఒకదాన్ని నెమలి కన్నులలో ప్రస్తావించారు. ఈ వ్యాసకర్తకు ఇటువంటి అనుభవమే ప్రత్యక్షంగా ఉంది. ఒకరోజు రెడ్డి వాళ్ళ పొలంలో వరిగడ్డి మోపులు మోపేయడానికి వెళ్ళినపుడు రాత్రి మిగిలిన చారు, నాకు అన్నంలో వేయడం ఇప్పటికీ గుర్తే. పాడైన ఉల్లిగడ్డల వాసన ఇంకా పేదరికాన్ని గుర్తు చేస్తూనే ఉన్నది. 'దళితులకు ఇల్లు కట్టుకోవటానికి గుంట జాగ కూడా లేని పరిస్థితుల్లో దొరల భూముల్లో "దానిలో గుడిసెలేసుకోండ్రా. . . " అక్కడ దెయ్యాలు తిరిగేవని కూడా ప్రచారం జరిగిందట! అయినా దెయ్యాలే దళితుల్ని చూస్తే పారిపోతాయిలే అని దార్ల వెంకటేశ్వరరావు అన్న మాట వాస్తవం. కోల్పోవడానికి ఏమి లేని మనుషులకు, ప్రాణం ఒక లెక్కకు కాదు. దళితులు దాదాపుగా యాభై యేళ్ల కింద ఊరికి దూరంగా గవర్నమెంటు పంచిన ఇల్ల స్థలాలలోనే గుడిసెలు వేసుకునేవారు. అక్కడ ఉండే చెట్లు, తుప్పలను నరికి ఇల్లు వేసుకోవడమే ఉండేదట. తెలుగు రాష్ట్రాలలో అవే ఇండ్లు, ఇప్పటికీ కొన్ని ఊర్లలో చివరకే ఉన్నాయి.

"మన వాళ్ళకి సొంత భూముల్లేవు కదా. . . అయితే మనం గవర్నమెంటు మనుషులన్నమాట." అనే వాణ్ణి అని దార్ల వెంకటేశ్వరరావు ఒక సందర్భంలో అంటారు. ఇప్పుడు కూడా దళితులను రిజర్వేషన్లు పొందుతున్నారు. మార్కుల్లో మీకు తక్కువ వుంటాయి, మీకు జాబులు త్వరగా వస్తాయి, మీకేంటి మీరు గౌరుమెంటు మనుసులురా బాబు అని ఊర్లో పటేల్లు, రెడ్లు, వాళ్ళను చూసి కొందరు శూద్రులు కూడా అలాగే అంటుంటే అయితే వచ్చి మీరు కూడా ఎస్సీ సర్టిఫికేట్ తీసుకోండి అనేవాన్ని. కానీ దార్ల వారు ప్రశ్నించిన తీరు చూడండి. ***'అన్నిచ్చినా మాకు మీలాంటి ఇళ్ళులేవేంటి సార్?'*** అని ముక్కు మీద వేలేసుకునే సమాధానం ఇవ్వడమే సరైంది అనిపిస్తుంది.

'వినాయక చవితికీ, విజయ దశమికీ పదేసి రోజుల చొప్పున పండుగ చేస్తారు. ఆ దేవాలయాల్లోకి దళితులకు ప్రవేశం లేదని చెప్పలేం. మాకూ ప్రవేశం ఉందని చెప్పడానికే తప్ప వాళ్ళ ముఖాల్ని చూస్తే అర్థ గాంభీర్యం అర్థమవుతుంది'. అని దార్ల వారు చెప్పటం, యేళ్ల తరబడి దళితుల మీద దేవాలయ ప్రవేశం వంటి సాంస్కృతిక దాడులు, ఖండిస్తూనే వెనక వున్న బాధను, వారి కుసంస్కారాన్ని తెలియజేశారు. వాస్తవానికి గ్రామాల్లో ఇప్పటికీ మాదిగలు కానీ మాలలు కానీ 'అయ్యప్పస్వామి' మాలలు వేసినా, 'ఆంజనేయ స్వామి' మాలలు వేసినా వారికి అన్నదానాల్లో సమానత్వం లేదు. ఒకవేళ అన్నదానం చేయాలనిపిస్తే దానికి సంబంధించిన వంట సామాను అంతా వస్తురూపంలోనో లేదంటే నగదు రూపంలో ఇస్తే ఆ శూద్రులైనా ఎవరో ఒక స్వామి ఇంట్లో చేయించటం ప్రత్యక్షంగా చూడవచ్చు. కొన్ని సంవత్సరాల క్రితం కనీసం ఈ అవకాశం కూడా లేదు. ఇంకా పూర్తి మార్పు రావాలంటే దళితులు ఆర్థికంగా ఎదిగినప్పుడు కూడా అంత సులభం కాదనే చెప్పాలి. ఇప్పటికీ గ్రామాల్లో బతుకమ్మ పండుగను దళితులు చేయరు. ఒకవేళ చేసినా ఊరంతా ఒకసారి వెలితే, తర్వాత మాదిగలు వెళ్తారు. ఊరిలో బోనాలు పండగా అంతే ఊరంతా ఒకసారి వెళితే దళితులు అన్ని పూజలూ ఐపోయాక వాలందరూ ఇంటికి వెళ్ళాక ఈ మాల మాదిగలు వెళ్తారు. విచిత్రం ఏంటంటే ఈ మాదిగ పెద్దలే ఊరంతటినీ డప్పు చప్పుళ్లతో, విన్యాసాలతో

ఊరేగింపు చేస్తూ తీసుకొస్తారు. 'అదే ఒక హిందువు చనిపోతే, అది కూడా దళితేతరులైతే చూడ్డానికి వెళ్ళినా, ఆ కార్యక్రమాలు అన్నింటిలోనూ అందరూ పాల్గొనరు. కానీ దహన లేదా ఖననానికి సంబంధించిన పనులన్నీ ఈ మాదిగలే చేయాలి. అది చేసినందుకు వారికి ఎంతోకొంత నగదు, మద్యం పోసి పంపిస్తారు. పొద్దంతా డప్పులు వాయించి ఆ మద్యం తాగి కునుకుతీస్తారు. చెప్పుకోవడానికి ఇబ్బందిగా ఉన్నా ఇప్పటికీ దళితులు చేస్తున్నది, వారికి జరుగుతున్నదీ ఇదే .

"రాత్రులు ఆ పొలంలోనే ధాన్యం రాసులు కాపలా కాస్తూ పడుకునే వాళ్ళం. చిన్న అలికిడైనా వెంటనే లేచి చూసే వాళ్ళం. చాలామంది ఆ పొలమూ, ఆ కొబ్బరితోటా మాదే అన్నట్లుగా మేము పని చేస్తున్నామనేవారు". పైన చెప్పుకున్నట్లు, మాల మాదిగలలో ఎవరైనా సరే ఇప్పటికీ ఒక్కరికే పనికి వెళు ్తంటే, వ్యవసాయానికి సంబంధించిన పని అంటే కూలీలను తీసుకెళ్లడం కూలీలకంటే ఎక్కువగా పనిచేయటం, నమ్మకస్తులుగా ఉంటూ వాళ్ల కోసం ఏదైనా చేస్తాం అనే విధంగా వాళ్ళే చూసుకుంటుంటే నాకూ అలాగే అనిపిస్తుంది. ఇలాంటి ఎన్నో విషయాలను దార్ల వారు ఈ ఆత్మకథను నెమరు వేసుకోని దళితుల చిత్తశుద్ధిని, నమ్మకాన్ని, పనిచేసే దగ్గర చూపెట్టే నిజాయితీనీ, వాస్తవికతను అర్థం చేసుకోవచ్చు. ఇంకా 'మంగలి వృత్తి, రజకుల వృత్తి వారు చేసే వృత్తిని దళితులకు చేయడానికి వెనుకాడే విధానాన్ని నాన్నని, మనకెందుకు చేయరు నాన్నా అడగటం' తెలియని విషయాన్ని తెలుసుకోవాలనే ఉత్కర్ష చిన్నప్పటి నుండే మెండుగా ఉన్నదన్న వాస్తవానికి నిదర్శనం దార్ల వారు అంచలంచెలుగా ఎదిగిన విధానమే.

శ్రమ విలువ తెలిసిన దార్శనికుడు దార్ల :

'నాలో జ్ఞాన బీజాల్ని మొలకెత్తించిన
ఆ రజకులంటే నాకు గౌరవం మొదలైంది.
నాలో నిత్యం జీవితమంటే యుద్ధమన్నట్లు
విజయభేరీ మోగించే శబ్ద ధ్వనులేవో వినిపించిన
ఆ రజకులంటే నిలువెత్తు శ్రమ
సంకేతాలన్నట్లనిపించింది
వాళ్ళు పని పట్ల చూపే అంకితభావం
నాలో గొప్ప ఆత్మవిశ్వాసానికి ప్రేరణ కలిగించింది.
పొద్దున్నే పొద్దునే లేపే వాళ్ళ సమయపాలన
నాకో ఆదర్శాన్నిచ్చింది.

ఇప్పుడు రజకులు ఈ వృత్తికి చాలా చోట్ల దూరంగా వుంటున్నారు. కానీ కొన్ని ప్రత్యేక సందర్భాలలో అంటే పెద్దవారి పెద్ద కులస్తుల ఇళ్ళలో ఎవరైనా చనిపోయినప్పుడు లేదంటే ఏదైనా శుభ కార్యములు జరిగినప్పుడు చేసే కార్యక్రమాలకు వృత్తి పరంగా వెళ్తున్నారు. ఎక్కువగా బట్టలు ఇస్త్రీ చేయడంలో చాలా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఎంతమంది తెచ్చినా ఎవరి బట్టలు మళ్ళీ వారికి తేడా లేకుండా ఇస్తారు. వారు మన బట్టలు ఉతకడానికి వెనకాడినా, వారి వృత్తిలో సమయ పాలనని పాటించే విధానాన్ని గౌరవించి, వారి చిత్తశుద్ధిని ఆదర్శంగా తీసుకొని వారి నిజాయితీ గల వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. అందుకే ఈరోజు దార్ల వారు ఉత్తమ విమర్శకులు అనటంలో ఎలాంటి సందేహం లేదు. 'దారీ తెన్నూలేని ఆ బ్రాహ్మణ చెరువు గట్టుని బాగుచేసి, దారి చేసినందుకే వాళ్లకి 'దార్ల' అనే ఇంటి పేరొచ్చిందని చెప్తుంటారు. ఇలా 'దార్ల' ఇంటి పేరు, 'వేంకటేశ్వర రావు' ఒంటి పేరు, 'అగ్రహారం' అనే ఊరి పేర్లు దార్ల వారికి కొంత గౌరవాన్ని, లేదంటే కొంత ఇసుమంత మానసిక ఆనందాన్ని ఇచ్చి ఉండవచ్చు. ఈ గ్రంథంలో "కంటికి కనిపించేదే నిజమనుకోకుమురా కంటికి కనిపించని నిజముందని మరిచిపోకుమురా" ఈ వాక్యము ద్వారా ఒక వ్యక్తి సమాజంలో గాని, నిజ జీవితంలోగాని, పరిశోధనలో గాని ఒక విద్యార్థికి గాని, సామాన్య మానవునికి గానీ ఉండవలసిన మొదటి లక్షణముగా చెప్పుకోవాలి.

ముగింపు :

"వూరికి చివరి గుడిసెలో బతికే వాళ్ళం, కులం అంటగట్టిన అవమానాల్ని ఇంకా మోయక తప్పని వాళ్ళం, చూపులతో మాటలతో నేటికీ నిత్యం నలిగి పోతున్న వాళ్ళం" అనే ఈ మాటలు ఆత్మకథలోని వాక్యాలు మాత్రమే కాదు దళిత జీవన సాక్ష్యాలు. అలాగే మాకేమీ భూములు, మాన్యాలు లేకపోయినా మాకు అంటగట్టిన వృత్తుల్ని చేస్తూ, ఎంత ఉన్నత స్థాయికి వచ్చినా వాళ్ళ కళ్ళల్లో ఇంకా వృత్తిని కళ్ళల్లో పెట్టుకుని అవమానిస్తున్న వారే ఎక్కువ. అలాంటి సాక్షీభూతం అయిన 'నెమలి కన్నులు' ఆత్మకథ అంతా చదివితే దార్ల వారి బాల్య జీవితంలో పడిన సంతోషాలు, కష్టాలు, నష్టాలు, వ్యవసాయ, పనుల్లో, కూలీ పనుల్లో, ఇంటి పనుల్లో, చదువులో ఎన్నో పనుల్లో ఒక పాఠకుడిగా నా కళ్ళముందు కొన్ని తారనవడ్డాయి, ఆ జ్ఞాపకాలన్నీ మన మననుని ఆలోచింపజేస్తాయి.

ఆ అసమానతలే, అవమానాలే, ఆ పరిపూర్ణ ఆలోచనలే, ఆ ముక్కు సూటి ప్రశ్నించే వాస్తవిక తాత్వికతే నాటి నెమలి కన్నులు కవిత్వంగా, నేటి నెమలి కన్నులు ఆత్మకథగా, అలాగే బాల్యం తర్వాత 'వయోజన జీవితకాలంలో' జరిగిన విషయాలు, సంఘటనలు రేపటి కథా కావ్యంగా అవతరించి పాఠకులకు స్ఫూర్తిని, జ్ఞానకీర్తిని ప్రసాదించే 'ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు'గారి జీవిత గాథే ఈ 'నెమలి కన్నులు' ఆత్మకథ.

ఆధార గ్రంథాలు:

1. వేంకటేశ్వరరావు, దార్ల . 2003. నెమలి కన్నులు. (ఆత్మకథ). డోకి పర్రు. కస్తూరి విజయం ప్రచురణలు.
2. అంతర్జాల వ్యాసాలు: https://vrdarla.blogspot.com/

★ **రచయిత: పరిశోధక విద్యార్థి, హెచ్‌సియు**

పుస్తక
పరిచయం

చేదునాదు జీవితాన్ని కల్లుధారగా వొంపుతున్న కవి

తగుళ్ళ గోపాల్

ఇది బీసి సాహిత్యం పూత పూసి, కాపు కాస్తున్న ఉద్యమకాలం. బీసిలంతా చైతన్యమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తున్న కాలం. మరుగున పడుతున్న సంస్కృతిని కాపాడుకుంటూనే బీసిలు తమ అస్తిత్వాన్ని, గోసను ఎల్లబోసుకుంటున్న సమయం. వెనుకబడిన కులాలను సామాజికంగా వెనుక పడేసిన కుట్రలను విప్పి చెప్పుతున్న తరుణం.

ముప్పై ఏండ్ల కిందటనే జూలూరి గౌరీ శంకర్ సంపాదకత్వంలో వచ్చిన 'వెంటాడే కలాలు - వెనుకబడిన కులాలు' సంకలనం బీసి అస్తిత్వపు ఉనికిని చాటింది. జయప్రకాశ్ 2019లో 'బీసి కవిత' సంకలనం తీసుకొని వచ్చారు. అట్టెం దత్తయ్య బీసి వాద సాహిత్యం మీద విలువైన పరిశోధన చేసి పుస్తకం తెచ్చాడు. డా. సంగిశెట్టి శ్రీనివాస్ బీసివాదం కోసం పనిచేస్తూ తన పరిశోధనలతో బీసి జీవితపు సాహిత్యం ఎక్కడున్నా కండ్లకద్దుకుంటూ చరిత్రకెక్కిస్తుండు. డా. చింతం ప్రవీణ్ బీసి ఫోరం ఏర్పాటు చేసిండు. చాలా మంది బీసి కవులు తమ మొదటి సంపుటాలలో జీవిత మూలాలను తెలిపే కవితలు రాశారు. ఒకట్రెండు కవితలే రాసిన బలమైన గొంతు వినిపించారు. మరికొంత మంది కవులు పూలే స్ఫూర్తితో దీర్ఘ కవితలు రాసి బీసి జీవితంలోని చీకటి కోణాలను ప్రపంచానికి చెప్పారు.

అన్నవరం దేవేందర్ 'బువ్వకుండ'లో కుమ్మరి జీవితం ఉంది. స్వర్ణకారుల జీవితం లోకానికి తెలియడానికి బాణాల శ్రీనివాస రావు 'కుంపటి' రాజేసిండు. చేనేత కార్మికుల మగ్గం గుండె చప్పుడును డా. రాధేయ 'మగ్గం బతుకు'లో వినిపించాడు. బెస్త వాళ్ళ గురించి మునాసు వెంకట్ రాసిన 'ఎన', 'వర్జీ' కవితలు చెరువొడ్డుకు తీసుకుపోతాయి. మంగలి జీవితం సాధకబాధకాలను చెబుతూ వనపట్ల సుబ్బయ్య 'అసిపె'ను భుజాన వేసుకొని ధిక్కార గొంతు వినిపిస్తున్నాడు. గొర్లను మర్లేసుకుంటు చిక్కొంద్ర రవి 'మందసూర్యుడు'గా రాబోతున్నడు. ఈ. రాఘవేంద్ర గౌడ జీవితాన్ని 'కల్లంచల బువ్వ' తెచ్చాడు. ఈ వరుసలో గౌడ కులస్తుల చేదునాదు జీవితాన్ని కల్లుధారగా వొంపిన డా. తండా హరీష్ గౌడ్ 'వంకతాడు' దీర్ఘ కవిత చెప్పుకోదగ్గది.

దీర్ఘకవితలో 'ధార' ముఖ్యం. ఎత్తుగడను ఏ ఉద్వేగంతో మొదలు పెడుతామో ముగింపు వరకు ఆ ఉద్వేగ ధార కొనసాగడం ఎంతో ముఖ్యం. బ్రీత్‌లెస్ సాంగ్ లాగ గుక్క తిప్పుకోకుండా పాడే పాటలాంటిది దీర్ఘ కవిత నిర్వహణ. దీర్ఘ కవిత ఒక ప్రవాహంలా సాగిపోవాలి. మధ్యలో ఎక్కడ తెగినా నీళ్ళు వృధాగా పొయ్యే అవకాశం ఉంది. అందుకే దీర్ఘ కవిత నిర్వహణ కష్టంతో కూడుకున్నది. దీర్ఘ కవితలో తీసుకున్న అంశానికి సంబంధించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలను స్పర్శించడానికి, విస్తృతంగా చర్చించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. వంకతాడు దీర్ఘ కవితలో కూడా గౌడ జీవితానికి సంబంధించిన ఈ నాలుగు కోణాలకు సంబంధించిన అనేక అంశాలు ప్రతిఫలిస్తాయి.

తండా హరీష్ గౌడ్ ఈ దీర్ఘకవితలో మొదటి, రెండవ భాగాల్లో గౌడన్నల రూపురేఖలను, కల్లు గీయడానికి

అవసరమయ్యే కత్తులు, కల్లు గీసే తీరును చిత్రించాడు. ఇరవై భాగాలుగా సాగిన ఈ దీర్ఘ కవితలో తాటిచెట్టుతో గౌడన్న అనుబంధం, కల్లు గీసే తీరు, ప్రపంచీకరణ తర్వాత గౌడన్న జీవితం, మండువ వాతావరణం, గౌడ తల్లుల గుండె దైర్యం, లైంగిక వేధింపులకు గురయ్యే గౌడ స్త్రీలు, వాడిక పట్టె జనం, ముంజల వర్ణన, తాటిపండ్ల కోసం పరిగెత్తి బాల్యం, ప్రభుత్వాలు గౌడన్నకు ఆర్థిక భద్రత కల్పించడం, వైన్ షాపుల వలన కల్లు ప్రాధాన్యత తగ్గడం, అన్ని రంగాల్లోను గౌడులు ఎదగడానికి దారి చూపడం మొదలైన అంశాలన్నీ చిత్రించబడ్డాయి. గౌడ జీవితం గురించి మాట్లాడుకుంటున్నప్పుడు కొంపెల్లి వెంకట్ 'ముస్తాదులు కదులుతున్నాయి', అంబటి వెంకన్న 'కల్లుపాట', మునాసు వెంకట్ 'వొంపులతాడు', 'తాళ్లమటం' కవితలను తప్పకుండా గుర్తుచేసుకోవాలి.

నీటి దీపం, ఇన్ బాక్స్, గాలిలేని చోట – ఈ కవితా సంపుటాల ద్వారా తనదైన సంతకంతో మంచి గుర్తింపు పొందాడు హరీష్ గౌడ్. వీటిల్లో తాటివనం యాదిలా, మరో చెట్టు పుట్టుక కోసం కవితలు గౌడ జీవితానికి సంబంధించిన కవితలే. సామాజికంగా గౌడులు బిసి–బి కి చెందినవారు. తాటి, ఈత చెట్ల మీదనే ఆధారపడి జీవిస్తుంటారు. గౌడ కులస్తుల కుల దైవం కాటమయ్య. కౌండిన్య మహర్షి సంతతి వారు గౌడులని వేదాల్లోని పురాణ కథలు చెబుతున్నాయి. మోకు, ముస్తాదును భుజాన వేసుకొని పోయే ప్రతి గౌడన్నలో కాటమయ్య దేవుడిని గుర్తుకు తెచ్చుకుంటూ ఈ దీర్ఘ కవిత మొదలౌతుంది. ఇది ఒక రకంగా కులదైవాన్ని మనసులోనే మొక్కుకొని వాళ్ళ జీవితంలోకి వెళ్ళడం . కాటమయ్య దేవుడి ప్రస్తావన అనేక చోట్ల కనబడుతూ ఆ జీవితాన్ని ఉన్నతీకరిస్తాడు.

మోకు, ముస్తాదు, గుజి
జబ్బలకు, నడుముకు, చేతికి
తగిలిచ్చుకొని
బాటెంట పోతూ
అచ్చం కాటమయ్య తండ్రినే
తలపిస్తవు

చెట్టే గుండెకాయ
చెట్టే కాటమయ్య తండ్రి నీకు

కాటమయ్య పండుగ, గ్రామ దేవతలకు కల్లు సాకబోయడం మొదలైన సాంస్కృతిక అంశాలన్నీ ఈ దీర్ఘ కవితలో కనబడుతాయి. కల్లు గీయడం ఎంత నైపుణ్యంతో కూడిన విద్యనో చెబుతాడు . కల్లుతో ముడిపడిన గ్రామీణ సంస్కృతి చిత్రించాడు.

గ్రామీణ జీవితాన్ని, కల్లును విడదీసి చూడలేము. తండా హరీష్ గౌడ్ ఈ దీర్ఘ కవితలో కల్లు గొప్పతనాన్ని గానం చేస్తున్నాడు. అనాదిగా కల్లు బహుజనులందరికీ ఆత్మబంధువై వాళ్ళ ఆరోగ్యాన్ని ఎట్లా కాపాడిందో చెబుతున్నాడు. ఊర్లలో చుట్టమొస్తే కల్లు తెచ్చె ఒక మర్యాదను మళ్ళీ గుర్తు చేస్తున్నాడు.

తాడు దిగంగనే
మోదుగాకులో, మర్రి ఆకులో
తెంపుకొచ్చి ఇచ్చి
కల్లు ఒంపుతూ
లోకాన్నంతా గిర్రున తిప్పే
చక్రమవుతవు

ఏ గశి
గొంతులకు పోకుండా
ఆకులతోనే బుచ్చ చేసి
ఒక్క నలుసు కానరాని
అచ్చమైన కల్లును
పట్లు పట్లుగా వంచుతవు

శ్రమ చేసి అలిసిపోయిన బహుజనులందరికీ దూప తీర్చింది కల్లు. గర్భిణీ స్త్రీలు కల్లు తాగితే సుఖ ప్రసవం అవుతుందని నమ్మకం. కిడ్నీలో రాళ్లు కరిగిపోవడానికి 'కల్లు' గొప్ప ప్రకృతి వైద్యం. 'కడుపును కడిగేసుకున్నట్లు తాగేటోళ్ళం' అని ముందు తరం తాతలు చెప్పే మాటలు వింటుంటే ఇదివరకు కరువు కాలంలో బహుజనుల కడుపు చూసిందీ, దూప తీర్చింది కల్లు అని స్పష్టంగా అర్థం అవుతుంది.

" చల్ల కంటె కూడా కల్లు గొప్పదంటూ
తాగేటి జనులే పెరిగిపోతారమ్మా !!

అని కల్లు గురించి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అంటాడు. బిడ్డ పుడితే పురుడు చేయడానికి కల్లు. మనిషి మరణిస్తే చేదు పాపుకోవడానికి కల్లు. ఏ పండుగకైనా కల్లు సాక పెడితేనే దేవత మెచ్చుతది. ఇయ్యాల 'గట్టికల్లు' బంగారం అయ్యింది. మందుకల్లు రాజ్యమేలుతుంది. దీనికి ప్రధాన కారణం కల్లు కంపెనీలు అన్ని గౌడన్నల చేతుల్లోంచి వ్యాపారస్తుల చేతులకి మారడమే. వైన్స్ వచ్చిన తర్వాత కల్లు తాగేవారు తక్కువ అయ్యింద్రు. ఊర్లలో వైన్ షాపులే సగ భాగం ఆక్రమించినాయి. గౌడుల వృత్తికి గౌరవప్రదమైన హోదా కల్పించడమే ఈ దీర్ఘ కవిత లక్ష్యాల్లో ఒకటి. గౌడన్న గీసే

కల్లుకు అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చిన్నాడే గౌడన్న జీవితం బాగుపడుతుంది.

పల్లె ప్రకృతి వనాలను కాపాడే పర్యావరణ వేత్త 'గౌడ'. చెట్టు మొదలుకు దండం బెట్టి చెట్టు పచ్చగా ఉన్నన్ని నాళ్ళు జీవితం పచ్చగా ఉంటుందని నమ్మే వన ప్రేమికుడు 'గౌడ'. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు వచ్చినంక చెట్టు ఉనికి, గౌడ అస్తిత్వ ఉనికి ఎట్లా ప్రమాదానికి నెట్టి వేయబడిందో తేటతెల్లం చేస్తాడు కవి. చెట్టుతో, ప్రకృతితో పెనవేసుకపోయిన గౌడన్న జీవితాన్ని అక్షరబద్ధం చేశాడు.

ఎండాకాలంలో తాటికమ్మల గుడిసె ఇచ్చే సలువదనం ఏ.సిలు కూడా ఇవ్వలేవు. తాటిమొద్దులను దూలాలకు వాడుకుంటారు. తాటి కమ్మలతో బొమ్మలు చేసే బాల్యం అందరికీ గుర్తుండే ఉంటుంది. తాటికమ్మలనే తాళపత్రాలుగా రాసేవారని అంటారు. తాటికమ్మలను చీరి దొప్పలాగ 'రేక'లను తయారు చేసి కల్లు పోస్తుంటారు. తాటి చెట్టుతో ముడిపడిన ఇలాంటి అనేక విషయాలను ప్రస్తావిస్తూ తాటి చెట్టు గొప్పతనాన్ని చెబుతాడు కవి.

రెండంచుల పదునున్న కత్తి మీద నడక గౌడన్నది. ఏ మాత్రం కనురెప్ప మూసి తెరిచినా, తుఫాన్ గాలులు వీచినా చెట్టు మీది నుంచి తాటిపండు రాలిపడ్డట్టే రాలిపోవడం తన విషాద గాథ. అడవికి పోయిన మనిషి ఇంటికొచ్చిందాంక గ్యారంటీ లేని జీవితం తనది. అందుకే వాళ్ళ కోసం ప్రభుత్వాలు పథకాలు పెట్టి భద్రత కల్పించాలని కవి గౌడన్నల పక్షాన తన డిమాండ్లను తెలియచేస్తున్నాడు.

హరీష్ గౌడ్ గౌడ జీవితాన్ని ఎక్కడా రొమాంటిసైస్ చేయడం లేదు. వాళ్ళ సాహసం చెబుతూనే తాళ్లు ఎక్కడం ఎంత కష్టంతో కూడుకున్నదో వాస్తవాన్ని చెప్పి కండ్లు తెరిపిస్తున్నాడు. తాళ్ళు ఎక్కడం ఎంతో నైపుణ్యంతో కూడినది. గుజి బంధం కాళ్ళకు చుట్టుకొని ఎక్కడం వలన కాళ్ళు, చేతులు, వీపు మొత్తం నల్లని కాయలు కాసి వాతలు పడి ఉంటుంది. చెట్టు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తేళ్ళు, తేనెటీగలతో ప్రమాదం పొంచి ఉంటది. ఇంత కష్టపడినా చివరకు గౌడన్నకు

"పచ్చబొట్టు పొడిపిచ్చుకున్నట్టు
కాళ్ళకు, చేతులకు బర్రలు తప్ప
మిగిలిందేముంది ? అని ప్రశ్నిస్తున్నాడు.

గౌడ జీవితాన్ని చిత్రించడం వరకో, తన విషాదగాథను కండ్లముందు పెట్టడం వరకే ఆగిపోలేదు. ప్రపంచీకరణ వలన గౌడన్న మోకు, ముస్తాదు తెగి ఎక్కడ పడిందో చూపిస్తున్నాడు. గౌడన్న పోసిన కల్లు తాగి మెచ్చుకున్నోళ్ళే, గౌడన్న చనిపోతే ఆ కుటుంబానికి పచ్చి మంచినీళ్ళు ఇవ్వని ప్రభుత్వాలను నిలదీస్తున్నాడు. రైతు బంధు, రైతు భీమా ఉన్నట్టే వాళ్ళ ప్రాణాలకు రక్షణ చూపండని అడుగుతున్నాడు. రియల్ ఎస్టేట్ వచ్చి భూమి ప్లాట్లుగా మారుతుంటే చెట్టు దిక్కు చేయిపెట్టి చూసే గౌడన్న ముఖ చిత్రం ఎట్లుందో ఎరుక పరుస్తున్నాడు.

ఈ దీర్ఘ కవితలో మరో ముఖ్యమైన అంశం గౌడ స్త్రీ జీవితాన్ని చెప్పడం. ఆకాశానికి ఎగబాకుతూ గౌడన్న ఎంత గుండెధైర్యంతో కల్లు గీస్తాడో, గౌడ స్త్రీ కూడా అంతే గుండెధైర్యంతో గౌడన్నకు తోడుగా నిలుస్తుంది. లొట్లు, కుండలు కడిగి కల్లు అమ్మడం గౌడ తల్లి చూసుకుంటుంది. ఒకప్పుడు నాలుగైదు కిలో మీటర్లు నడిచి రెండు పూటలా కల్లు మోసుకొని వచ్చే వాళ్ళు. తండాలు తిరిగి కల్లు అమ్మేవారు. కల్లు తాగడానికి వచ్చిపోయే జనం కామపు చూపుల నడుమ నిత్యం లైంగిక వేధింపులకు గురవుతూ ఉంటారు. వీటన్నింటి గురించి హరీష్ గౌడ్ తన కవితలో మాట్లాడారు.

ఇయ్యాల అన్ని ఊర్లలోను కుల సంఘాలు ఏర్పడ్డాయి. కమ్యూనిటీ హాల్స్ కట్టించుకుంటున్నారు. ఏ సమస్య వచ్చినా వాళ్ళలో వాళ్ళే పరిష్కరించుకుంటున్నారు. చదువు ద్వారానే, రాజ్యాధికారం ద్వారానే బహుజనుల జీవితాల్లో మార్పు వస్తుందని, రాజకీయ అస్తిత్వానికి సంబంధించిన ఎరుకతో ఈ దీర్ఘ కవిత ముగుస్తుంది.

సర్వాయి పాపన్న
రాజ్యం ఏలినట్టు
మచ్చలేని అధికారులు కావాలె

ఇటు వృత్తిని
ముందు తరాల చదువును
సమాంతరంగా నడుపుకుంటూ
రెండువైపులా
పదునుతేలాలే

బహుజనులను కలుపుకుంటూ
ఒకరికి ఒకరంగా
ఆసరా ఉంటూ
చరిత్రకో
కొత్త పేజీనివ్వాలె!

'సర్వాయి పాపన్న' ఒక చారిత్రక ప్రతీక. ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని కవి

కోరుకుంటున్నాడు. ఈనాడు ప్రజాస్వామ్యంలో గెలవడానికి బీసిలు అంతా ఏకం కావాలి అని ఆత్మగౌరవ ప్రకటన చేస్తున్నాడు.

పుట్టిన ఊరికి, బాల్యానికి, కులవృత్తి జీవితాలకు దూరంగా పరుగెడుతున్న కాలంలో మళ్ళీ మూలాల్లో కెళ్ళి 'జీవితాన్ని దేవులాడుకోవడం' ఎంతో కష్టం. హరీష్ గౌడ్ ఒక ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నప్పటికీ కవి మూలాలు ఈ తాటిచెట్టు కిందనే ఉన్నాయి. బాల్యమంతా తాటివనం నడుమనే సాగింది. అందుకే బాల్యంలో తాను చూసిన అనేక దృశ్యాల్లోంచి కవిత నడుస్తుంది.

తిన్నాక వదిలేసిన
ముంజలతో
పిల్లలకు బండ్లు చేసిచ్చి
ఆటబొమ్మల కరువు తీరుస్తవు

మూడు కన్నుల తాటి ముంజల్ని వొలిచి ఇచ్చినట్లు అపురూపమైన మన బాల్యాన్ని మన చేతికిస్తాడు. తాటి ముంజలతో బండ్లు చేసి ఆడుకున్న బాల్యాన్ని, రాలిన తాటి పండ్లను దాసుకొని తిన్న బాల్యాన్ని మళ్ళీ ఒకసారి ఈ దీర్ఘ కవితలో చూస్తాము.

ప్రతి కులవృత్తి చుట్టూ ప్రత్యేకమైన జీవితం, పదసంపద అల్లుకొని ఉంటుంది. సంస్కృత మరకలు అంటని తెలుగు భాష ఇంకా సజీవంగా ఉన్నది కులవృత్తి జీవితాల్లోనే. కులవృత్తి జీవితాల్లో వాడే పనిముట్లను, ఆ జీవితానికే ప్రత్యేకమైన మాటలను ఆధారంగా 'వృత్తి పద కోశాలు' వచ్చాయి. ఎన్ని వృత్తి పద కోశాలు తయారు చేయగలిగితే భాషకు అంత మేలు జరుగుతుంది. తండా హరీష్ గౌడ్ 'వంకతాడు' దగ్గరికి వెళ్ళినపుడు కూడా గౌడన్నలు వాడే కత్తులు, కుండలు, తాళ్ళ రకాలు, తాటి చెట్టుతో ముడిపడిన గ్రామీణ పదజాలం ఎంతో దొరుకుతుంది. నురుసు, లొట్టి, మండువా, గీత కత్తి, గుజి బంధం, మోకు, మొదలైన పదాలు ఎన్నో కనబడుతాయి.

మట్టలను చెలిగి చెట్టు పైకెదిగేటట్లు చేసే పనితనం గౌడన్న కత్తికి ఉన్నట్లుగానే అనవసరపు విషయాలను తీసేసి వాక్యాన్ని సానబట్టడం హరీష్ గౌడన్న కలానికి ఉంది. తన బలం ప్రధానంగా అభివ్యక్తిలో ఉంటుంది. వాక్యం వాక్యంలోను తనదైన కళాత్మక దృష్టి కనబడుతుంటుంది. కొత్త అభివ్యక్తితో, ఆధునిక జీవితపు సంఘర్షణలను కవిత్వీకరించే హరీష్ గౌడ్ వాక్యానికి గౌడ జీవితం తోడయ్యింది. అందుకోలేని తాటి చెట్టును అబ్బురంగా చూసినట్టుగానే తన ఊహ అబ్బురపడేలా చేస్తుంది.

గౌడన్నను ***'ముంజల దేశానికి*** రాజును చేస్తాడు ఈ కవి. చల్లని ముంజలను ఇచ్చే తాటివనాన్ని 'ముంజల దేశం' అనడం ఎంత గొప్ప ఊహ. అది కూడా వాస్తవానికి ఎక్కడా దూరంగా జరుగని ఊహ. ముంజలను 'మూడు కన్నుల చందమామ' గా చెప్పడం కూడా కవి ఊహా శక్తిని తెలియజేస్తుంది.

'కూకుడు బద్దకు పదును పెట్టడం' గౌడన్నకు తెలిసిన తాళపత్ర విద్యగా చెప్పతాడు. ఈ వాక్యాలు చదువుతుంటే తాటి కమ్మలతోనే తాళపత్రాలు తయారు చేసిన ప్రాచీన కాలం గుర్తుకు రాకుండా పోదు. ***"బొగ్గు గీతల్లోనే/ రూపాలు లెక్క బెట్టుకుంటవు"*** అనే వాక్యం చదివినపుడు మా ఊర్లో చిన్నప్పుడు కల్లు పోసి గుర్తుగా బొగ్గు గీతలు గీసుకునే గౌండ్ల పార్వతక్క గుర్తొచ్చింది. కల్లును వాడిక పట్టి తాగే జీవితాలను దగ్గరగా చూపించే సూక్ష్మమైన పరిశీలన ఇది. ఇలాంటి చిన్న చిన్న విషయాలే జీవితంలోని అనేక పొరలను చూపుతుంటాయి.

ప్రభుత్వాలు, నాయకులు, దళారులు ఏదో ఒక రకంగా గౌడన్న జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్న వాళ్ళే. వాళ్ళ ఆటలు కట్టెయాలన్న విషయాన్ని ఎంత వ్యంగ్యంగా, గౌడ జీవితంలోని పోలికతో ఎట్ల చెప్పిండో మీరే చూడండి.

'లొట్టికి బొక్కపెట్టి
ఉన్న కల్లు జుర్రక ముందే
కోతి వేశాల ఆట కట్టెయ్యాలే'

ఊర్లలో దొంగతనంగా కల్లు తాగే విషయాన్ని దళారులకు అన్వయించి చెప్పడంలోనే కవి పనితనం ఉంది. "ఎచ్చోడు ఎచ్చిమాట/ పచ్చోడు పచ్చిమాటన్న" గౌడ తల్లి పట్టించుకునేది కాదంటాడు కవి. ఎచ్చోడు , పచ్చోడు అనే ఆ మాటలు , ఆ నుడికారం ఎట్లా వస్తుంది? జీవితం ముందు దోసిలి పడితేనే కదా.

నిత్యం కత్తులతో సావాసం చేసే గౌడన్న జీవితం గురించి చెబుతూ "కత్తి అటు ఇటు అయితే/ చేయంతా రక్తపు మడుగే" అంటాడు. కత్తి తెగి ధారలు కారే దృశ్యాన్ని తక్కువ మాటల్లోనే బొమ్మ కట్టిస్తాడు. గౌడులకు ఆశ్రిత కులాలైన గౌడజెట్టి, యెనూటి వాళ్ళు తరతరాలుగా గౌడ పురాణాన్ని పటం కథలుగా చెబుతూ గౌడ చరిత్రను భద్రపరిచారు. కాలక్రమేణా పటం కథలన్ని కనుమరుగౌతున్న క్రమంలో , ఒకప్పటి కుల పురాణాల స్థానంలో దీర్ఘ కవితలు, పాటలు రావల్సివ అవసరం ఎంతైనా ఉంది. ఈ 'వంకతాడు' గౌడుల జీవితాన్ని, సాహసాలను , గ్లోబలైజేషన్ తర్వాత గౌడుల ఉనికిని పటం గట్టి చూపెడుతున్న దీర్ఘ కవిత . ఇదివరకు గౌడ జీవితం మీద ఎంతో సాహిత్యం వచ్చినా గౌడ జీవితం కేంద్రంగా తెలంగాణ నుంచి వస్తున్న మొదటి దీర్ఘకవిత ఇది.

★ రచయిత: ఉపాధ్యాయుడు

పుస్తక
పరిచయం

సంక్షోభ కాలపు సవాల్ 'కంకపాద'

డా. పసునూరి రవీందర్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన డెబ్బై తొమ్మిదేండ్ల తరువాత వెలువడిన తొలి తెలుగు ఆదివాసీ కవితా సంపుటి 'కంకపాద'. ఈ కవయిత్రి కుంజ కళ్యాణి. సాంస్కృతిక పరాయీకరణకు గురవుతున్న ఆదివాసీల జీవితాల్లోని అలజడి ఈ పుస్తకంలోని కవిత్వం నిండా పరుచుకుని ఉంది. ఆదివాసీల జీవితం మిగిలిన మైదాన ప్రాంత జీవితాలకు భిన్నమైంది. అందుకు కారణం వారి జీవన విధానమే. ప్రకృతికి దగ్గరగా, కల్మష కపట నాగరికతలకు దూరంగా జీవిస్తుంటారు ఆదివాసీలు. అలాంటి ఆదివాసీల జీవితం గడిచిన రెండు మూడు దశాబ్దాలుగా అనేక కుదుపులకు ఎట్లా గురవుతూ ఉందో ఈ కవిత్వం ఎలుగెత్తి చాటింది. తన స్వానుభవంలో నుండి సృజించబడిన కవిత్వం ఇది. ఆదివాసీ గూడేల్లో వస్తున్న మార్పులను ఒడిసి పట్టుకుని, ఆ గాయాలను ఈ కవిత్వం నిండా గేయాలుగా ఆలపించడం మనకు కనిపిస్తుంది. అభివృద్ధి పేరుతో ఆదివాసీల జీవితాల్లో పాలకులు చేస్తున్న విధ్వంసం తాలూకు కుట్రలు ఇందులో బట్టబయలు చేయబడ్డాయి. ప్రాజెక్టుల కింద నలిగిపోతున్న గిరిజన జీవన శకలాలే ఈ కవితలు. గూడెం వదిలి గూడును వదిలిన పక్షిలా వలసలు పోవడం నిత్యకృత్యంగా మారిన గుండె ఘోష ఈ కవిత్వం.



ఇప్పటి దాకా తెలుగు సాహిత్యంలో ఈ రకమైన కవిత్వం లేదు. అందుకు కారణం ఈ సమూహాల నుండి కవులు తక్కువగా ఉండడమే. మల్లిపురం జగదీష్, మేశ్రం మనోహర్, పద్దం అనసూయ వంటి వారు వేళ్ల మీదికే పరిమితం. ఈ గొంతులు పెరగకపోవడానికి కారణాలను అన్వేషించాలి. తెలుగు సాహిత్యంలో అస్తిత్వ గొంతుకలు అనగానే గుర్తుకువచ్చే దళిత, స్త్రీ, ముస్లిం వాదాలే ప్రధానం అయ్యాయి. గడిచిన అర శతాబ్దంగా తెలుగు కవిత్వం పరిపూర్ణం అవడానికి ఈ గొంతుకలే నూతన సాహిత్య సృజనను తెలుగుకు అందించాయి. ఇప్పుడు ఇప్పటిదాకా ఉన్న ఒక లోటును పూడ్చాల్సిన చారిత్రక అవసరంగా ఈ 'కంకపాద' పుట్టింది. ఇది మహావృక్షంలా విస్తరించాల్సిన ఆవశ్యకతను సూచిస్తున్నది. ఆదివాసీల మాతృభాష తెలుగు కాదు. వారికి వారిదైన కోయ, గోండి వంటి భాషలు ఉన్నాయి. వాటికి లిపి లేకపోవడం వల్ల వారు తమ భావాలను పరాయి భాషల్లోనే వెలువరించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఆదివాసీ పరిశోధకుడు కె.విద్యాసాగర్ ప్రకారం దేశంలో ఇప్పటి వరకు వివిధ భాషల్లో కవిత్వం రాస్తున్న ఆదివాసీ కవుల సంఖ్య పాతికకే పరిమితమైంది. ఇప్పుడు ఇరవై ఆరవ కవయిత్రిగా కుంజకళ్యాణి ఈ కంకపాదను పాఠకుల ముందుకు తెచ్చింది. ఈ కవిత్వంలో ఆదివాసీ నుడికారం ఉంది. అది వారి జీవద్భాషలో ఉంది. తమవైన పదాలను వాడుతూ తెలుగు భాషకు కొత్త పదాలను చేర్చడం హర్షనీయం. అందుకే ఈ కవిత్వం వైవిధ్యమైంది. ఆదివాసీ గూడేల్లో జీవన విధానం ఎలా ఉంటుందో, వారి భాషా సౌందర్యం ఎంత గొప్పగా

ఉంటుందో ఈ కంకపోద చదివినప్పుడు పాఠకులు తెలుసుకుంటారు. తమ అమాయక జీవితాల్లో ఉండే అనేక జీవన సందర్భాలను కవిత్వంగా పలికించి చూపెట్టింది కవయిత్రి కళ్యాణి కుంజ. ఆదివాసీ జీవితం చుట్టూ అల్లుకున్న మమతాను బంధాలకు కవిత్వ రూపాన్ని ఇచ్చింది.

కేవలం ఆదివాసీ గూడేల జీవితమే కాదు, అడవి సరిహద్దుల్లో ఉండే గ్రామాలు, ఆ గ్రామాల్లో ఉండే సబ్బండ జనంతోటి తమ సంబంధ, బాంధవ్యాలు ఎంత ఆత్మీయంగా ఉంటాయో కూడా ఈ 'కంకపోద' కవితల్లో బొమ్మ కట్టించింది. అట్లా పలు జీవన సందర్భాలను దృశ్యమానం చేయడంలో ఈ కవయిత్రి సఫలీకృతం అయ్యింది. ఆదివాసీ జీవితం తెలియని వారికి కంకపోద చదివినప్పుడు అడవిని చాలా దగ్గరగా దర్శించిన అనుభూతి కలుగుతుంది. సమాజాన్ని చరిత్ర కేవలం బాహ్యం పరిధుల నుండి అర్థం చేయిస్తే, సాహిత్యం దాని అంతర్గత స్వరూపాన్ని పట్టి చూపుతుందనే మాట మనకు ఈ కవిత్వం చదివినప్పుడు స్ఫురణలోకి వస్తుంది. అమాయకత్వానికి నిలువెత్తు నిదర్శనంగా జీవించే ఆదివాసీల జీవన శైలిని వర్ణించడం గిరిజనేతరుల వల్ల కాదు. దానిని అనుభవించిన వారే చెప్పినప్పుడు వచ్చే ఆ సజీవత ఈ కంకపోద కవిత్వం నిండా కనిపిస్తుంది. ఆదివాసీలకు ప్రకృతితో పెనవేసుకొన్న జీవితంలో నుండి ఒక ప్రాకృతిక తాత్విక జీవన విధానం అలవడుతుంది. అలా తరతరాలుగా వారు అలా అడవిలో జీవిస్తున్నారు.

"తనువంత గాయాలు తల్లడిల్లినగాని
పిల్లంగోగ్గై పాడు ఏటిపాట
అడవి తీర్గనే అనీన మూసీ
అసుమంత చేట చేయని
అమాయక సూపుల నిసుర
నిటారుగా నిలబడు పిడాలు"(కంకపోద)అంటూ ఆదివాసీ జీవితం ఎట్లా ఉంటుందో పరిచయం చేసింది ఈ కవయిత్రి కళ్యాణి కుంజ.

ఇవాళ ఆధునికత, అభివృద్ధి మాటున ఆదివాసీలను అడవుల నుండి తరిమి వేస్తున్న దుర్మార్గాలు నిత్యకృత్యం అయ్యాయి. ఈ దారుణాలను ప్రత్యక్షంగా అనుభవించిన ఒక కవయిత్తి తన గుండె గొంతుక నుండి ఆ బాధను, దు:ఖాన్ని రాస్తే ఎలా ఉంటుందో ఈ కవిత్వం చదివినప్పుడు పాఠకులకు అనుభవంలోకి వస్తుంది.

"అచ్చంగా...అవ్వలాగనే మా గూడెం
దేవుళ్లతో పాటు అందర్ని ఆదరించిన
ఇయ్యాల అవ్వలాగనే మూగబోయింది
మంచె మీద వడిసెలేస్తే
పిట్టల్లా ఎగిరిపోతున్న మా గూడాలు
ఇప్పుడిప్పుడే 'కొత్త తూగు'ల్ని ఎత్తుకుంటున్నయ్"(కొత్త తూగు)అంటూ మారుతున్న ఆదివాసీ గూడేల బతుకు చిత్రాన్ని ఆవిష్కరించింది. ఇందులో 'తోగు'అనే మాటకు పారే నీటి ఊట అని ఆదివాసీ భాషలో అర్థం. ఇలా ఆదివాసీ జీవితంలో ఉన్న పలు కోణాలను మనకు పరిచయం చేయడం. ఆ గూడెంలో తన కుటుంబ సంబంధాలతోపాటు వైదాన ప్రాంత బహుజనులతో ఉండే అనుబంధాన్ని కూడా ఈ కవయిత్రి చక్కగా కవిత్వీకరించారు.

"జకముకరాయి కొడుతాంటే
మనసుకి జమిడికేసిన సంతోషం
కొట్టు కొట్టుకీ రాలిపడు నక్షత్రాల నిప్పులు
దూదంటుకుని దూపమేసినట్టు పొగ
నిప్పు రాజేసుడెర్కైంది అయ్యతోటే గదా!
తాత ముత్తాతలే కదా
దునియాకి వెలుగు నేర్పింది"(జకముక) అంటూ ఒక ధిక్కారాన్ని ప్రకటించింది. ఈ దేశ మూలవాసులే చరిత్ర నిర్మాతలు. మహాత్మ జ్యోతిరావు పూలే "ఈ దేశానికి వలస వచ్చిన ఆర్యులకు, ఇక్కడి మూలవాసులకు నిరంతరం జరుగుతున్న యుద్ధమే భారతదేశ చరిత్ర"అన్నట్టు దేశ నాగరికత నిర్మాణంలో ఆదివాసీల పాత్రను ఒక కవిత ద్వారా ప్రకటించింది కవయిత్రి. ఇట్లా ప్రకటించడానికి చరిత్ర పట్ల అవగాహన ఉండాలి. అలాగే చరిత్ర పొడుగునా తమకు జరుగుతున్న అన్యాయాల పట్ల అవగాహన ఉండాలి. భారతదేశంలో బహుజన కులాలు సృష్టించిన సంపద మీద, ఉత్పత్తి చేయని ఆధిపత్యకులాలకే హక్కు ఉన్నది. ఈ దుర్మార్గాన్ని అర్థం చేసుకుంది కాబట్టే కుంజ కళ్యాణి పై మాట అనగలిగింది.

ఇవాళ ఆదివాసీ జీవితం, తాత్వికత, సంస్కృతులపై జరుగుతున్న విధ్వంసం కేంద్రంగా ఈ కవిత్వం సృజించబడింది. ఈ కవిత్వాన్ని కేవలం వస్తు, శిల్ప విమర్శతో కొలవడం సరికాదు. ఆదివాసీ జీవితానుభవ స్పృహతో ఈ కవిత్వాన్ని

చూడాలి. ముఖ్యంగా సాంస్కృతిక పరంగా పరాయీకరణకు గురవుతున్న వారి జీవితాల్లో కలుగుతున్న మార్పులను పట్టుకోవాలి. ఆదివాసీలు ఈ కవిత్వం ద్వారా ఏం డిమాండ్ చేస్తున్నారో తెలియాలి. ఆ జీవితంతో మమేకం కావాలి. వారి జీవన తాత్వికతను అర్థం చేసుకోవాలి. అంతే తప్ప సాధారణ సాహిత్య విమర్శ కొలమానాలు ఈ కవిత్వానికి పనికి రావు. కొత్త తూనికరాళ్లు కావాలి. అది మానవీయ స్పర్శతో ఉండాలి. అప్పుడు మాత్రమే ఈ కంకపొద కవిత్వం అర్థమవుతుంది.

"బతుకుచుట్టూ తడారిన గోదారి నాలుక
మోడెంగా మిగిలిన గుడిసె చెట్టు
గతమంతా నేడు జ్ఞాపకమై
వలవల దు:ఖాన్ని విలపిత్తాంది
....
నమ్మినతనం నవ్వుల పాలై
ఇటెటు వచ్చినోడు ఇల్లాక్రమించి
ఇనుప పాదాల కింద మాయమైన అడవితనం
అభివృద్ధి పేరిట నేడు
చెట్లన్నీ శిలువల్ని మోస్తున్న అస్తిపంజరాలు!"(అడవే కావాలిప్పుడు)అంటూ ఆదివాసీల బతుకుల్లో అలుముకుంటున్న విషాదాన్ని గద్గద స్వరంతో వినిపిస్తున్నది. ఇట్లా ఈ కవిత్వం తెలుగు సాహిత్యపు సంకుచిత పరదాల పరిమితులను బద్ధలు కొడుతున్నది. కొత్తగా వచ్చి చేరడానికి ఇప్పుడు తెలుగు భాషకు టెక్నాలజికి సంబంధించిన పదజాలం తప్ప మరొకటి లేదు. ఇలాంటి సందర్భంలో ఒక ఆదివాసీ భాషాసంస్కృతుల సొగసును అద్దుతున్నది. ఈ పరిణామం వల్ల తెలుగు కవిత్వం మరింత సంపద్వంతం అవుతుంది. లేకుంటే కొన్ని సమూహాల ఉమ్మడి ఆస్తిగా అక్కడికే పరిమితయ్యే ప్రమాదాన్ని ఈ 'కంకపొద' తప్పించిందనే చెప్పాలి. నిరంతరం ప్రవహించే నదికి ఉన్న తాజాదనం, ఉన్నచోటే కుళ్లిపోయే మురికి గుంటకు ఉండదనే విషయాన్ని గమనించాలి. నది తాజాదనాన్ని తెలుగు కవిత్వానికి అద్దిన ఈ ఆదివాసీ బిడ్డ కవిత్వానికి తెలుగు సాహితీ లోకం దోసిలి పట్టాలి. ఇలాంటి కొడిగట్టిన దీపాలను కాపాడుకోవాలి.

రచయిత: కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కార గ్రహీత

కవిత

నువ్వొచ్చినప్పుడు

– సూర్యచంద్ర డి.జి.

తెగిపడ్డ కవితా పాదంలా
నరాలు మూర్ఛిల్లిన రాత్రి
నువ్వొస్తావు.
ఎడారి పెదాలపై వాన చినుకులా...

నెత్తుటి వాగుల్ని ప్రేమించే నోవామిక్స్-థర్టీలా...
నీ పొడి మాట, నీ పాద తడి
దీర్ఘం చేస్తాయి నా ఆయువును.

కుములుతున్న ప్రాణాల నెగడు నీవు.
దారి వెంట నెలవంకలా నువ్వొచ్చినప్పుడు
నిర్జన యాత్ర నిండా తురాయి పూలు

గాయాపు కొసల వెన్నెల నీ పేరు.
ఈ మునిమాపు చీకట్లో
నీ ముక్కెర వెలిగిందా...
హృదయం ఉద్దీప్తమౌతుంది సంద్రంలా
మేల్కొన్న మన జెండాలా..

తత్వశాస్త్ర మననాన్ని వింటున్నావా?
"చెర"పడ్డ పాటను చదివావా?
ఓ ప్రశ్న.
ముసురు పట్టిన ఈ కాలానికి
నువ్వే అత్యవసరం.

పరిశోధన పరిచయం

"కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం

డా. ఆర్. గోపాల్

1. పరిశోధన శీర్షిక (title of the research)

భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం అనేక సంస్థానాలున్నాయి. ఇందులో తెలంగాణ ప్రాంతంలో కూడా చాలా సంస్థానాలున్నాయి. ఈ సంస్థానాలు ఎంతో సాహిత్య సేవ చేసినవి. కవులను, కళాకారులను పోషించినవి. ఈ క్రమ పరిణామంలో మహబూబ్ నగర్ జిల్లాలోని గద్వాల, జటప్రోలు, అమరచింత, వనపర్తి మొదలైన సంస్థానాలు సాహిత్య పోషణలో ఎంతో పేరుప్రఖ్యాతులు పొందాయి. తెలంగాణలో తెలుగు సాహిత్యానికి పేరుగాంచిన వనపర్తి సంస్థానంలో సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠి, తమిళం అను అష్టభాషల్లో నిష్ణాతులైన రాజులు, కవులు ఉన్నారు. వారిలో ఒకరు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు. వీరు వనపర్తి సంస్థానంలో ఆస్థానకవిగా ఉంటు, తెలుగు, సంస్కృత సాహిత్యాలకు ఎనలేని సేవచేశారు. అందులో తెలుగు సాహిత్యానికి చేసిన సేవను ప్రధాన అంశంగా తీసుకొని కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారి జీవితాన్ని, ఆయన సాహిత్యాన్ని పరిచయం చేస్తూ 'కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం' అనే అంశం పై పిహెచ్. డి. పరిశోధన చేశాను. దీన్ని ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారి పర్యవేక్షణలో తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 2023 లో సమర్పించాను.

2. పరిశోధన లక్ష్యం (Research objectives)

మహామహోపాధ్యాయ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి రచనాశైలి ఉత్కృష్టమైంది. తర్వాతి కవి, పండితులకు అనుసరణీయమైనది. అటువంటి కవి సాహిత్యాన్ని పరిశోధకులతో పాటు సాహితీలోకానికి సాధారణ ప్రజలకు చేరువ చేయడమే నా ఈ పరిశోధన లక్ష్యం.

3. పరిశోధన ఆవశ్యకత (Importent of research)

పాలమూరు జిల్లాలోని సంస్థానములందు విశేషమైన సాహితీ పోషణలో ఎందరో కవులు తమ పాండిత్యంచేత సమాజాన్ని ప్రభావితం చేశారు. ఎందరో తెలుగు, ఉర్దూ కవుల జీవితం, సాహిత్య విశేషాల పైన పరిశోధనలు జరిగాయి. ఈ పరిశోధనలచే నేటి తరం కవులకు సాహిత్యం మరింత చేరువైంది. సమాజం సాహిత్యం వలన ఎంతో ప్రభావితమౌతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎంతో పాండిత్యం గల కవులు నేటికి అజ్ఞాతంలోనే ఉండిపోయారు. వారి సాహిత్యం మరుగునపడిపోయింది. అలాంటి వారి

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం
(KAPPAGANTHULA LAXMANA SASTRI SAHITYA PRASTHANAM)

పరిశోధన
ఆర్. గోపాల్

పర్యవేక్షణ
ఆచార్య వెలుదండ నిత్యానందరావు

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు సమర్పించిన పిహెచ్. డి
సిద్ధాంతగ్రంథం ఏప్రిల్ –2023
హైదరాబాద్ – 500007

1

సాహిత్యాని వెలికి తీసి భావితరాలకు తెలియచేయాలనే ఉద్దేశ్యంతోనే కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్యం పై పరిశోధనకు పునుకున్నాను. నా పరిశోధనలో భాగంగా లక్ష్మణశాస్త్రి పై ఇప్పటి వరకు పరిశోధన జరగలేదని తెలుసుకున్నాను. అందువలనే నేను 'కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం' అనే అంశం మీద పరిశోధన చేశాను.

4. పరిశోధన సమీక్ష (Review of research)

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్యానికి సంబంధించి ఇప్పటివరకు ఎవరు పరిశోధనలు చేయలేదు. ఈ కవి సాహిత్యం అజ్ఞాతంలో ఉండిపోయింది. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి వ్యాసాలు, అనువాదరచనలు, స్వీయరచనలు, నిఘంటు నిర్మాణం మొదలైన అన్ని అంశాలను పరిశీలించాలనే కోరికతో ఈ అంశాన్ని ఎన్నుకున్నాను. 'కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం' అనే అంశం పై ఏ విశ్వవిద్యాలయంలో కూడ పరిశోధన జరుగలేదు. వీరి సాహిత్యం పై నా పరిశోధన మొదటిది అయింది.

5. పరిశోధన పరిధి (Boundary of Research)

పాలమూరు జిల్లా సాహిత్యంలో సాహిత్య, సాంస్కృతిక, సామాజికాంశాలను చిత్రీకరించే ఎన్నో విషయాలు ఇమిడి ఉన్నాయి. ఈ జిల్లాలోని కవులు, రచయితలు, పరిశోధకులు, సాహిత్యాధ్యయన సంస్థలు మొదలైన వారు ఎందరో ఇట్టి అంశాల పైన ఎంతగానో కృషి చేస్తున్నారు. కవులు సాహిత్యం

ద్వారా సమాజాన్ని చైతన్య పరుస్తున్నారు. అలాంటి వారి జీవితాలు- సాహిత్యం ఎన్నో పరిశోధనలకు దారితీశాయి. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి జీవితం సాహిత్యాలు కూడ ఈ కోవకు చెందినవే ఈ కవి రచనలలో సాహిత్య, సామాజిక, సాంస్కృతికాంశాలు ఉన్నాయి. ఈ అంశాలతో పాటు లక్ష్మణ శాస్త్రి మహాకావ్య నిర్మాతగా, బౌద్ధ దర్శనం అనువాదకుడిగా, వ్యాస రచయితగా, సంపాదకునిగా ఇంకా ఎన్నో విధాలుగా తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించారు. ఈ అంశాలన్నింటిని వెలుగులోకి తీసుకొనిరావడమే నా పరిశోధన పరిధి.

6. సమాచార సేకరణ (Data collection)

నా పరిశోధనకు సంబంధించిన సమాచారాన్ని, నా పరిశోధన కాలపరిమితిని దృష్టిలో ఉంచుకొని సమాచారాన్ని సేకరించాను. సమాచార సేకరణలో భాగంగా లక్ష్మణ శాస్త్రి కుటింబికులను కలశాను. వారి కుమారుడు కప్పగంతుల ప్రభాకర శాస్త్రి లక్ష్మణ శాస్త్రి రాసిన ముద్రితగ్రంథాలు, అముద్రిత రచనలు ఇవడంతో పాటుగా లక్ష్మణ శాస్త్రి జీవితానికి సంబంధించిన అనేకానేక అంశాలు అందించారు. పలు పుస్తక కేంద్రాలను సందర్శించి సమాచారాన్ని సేకరించాను. ప్రముఖ రచయితలను కలిసి పుస్తకాలను సేకరించాను. పరిశోధన గూర్చి చర్చించాను.

7. అధ్యాయ విభజన (Chapter division)

అష్టభాషాకోవిదుడు, మహామహోపాధ్యాయ బిరుదాంకితులైన కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారు వనపర్తి జిల్లా, వనపర్తిలో 1911, జూలై 2వ తేదీన జన్మించారు. వీరు 1980 జనవరి10న పరమపదించారు. వీరి తల్లిదండ్రులు కప్పగంతుల పద్మావతి శ్రీనివాస శాస్త్రిగార్లు. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సమగ్ర సాహిత్యాన్ని "కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం" అనే శీర్షికతో నా సిద్ధాంత గ్రంథాన్ని రాశాను. ఈ అంశాన్ని విషయ విశ్లేషణ సౌలభ్యం కోసం ఎనిమిది అధ్యాయాలుగా విభజించాను. అవి

I. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి జీవిత రేఖా చిత్రణ

II. మహాభారత అనువాదకునిగా..

III. మహాకావ్య నిర్మాతగా...

IV. నాటక కర్తగా...

V. బౌద్ధ దర్శనం అనువాదకుడిగా...

VI. వ్యాస రచయితగా...

VII. సంపాదకునిగా...

VIII. ఇతర రచనలు...

8. పరిశోధన ఫలితాలు (Research finding)

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి జీవితం, రచనలను పరిశోధించిన తర్వాత గుర్తించిన కొన్ని ఫలితాంశాలను తెలియచేస్తున్నాను.

1. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి రచనల్లో కొన్ని అనువాదరచనలు, కొన్ని స్వీయరచనలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా వ్యవహారిక భాషను ఉపయోగించారు.

2. వ్యాసభారతాన్ని కప్పగంతుల లాక్ష్మణశాస్త్రిగారు 'యథామూలాంధ్రగద్యానువాదము' చేశారు. ఈ భారత అనువాద గ్రంథాలు గంగాప్రవాహం వలె పాఠకున్ని పఠింపచేస్తాయి.

3. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మాదిరాజు విశ్వనాథరావు గార్లు జంటగా బిల్హణమహాకవి సంస్కృత రచనలైన 'విక్రమాంకదేవ చరితం' అను చారిత్రక కావ్యాన్ని, 'కర్ణసుందరి' అను నాటికను అనువాదించారు. ఈ అనువాదాలలో వైదర్భీరీతిని అనుసరించారు. అక్కడక్కడ దీర్ఘసమాసాలతో వర్ణనలు పాఠకులకు ఒక్కింత విసుగును కలిగించిన మిగత సందర్భాలలో సరళమైన, సరసమైన పదాలను ఉపయోగించి అనువాదమును రసరమ్యంగా కొనసాగించారు.

4. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ఆంధ్రప్రదేశ్ మాసపత్రికకు, శాస్త్రీయ విజ్ఞానమునకు సంపాదకత్వం వహించారు. ముఖ్యంగా శాస్త్రీయ విజ్ఞానం అనే గ్రంథం ద్వారా వనపర్తి సంస్థాన ప్రభువులు ప్రతి ఏట నిర్వహించు సాహితీసభలు, పండుగలు, జాతరలు మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు జరిపేవారని మనకు తెలుస్తుంది.

5. 'లక్ష్మణరేఖలు' (భారతీయ సదాచార వ్యవహారకర దీపిక) అను గ్రంథంలో భారతీయ, తెలుగు ప్రజల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, కుటుంబవ్యవస్థ, ఆరోగ్యాంశాలు మొదలైనవి అనేకం కన్పిస్తాయి.

9. భావి పరిశోధకులకు సూచనలు (Suggestions for upcoming researchers)

ఉమ్మడి మహబూబ్ నగర్ (పాలమూరు) జిల్లాలో సంస్థానాలు మెండుగా కలవు. అందుకే 'పాలమూరు జిల్లా సంస్థానాల ఖిల్లా' అని పలువురి అభిప్రాయం. ఈ సంస్థానాల పాలకుల కాలంలో సాహిత్య పోషణ అత్యద్భుతంగా జరిగింది. వీరి ఏలుబడిలో అనేక మంది కవి, పండితులు విశిష్టమైన సాహిత్య రచనలు చేశారు. వీరి జీవితం, సాహిత్యాలు అజ్ఞాతంగానే ఉండిపోయాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనైనా సంస్థానాల మీద, అలాగే మరుగున పడిన కవులు, రచయితలు, కళాకారుల సాహిత్యాన్ని వెలికి తీయవలసిన ఆవశ్యకత ఎంతైన ఉంది. ముఖ్యంగా వనపర్తి సంస్థానంలో కప్పగంతుల వంటి ప్రసిద్ధ కవుల మీద పరిశోధనలు జరుగవలసిన ఆవశ్యకత ఉంది.

పరిశోధకుని వివరాలు: డా. ఆర్ గోపాల్, వేపూర్, హన్వాడ మండలం, మహబూబ్ నగర్ జిల్లా, ఫోన్: 9640258365, rajamoni89gopal@gmail.com

T

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007